

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

4.2 ఎకరాలు..
3,472 కోట్లు

ముంబైలోని నారిమన్ పాయింట్‌లో కొన్న ఆర్బీఐ

కొత్త భవన సముదాయం కోసం ముంబై మెట్రో నుంచి కొనుగోలు

2

శుక్రవారం | 12-9-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 148 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, భాద్రపదమాసం, బహుళపక్షం, తిథి: పంచమి ఉ.9.59 తదుపరి షష్ఠి, నక్షత్రం: భరణి ఉ.11.59 తదుపరి కృత్తిక, వర్జ్యం: రా.11.05 -12.33, దుర్ముహూర్తం: ఉ.8.32-9.21, మ.12.35-1.24, అమృతఘడియలు: ఉ.7.34-9.02, రాహుకాలం: ఉ.10.30-12.00, సూర్యోదయం: 6.06, సూర్యాస్తమయం: 6.16 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

కిక్కులో జగన్ పీఏ

సునీల్ రెడ్డి పేరుతో పదికిపైగా కంపెనీలు

విశాఖ, హైదరాబాద్‌లలో సిట్ అధికారుల సోదాలు

పదీ డొల్ల కంపెనీలే.. మనీ రూటింగ్‌కు ఏర్పాట్లు!


వైసీపీ హయాంలోని జే బ్రాండ్లలో 2 సునీల్‌వే

వేల కోట్ల మద్యం స్కామ్‌లో కీలక ఆధారాలు

చంచల్‌గూడలో జగన్ జైల్‌మేట్ సునీల్ రెడ్డి

జగన్ కంపెనీలన్నింటిలో డైరెక్టర్ పోస్టు

'అంతిమ లబ్ధిదారు' లెక్క తేల్చడమే మిగిలింది


నర్రెడ్డి సునీల్ రెడ్డి (ఫైల్)


విశాఖలో సునీల్‌రెడ్డి కార్యాలయాలు ఉన్న భవనం

అమరావతి, విశాఖపట్నం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): వేలకోట్ల విలువైన మద్యం స్కామ్‌లో 'సిట్' దర్యాప్తు మరో కీలక మలుపు తిరిగింది. నిత్యం జగన్ వెన్నంటి ఉండే ఆయన వ్యక్తిగత సహాయకుడు (పీఏ) నర్రెడ్డి సునీల్ రెడ్డి కంపెనీల తలుపులనూ 'సిట్' తట్టింది. గురువారం ఒకేరోజు హైదరాబాద్, విశాఖపట్నంలో సునీల్ పేరుతో ఉన్న పది కంపెనీల్లో సోదాలు నిర్వహించింది. ఈ కేసులో జగన్‌కు అత్యంత సన్నిహితులైన ఎంపీ మిథున్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, ఓఎస్డీ కృష్ణమోహన్ రెడ్డి తదితరులు నిందితులుగా ఉన్నారు. మద్యం ముడుపుల సొమ్ములు 'అంతిమ లబ్ధిదారు'కు చేరడంలో వీరి పాత్ర కీలకమని

మిగతా 13వ పేజీలో...

భారతి తర్వాతి స్థానం సునీల్‌దే..

తన పట్ల అంతులేని విధేయత చూపించడంతోపాటు వ్యక్తిగత, ఆర్థిక వ్యవహారాలు చూసుకునే సునీల్ రెడ్డికి వైసీపీ అధ్యక్షుడు జగన్ ఎంతో ప్రాధాన్యం ఇచ్చారు. తాను ఏర్పాటు చేసిన అన్ని కంపెనీల్లో సతీమణి వైఎస్ భారతి తర్వాత సునీల్ రెడ్డినే డైరెక్టర్‌గా నియమించారు. తన వ్యాపార సామ్రాజ్యంలో మొదటి స్థానం సండూర్ పవర్‌ది అయితే, రెండో స్థానం భారతి సిమెంట్స్‌ది అని జగన్ చెబుతుంటారు. అలాంటి సండూర్ పవర్.. కన్న తల్లి, చెల్లికి వాటాలు ఇచ్చేది లేదని తేల్చిన సరస్వతి పవర్ మొదలుకుని తన భార్య పేరుతో ఏర్పాటు చేసిన పలు కంపెనీల్లో సునీల్ రెడ్డిని డైరెక్టర్‌గా చేర్చారు. సండూర్ పవర్‌లోకి నిధులు మళ్లించినట్లు సీబీఐ గుర్తించిన జడ్‌ఎం ఇన్ఫోటెక్, సిగ్మా ఆక్సిజన్, సాయిసూర్య వేర్ హౌసింగ్, రెవెరా, ఎక్సెల్ ప్రోసాఫ్ట్‌లో మొదటి డైరెక్టర్ భారతి కాగా రెండో డైరెక్టర్ సునీల్ కావడం గమనార్హం.

సోదాలు జరిగిన సునీల్ కంపెనీలివే..

ఆర్ ఆర్ గ్లోబల్ ఎంటర్‌ప్రైజెస్ (వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి కుమారుడు భార్గవరెడ్డి ఈ కంపెనీకి మరో డైరెక్టర్) • గ్రీన్ స్మార్ట్ ఇన్‌ఫ్రా • గ్రీన్ టెక్ ఇంజనీరింగ్ సిస్టమ్స్ • శేఖర్ ఫౌండేషన్ • గ్రీన్ టేల్ ఎంటర్‌ప్రైజెస్ • గ్రీన్ కార్డ్ మీడియా • వయొలేటా ఫర్నిచర్స్ • గ్రీన్ స్మార్ట్ • జెస్సీస్ పెట్రో కెమికల్స్ అండ్ లాజిస్టిక్స్ • గ్రీన్ ఫ్యూయల్స్ గ్లోబల్ ట్రేడింగ్



జైల్లో లొంగిపోయిన మిథున్‌రెడ్డి

జైలు బయట వేడుకగా పుట్టినరోజు

పెద్ద సంఖ్యలో వైసీపీ శ్రేణుల హాజరు

స్తంభించిన ట్రాఫిక్.. చిక్కుకున్న అంబులెన్స్

ఇక ప్రాజెక్టులు చకచకా!

రూ.9074 కోట్ల వ్యయంతో పనులు

పెండింగ్‌లో ఉన్న ప్రధాన ప్రాజెక్టుల పూర్తికి సీఎం చంద్రబాబు గ్రీన్ సిగ్నల్

ఉత్తరాంధ్ర ప్రాజెక్టులకు రూ.2 వేల కోట్లు

వెలిగొండకు రూ.2059 కోట్లు

1404 కోట్లతో గాలేరు-నగరి విస్తరణ

కర్నూలులోని ప్రాజెక్టులకు 1685 కోట్లు

వరికపూడిసెలకు 1925 కోట్లు

'శ్రీశైలం' అభివృద్ధికి 1686 కోట్లు

ప్రాధాన్య క్రమంలో పూర్తి చేయండి: సీఎం

జల వనరుల శాఖపై చంద్రబాబు సమీక్ష

13


జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

రూల్స్ అంటూ గిరిగీసుకోవద్దు

మానవీయకోణంలోనూ ఆలోచించండి

ప్రభుత్వ విజయాల్లో కలెక్టర్లే కీలకం

సీఎం అంటే కామన్ మ్యాన్.. మీరూ అదే పాటించండి

అత్యుత్తమ పనితీరు కనబర్చండి

ప్రజలకు అందుబాటులో ఉండండి

మార్పు తేవడానికి మీకో మంచి అవకాశం

పొలిటికల్ గవర్నెన్స్‌కు పెద్దపీట వేయండి

తప్పు చేయమని కాదు.. కలిసి పనిచేయండి

ఫేక్ ప్రచారాలపై వెంటనే స్పందించండి

కలెక్టర్లకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం

అమరావతి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విజయాల్లో కలెక్టర్లే కీలకమని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. అన్నిటికీ రూల్స్ అంటూ గిరిగీసుకోవద్దని, మానవీయ కోణంలోనూ ఆలోచించి పనిచేయాలని సూచించారు. రాష్ట్రంలో 12 జిల్లాలకు కొత్త కలెక్టర్లను నియమించిన సందర్భంగా గురువారం వారితో పాటు మిగిలిన జిల్లాల కలెక్టర్లతోనూ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన మాట్లాడారు. సమర్థమైన పాలన అందించాలంటూ కలెక్టర్లకు ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. 360 డిగ్రీల్లో పనితీరు పరిశీలించి కలెక్టర్లుగా అవకాశం ఇస్తున్నానని, తన ఆలోచనలు అందుకొని, అత్యుత్తమ పనితీరు కనబర్చాలని సూచించారు. 'సీఎం అంటే కామన్ మ్యాన్ అని నేను చెబుతున్నా. మీరూ అదే పాటించండి. ప్రజలకు అందుబాటులో ఉండండి. నిత్యం వారితో

మిగతా 12వ పేజీలో...

ఢిల్లీకి చంద్రబాబు, పవన్

నేడు ఉప రాష్ట్రపతి ప్రమాణ స్వీకారానికి హాజరు

2


నేపాల్ నుంచి ప్రత్యేక విమానం బయలుదేరగానే ఆర్టీజీఎస్‌లో ఉన్న మంత్రులు లోకేశ్, అనిత, సంధ్యారాణి, దుర్గేశ్‌ల హర్షధ్వానాలు.. విమానంలో వస్తున్న ఏపీవాసులు

ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

2

పది మంది మావోయిస్టుల మృతి

మృతుల్లో కేంద్ర కమిటీ సభ్యుడు బాలకృష్ణ?

ఆయన స్వస్థలం తెలంగాణలోని భూపాలపల్లి జిల్లా

మృతుల సంఖ్యపై స్పష్టత ఇవ్వని పోలీసులు

మరికొందరు మరణించి ఉంటారని అనుమానం


ఎన్‌కౌంటర్ ప్రాంతంలో బాలకృష్ణ మృతదేహం(పోలీసులు ఇంకా నిర్ధారించలేదు)

క్షేమంగా వచ్చేశారు!

కల్లోల నేపాల్ నుంచి స్వస్థలాలకు

ప్రత్యేక విమానంలో ఏపీ వాసుల తరలింపు

విశాఖకు 104 మంది, తిరుపతికి 40 మంది

ఎయిర్‌పోర్టుల్లో స్వాగతం పలికిన నేతలు

చంద్రబాబు, లోకేశ్‌కు బాధితుల కృతజ్ఞతలు

మంత్రి లోకేశ్ చిత్రపటానికి పాలాభిషేకం

అమరావతి/విశాఖపట్నం/తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): అల్లర్లతో అట్టుడుకుతున్న నేపాల్‌లో చిక్కుకుని... బితుకు బితుకుమంటూ గడిపిన ఏపీ వాసులు రాష్ట్రానికి తిరిగి వచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక చొరవ, మంత్రి లోకేశ్ స్వీయ పర్యవేక్షణ, ఉన్నతాధికారుల సమన్వయంతో క్షేమంగా సొంతగడ్డపై దిగారు. విహార/తీర్థ యాత్రలకు నేపాల్‌కు వెళ్లి.. అక్కడ కఠ్మాండూ, హెటౌడా, పోఖారా, సిమికోట్ తదితర ప్రాంతాల్లో చిక్కుకుపోయిన ఏపీ వాసులను ప్రత్యేక విమానాలు, రోడ్డు మార్గం ద్వారా గురువారం రాత్రికి

మిగతా 12వ పేజీలో...

బాధితుల భావోద్వేగం...

నేపాల్‌లో భయంభయంగా గడిపి... తిరిగి క్షేమంగా వస్తామో లేదో అని ఆందోళన చెందిన బాధితులు సొంత గడ్డపై అడుగు పెట్టగానే భావోద్వేగానికి గురయ్యారు. నేపాల్ నుంచి సురక్షితంగా తమను తీసుకువచ్చినందుకు సీఎం చంద్రబాబుకు, మంత్రి లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. గత రెండు రోజుల నుంచి ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ గడిపామన్నారు. విశాఖ విమానాశ్రయంలో లోకేశ్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.


డొనాల్డ్ ట్రంప్‌తో చార్లీ కిర్క్ (ఫైల్)

2

ట్రంప్ సన్నిహితుడు చార్లీ కిర్క్ హత్య

యూటాలోని ఓ కాలేజీలో మాట్లాడుతుండగా కాల్పులు

తుపాకీ హింసపై ప్రశ్నకు జవాబిస్తుండగా ఘటన

అనుమానితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

రాజకీయ హత్యగా అభివర్ణించిన యూటా గవర్నర్

12 జిల్లాలకు కొత్త కలెక్టర్లు

సుదీర్ఘ కసరత్తు తర్వాత నియామకం

పల్నాడుకు కృతికా శుక్లా.. ప్రకాశం-రాజాబాబు

నెల్లూరుకు హిమాన్షు శుక్లా.. కర్నూలు-సిరి

ప్రకాశం నుంచి గుంటూరుకు తమీమ్

అనంత నుంచి బాపట్లకు వినోద్ కుమార్

తూర్పుగోదావరి జిల్లాకు కీర్తి చేకూరి

26 జిల్లాల్లో ఎనిమిదింటికి మహిళా కలెక్టర్లే

వారికి కీలక జిల్లాలు అప్పగింత

అమరావతి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సుదీర్ఘ కసరత్తు తర్వాత ప్రభుత్వం జిల్లా కలెక్టర్ల బదిలీలు చేపట్టింది. జిల్లాల్లో అధికారుల పనితీరుతో పాటు అన్ని కోణాల్లో విచారించిన తర్వాత.. 26 జిల్లాలకు గాను 12 జిల్లాలకు కొత్త కలెక్టర్లను నియమించింది. పాత కలెక్టర్లలో కొంత మందిని సీనియారిటీ ఆధారంగా రాజధానికి తీసుకురాగా.. మరికొంత మంది పనితీరు సక్రమంగా లేకపోవడంతో కలెక్టర్లుగా తప్పించి వారి స్థానంలో కొత్తవారికి అవకాశం కల్పించింది. 12 జిల్లాలకు కొత్త కలెక్టర్లను నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇంటర్మీడియట్

మిగతా 12వ పేజీలో...



రాధాకృష్ణన్‌కు ఓటేసి..

వైఎస్ ఛాతీలో కత్తి దింపారు

రాజశేఖరరెడ్డి బతికుంటే కొడుకు చేసిన పనికి తలదించుకునేవారు

జగన్ రాజకీయ వ్యభిచారి.. బీజేపీతో రహస్య పొత్తు పెట్టుకున్నారు

రాజకీయాల్లోకి రాకముందే రాజారెడ్డి అంటే భయమెందుకు?: షర్మిల



13

'ఇండియా'లో క్రాస్ ఓటింగ్ చిచ్చు

ఆప్‌తోపాటు కొన్ని పార్టీల ఎంపీలు ఎన్డీయే అభ్యర్థికి ఓటు వేశారు

2

20 కోట్ల చొప్పున ఆఫర్: అభిషేక్ బెనర్జీ

మావైపు నుంచి జరగలేదు: తేజస్వీ యాదవ్

మహారాష్ట్రను బద్నాం చేసే కుట్ర: సుప్రియాసూలే

క్రాస్ ఓటింగ్‌పై దర్యాప్తు చేయాలి: మనీశ్ తివారీ

సోనియాతో జస్టిస్ సుదర్శన్‌రెడ్డి భేటీ



ట్రంప్ సన్నిహితుడు చార్లీ కిర్క్ హత్య



ఓరెం, సెప్టెంబరు 11: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సన్నిహితుడు చార్లీ కిర్క్(31) దారుణ హత్యకు గురయ్యారు. బుధవారం యూటా రాష్ట్రంలోని ఓ కాలేజీలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతుండగా దుండగుడు ఆయనను కాల్చి చంపాడు. దీంతో కార్యక్రమానికి హాజరైన జనం భయంతో పరుగులు తీశారు. కిర్క్‌ను హుటాహుటిన ఆస్పత్రికి తరలించగా, అప్పటికే ప్రాణం పోయినట్టు వైద్యులు తెలిపారు. ఒక అనుమానితుడిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్టు యూటా గవర్నర్ స్పెన్సర్ కాక్స్ ప్రకటించారు. రాష్ట్రానికి ఇదో చీకటి రోజని ఆయన పేర్కొన్నారు. దీనిని రాజకీయ హత్యగా అభివర్ణించారు. నిందితుడు నల్లటి దుస్తులు ధరించి, క్యాంపస్‌లోని దూరంగా ఉన్న ఓ భవనం పైకప్పు నుంచి కాల్పులు జరిపాడని అధికారులు తెలిపారు. కాగా, 'టర్నింగ్ పాయింట్ యూఎస్‌ఏ' అనే యువజన సంస్థకు కిర్క్ సహ-వ్యవస్థాపకుడు. ఆ సంఘం సీఈవో కూడా. కిర్క్ హత విషయాన్ని ట్రంప్ సోషల్ మీడియా ద్వారా ప్రకటించారు. అమెరికా యువత హృదయాలను కిర్క్ కంటే బాగా అర్థం చేసుకునేవారు లేరని ట్రూత్ సోషల్‌లో పెట్టిన పోస్టులో ట్రంప్ పేర్కొన్నారు. ఆయనో గొప్ప వ్యక్తి అని, లెజండరీ కూడా అని కొనియాడారు. అలాగే, కిర్క్ హత్యను రిపబ్లికన్లు, డెమోక్రాట్లు తీవ్రంగా ఖండించారు.


తుపాకీ సంస్కృతిపై మాట్లాడుతుండగానే..

హత్యకు సంబంధించిన వీడియోలను యూటా వ్యాలీ యూనివర్సిటీకి చెందిన కొందరు సోషల్ మీడియాలో పోస్టు చేశారు. కాలేజీ ఆవరణలో ఏర్పాటు చేసిన తెల్లటి టెంట్‌లో కిర్క్ కూర్చొని మాట్లాడుతుండగా ఘటన జరిగింది. టెంట్‌లో ఆయన వెనుక 'ది అమెరికన్ కంబ్యాక్', 'ప్రూవ్ మీ రాంగ్' అని రాసిన నినాదాలు కనిపిస్తున్నాయి. తూటా శబ్దం వినపడగానే కిర్క్ మెడలో ఎడమవైపు నుంచి రక్తం బయటికి చిమ్ముతుండగా, కిర్క్ తన కుడి చేతిని పైకి చూపుతూ కనిపించారు. దీంతో కార్యక్రమంలో పాల్గొన్న జనం పరుగులు తీశారు. కిర్క్ స్థాపించిన 'టర్నింగ్ పాయింట్ యూఎస్‌ఏ' సంస్థ ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. తుపాకీ హింసపై ప్రేక్షకులు అడిగిన ప్రశ్నలకు కిర్క్ సమాధానాలు ఇస్తుండగానే ఆయనపై కాల్పులు జరగడం గమనార్హం. గతపదేళ్లలో ఎంతమంది ట్రాన్స్‌జెండర్ అమెరికన్లు మాస్ షూటర్లుగా ఉన్నా రో మీకు తెలుసా? అని ఒకరు ప్రశ్నించగా, 'చాలా మంది' అని కిర్క్ జవాబిచ్చారు. గత పదేళ్లలో అమెరికాలో ఎంతమంది మాస్ షూటర్లు ఉన్నారో మీకు తెలుసా? అని ప్రశ్నించగా, 'ముఠా హింసను లెక్కించాలా? వద్దా? అని కిర్క్ అడిగారు. ఇంతలోనే కాల్పుల ఘటన చోటుచేసుకుంది.

భారతీయులకు వ్యతిరేకంగా పోస్టు..

గతంలో భారతీయులకు వ్యతిరేకంగా కిర్క్ పెట్టిన పోస్టు ఇప్పుడు వైరల్‌గా మారింది. భారత్ నుంచి వచ్చేవారికి మరిన్ని వీసాలు అవసరం లేదని అప్పట్లో ఆయన వ్యాఖ్యానించారు. 'భారత్ నుంచి వచ్చే ప్రజలకు అమెరికా మరిన్ని వీసాలు మంజూరు చేయాల్సిన అవసరం లేదు. చట్టపరమైన వలసల కారణంగా అమెరికన్ వర్కర్ల స్థానంలో భారతీయులు చేరిపోయారు. ఇక చాలు. అమెరికా నిండిపోయింది. మన వాళ్లకు తొలి ప్రాధాన్యం ఇద్దాం' అని ఈనెల 2న 'ఎక్స్'లో కిర్క్ పేర్కొన్నారు. వాణిజ్య ఒప్పందం కొలిక్కి రావాలంటే భారత్‌కు మరిన్ని వీసాలు మంజూరు చేయాల్సి ఉంటుందని ఫాక్స్ న్యూస్ వ్యాఖ్యాత పెట్టిన పోస్టుకు స్పందనగా కిర్క్ ఈ పోస్టు పెట్టారు.

లోకం తీరు



వార్తా పత్రికలకు ఆదరణ పెరిగింది

» ఆడిట్ బ్యూరో ఆఫ్ సర్క్యులేషన్స్ వెల్లడి

ముంబై, సెప్టెంబరు 11: దేశంలో వార్తా దిన పత్రికలకు ఆదరణ పెరిగిందని ఆడిట్ బ్యూరో ఆఫ్ సర్క్యులేషన్స్(ఏబీసీ) ఓ ప్రకటనలో తెలిపింది. ఈ ఏడాది జనవరి నుంచి జూన్ వరకు నిర్వహించిన ఆడిటింగ్ వివరాల గణాంకాలను వెల్లడించింది. ఈ ఆరు నెలల్లో వార్తా దినపత్రికల అమ్మకాల్లో ఆరోగ్యకరమైన పురోగతి కనపడిందని తెలిపింది. ఈ ఏడాది జనవరి నుంచి జూన్ వరకు 2,97,44,148 కాపీల అమ్మకాలు జరిగాయని వెల్లడించింది. గత ఏడాది ఇదే కాలానికి 2,89,41,876 కాపీల అమ్మకాలు జరిగాయి. గత ఏడాదితో పోల్చితే మొత్తం 2.77% అధికమని, 8,02, 272 కాపీలు అధికంగా అమ్ముడయ్యాయని ఏబీసీ తెలిపింది. ఈ పురోగతి వార్తా దినపత్రికలపై పాఠకులకున్న నమ్మకాన్ని తెలియజేస్తోందని అభిప్రాయపడింది. అంతేకాదు.. విశ్వసనీయ, ధ్రువీకరించిన, లోతైన సమాచారం కోసం పాఠకులు వార్తా దినపత్రికలను చదువుతున్నారని వెల్లడించింది. దినపత్రికలు శక్తిమంతమైన మాధ్యమంగా మారాయనడానికి సర్క్యులేషన్ పెరుగుదల నిదర్శనంగా నిలుస్తోందని తెలిపింది.

నేడు ఉపరాష్ట్రపతిగా రాధాకృష్ణన్ ప్రమాణం

» హాజరుకానున్న చంద్రబాబు, పవన్ కల్యాణ్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 11: ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన సీపీ రాధాకృష్ణన్‌తో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శుక్రవారం ప్రమాణస్వీకారం చేయించనున్నారు. రాష్ట్రపతి భవన్‌లో ఉదయం 10 గంటల నుంచి మొదలయ్యే ఈ కార్యక్రమానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమంలో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కూడా పాల్గొంటారు. ఇందుకోసం వారు ఇప్పటికే ఢిల్లీకి చేరుకున్నారు. కాగా, రాధాకృష్ణన్ గురువారం మహారాష్ట్ర గవర్నర్ పదవికి రాజీనామా చేశారు. గుజరాత్ గవర్నర్ ఆచార్య దేవవ్రత్‌కు మహారాష్ట్ర గవర్నర్‌గా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్రపతి కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది.

'ఓట్ చోరీ' ఆరోపణల్లో విదేశీ హస్తం

» రాహుల్ డాక్యుమెంట్లు 'మేడిన్ ఇండియా' కాదు: బీజేపీ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 11: ఎన్నికల్లో 'ఓట్ల చోరీ' జరిగిందంటున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై బీజేపీ సంచలన ఆరోపణలు చేసింది. ఓట్ల చోరీ ఆరోపణలకు సంబంధించి ఆయన చూపుతున్న పత్రాలు భారత్‌లో కాకుండా విదేశాల్లో తయారయ్యాయని, ప్రతిపక్షాల ఆరోపణల్లో విదేశీ హస్తం ఉందని బీజేపీ నేత ప్రదీప్ భండారి అన్నారు. "రాహుల్ గాంధీ అంతర్జాతీయ 'ఓట్ల చోరీ టూల్‌కిట్ బహిర్గతమైంది" అని ఎక్స్‌లో పోస్టు చేశారు. రాహుల్ రిమోట్ కంట్రోల్‌ను నడుపుతున్న 'విదేశీ బాస్' ఎవరు? అని ప్రశ్నించారు. ఓట్ల చోరీ ఆరోపణలకు సంబంధించి రాహుల్ ఆగస్టు 7న తన అధికారిక వెబ్‌సైట్‌లో ఇంగ్లిష్, హిందీ, కన్నడ భాషల్లో అప్‌లోడ్ చేసిన పత్రాల మెటాడేటాను నిశితంగా పరిశీలించగా.. ఈ డాక్యుమెంట్లన్నీ మయన్మార్ టైమ్ జోన్‌తో (+6:30 MMT) ఉన్నట్లు వెల్లడైందన్నారు. సిస్టమ్ క్లాక్‌పై ఆధారపడే అడోబ్ ఇల్లస్ట్రేటర్ సాఫ్ట్‌వేర్ ద్వారా ఈ ఫైళ్లను ఎక్స్‌పోర్టు చేశారని, వీపీఎన్ ఉపయోగించి దాన్ని మార్చలేరన్నారు. మూడు ఫైళ్ల సృష్టిలో సమయం అంతరాలను ఈ సందర్భంగా ప్రస్తావించారు. దీంతో రాహుల్ చూపిస్తున్న 'ఆధారాలు'.. భారత్‌లో తయారు కాలేదని స్పష్టమవుతోందని ప్రదీప్ భండారి పేర్కొన్నారు.

'హైడ్రోజన్ బాంబ్'తో అన్నీ స్పష్టం: రాహుల్

మరోవైపు తాను చేసిన 'హైడ్రోజన్ బాంబ్' వ్యాఖ్యలపై బీజేపీ చేస్తున్న విమర్శలకు రాహుల్ గాంధీ గురువారం స్పందించారు. "ఆందోళన చెందుతున్న బీజేపీ నేతలకు చెబుతున్నా.. ఆందోళన పడొద్దు. హైడ్రోజన్ బాంబ్ వచ్చినప్పుడు, ప్రతీది స్పష్టంగా వెల్లడవుతుంది" అని అన్నారు. అయితే ఎక్కడ విడుదల చేస్తామనేది ప్రస్తుతానికి రహస్యమన్నారు.

స్మార్ట్ రైస్ కార్డుల్లో తప్పులు

» అక్టోబరు 31 వరకు సవరణకు అవకాశం: నాదెండ్ల

అమరావతి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా రేషన్ కార్డుదారులకు ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న స్మార్ట్ రైస్ కార్డుల్లో వివరాలు తప్పుగా ముద్రితమైనట్లు తమ దృష్టికి వచ్చిందని, ఆ తప్పులను సరిచేసుకోవడానికి వచ్చేనెలాఖరు వరకు అవకాశం కల్పిస్తున్నామని పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.తప్పుల సవరణ కోసం గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. వచ్చే వారం నుంచి వాట్సాప్ గవర్నెన్స్ (మనమిత్ర) ద్వారా దరఖాస్తులు చేసుకునే వెసులుబాటును అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. గురువారం సాయంత్రం విజయవాడలోని సివిల్ సప్లయిస్ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈకేవైసీ, ఆధార్ బేస్డ్ డేటా ఆధారంగానే స్మార్ట్ రైస్ కార్డులను ముద్రించామని తెలిపారు. అయితే, డేటాలో లబ్ధిదారుల పేర్లు, ఇంటిపేర్లు, రిలేషన్, చిరునామాల మార్పులు చేసుకోకపోవడం వల్లే స్మార్ట్‌కార్డుల ముద్రణలో తప్పులు దొర్లినట్లు చెప్పారు. అక్టోబరు 31 లోపు వచ్చే దరఖాస్తులను వెంటనే పరిశీలించి.. తప్పుల్లేకుండా మళ్లీ కొత్త కార్డులు ముద్రించి లబ్ధిదారులకు ఉచితంగానే అందజేస్తామన్నారు. నవంబరు 1 నుంచి దరఖాస్తు చేసుకునేవారు మాత్రం స్వల్పమొత్తంలో ఫీజు (ఫీజు రూ.35 నుంచి 50 వరకు) చెల్లించాల్సి ఉంటుందన్నారు. రాష్ట్రంలోని కోటీ 45 లక్షల కుటుంబాలు లక్ష్యం కాగా, ఇప్పటికి రెండు విడతల్లో 80 శాతం స్మార్ట్ కార్డుల పంపిణీ పూర్తయిందని చెప్పారు. వరుసగా మూడు నెలలు రేషన్ సరుకులు తీసుకోకపోతే ఆ కార్డు రద్దయిపోతుందని మంత్రి స్పష్టం చేశారు. ఆ తర్వాత లబ్ధిదారులు సచివాలయానికి వెళ్లి సరైన సమాచారం ఇస్తే మళ్లీ కొత్త రైస్ కార్డు వస్తుందన్నారు.

4.2 ఎకరాలు.. 3,472 కోట్లు

» ముంబయిలోని నారిమన్ పాయింట్‌లో ఆర్బీఐ కొనుగోలు

ముంబయి, సెప్టెంబరు 11: నూతన కార్యాలయ భవన సముదాయం కోసం భారతీయ రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) రూ.3,472 కోట్లతో ముంబయిలో స్థలం కొనుగోలు చేసింది. నగరానికి గుండెకాయలాంటి నారిమన్ పాయింట్‌లో 4.2 ఎకరాల (16,832 చదరపు మీటర్లు) ప్లాటును ముంబయి మెట్రో రైల్ కార్పొరేషన్ (ఎంఎంఆర్‌సీఎల్) నుంచి కొనుగోలు చేసింది. ఈ నెల 5న సేల్ డీడ్ రిజిస్ట్రేషన్ జరిగినట్టు అధికార వర్గాలు తెలిపాయి. నారిమన్ పాయింట్‌లో ఉన్న మార్కెట్ రేటు కన్నా 50% ఎక్కువ ధర పలికినట్టు రియల్ ఎస్టేట్ నిపుణులు తెలిపారు. ఇందులో 16 లక్షల చ.అడుగుల స్థలంలో భవనాలు నిర్మించనున్నారు. 1.13 లక్షల చ.అడుగుల స్థలాన్ని పునరావాసం కోసం కేటాయించారు. నారిమన్ పాయింట్లో లభ్యమయ్యే చిట్టచివరి అతి పెద్ద ప్లాటు ఇదే కావడం గమనార్హం. ఈ స్థలాన్ని దీర్ఘకాలిక లీజుకు ఇస్తామంటూ గత ఏడాది అక్టోబరు మూడున మెట్రోరైల్ కార్పొరేషన్ టెండరు పిలిచింది. దీని ద్వారా రూ.5,173 కోట్లు సమకూర్చుకోవాలని ఆశించింది. బ్లాక్‌స్టోన్ గ్రూప్, ఒబెరాయ్ రియాల్టీ, ఆర్ఎంజడ్ గ్రూపు, టాటా గ్రూపులు ఆసక్తి చూపాయి. అయితే స్థలం కొనుగోలు చేయడానికి రిజర్వు బ్యాంకు ముందుకు రావడంతో ఈ ఏడాది జనవరి 18న టెండరు నోటీసు ఉపసంహరించుకొంది.

ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

10 మంది మావోయిస్టుల మృతి.. మృతుల్లో కేంద్ర కమిటీ సభ్యుడు బాలకృష్ణ

» ఆయన స్వస్థలం భూపాలపల్లి జిల్లాలోని గణపురం
» మృతుల సంఖ్యపై స్పష్టత ఇవ్వని పోలీసులు
» మరింత మంది మరణించి ఉంటారని అనుమానం



మోడెం బాలకృష్ణ(ఫైల్)

చర్ల/హైదరాబాద్/చింతూరు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం మారోసారి కాల్పుల మోతలతో దద్దరిల్లింది. గరియాబంద్ జిల్లా అడవుల్లో గురువారం మధ్యాహ్నం జరిగిన ఎన్‌కౌంటర్‌లో 10 మంది మావోయిస్టులు మృతి చెందారు. మృతుల్లో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు, ఒడిసా రాష్ట్ర కార్యదర్శి, సెంట్రల్ రీజనల్ బ్యూరో కమిటీ సభ్యుడు మోడెం బాలకృష్ణ (58) అలియాస్ భాస్కర్ అలియాస్ మనోజ్‌తో పాటు ఒడిసా రాష్ట్ర కమిటీ సభ్యుడు ప్రమోద్ అలియాస్ పాండు, మరికొందరు కీలక నేతలు మృతి చెందినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. గరియాబంద్ జిల్లా మెయిన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బాలుడిగ్గి కొండల్లో మవోయిస్టులు ఉన్నట్లు అక్కడి పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఆ జిల్లాకు చెందిన ఈ30, ఎస్టీఎఫ్ కోబ్రా బలగాలు కూబింగ్ చేపట్టాయి. ఈ క్రమంలో బలగాలు, మావోయిస్టులకు మధ్య 3 గంటల పాటు ఎదురు కాల్పులు జరిగాయి. అనంతరం ఘటనా స్థలంలో 10 మంది మావోయిస్టుల మృతదేహాలు, ఏకే 47, ఆటోమేటిక్ తుపాకులు లభించినట్టు తెలుస్తోంది. చనిపోయిన వారిలో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ, సెంట్రల్ రీజనల్ బ్యూరో సభ్యుడు మోడెం బాలకృష్ణ సైతం ఉన్నట్లు గుర్తించారు. ఒడిసా రాష్ట్ర కార్యదర్శిగానూ బాధ్యతలు నిర్వర్తిస్తున్న బాలకృష్ణ స్వస్థలం తెలంగాణలోని భూపాలపల్లి జిల్లా గణపురం. ఆయనపై కోటి రూపాయల రివార్డు ఉందని పోలీసు అధికారులు తెలిపారు. కంధమాల్, కలహండీ, బౌధ్, నయాగఢ్ డివిజన్లలో మంచి పట్టున్న బాలకృష్ణ కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని సమాచారం. అయితే, ఇప్పటి వరకు ఎన్‌కౌంటర్‌లో ఎంత మంది చనిపోయారనేది పోలీసులు అధికారికంగా వెల్లడించలేదు. ఎదురుకాల్పులు జరిగిన ప్రాంతంలో పదుల సంఖ్యలో మావోయిస్టులు ఉన్నారని, కాల్పుల్లో చాలా మంది మృతి చెంది ఉంటారని ఓ జవాను అనధికారికంగా తెలిపారు. గత ఏడాది ఇదే గరియాబంద్ అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు చలపతి మృతి చెందిన విషయం తెలిసిందే. కాగా, ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో 26 మంది మావోయిస్టులను కేంద్ర బలగాలు అరెస్టు చేశాయి. అలాగే నారాయణపూర్ జిల్లా పోలీసుల ఎదుట 16 మంది మావోయిస్టులు లొంగిపోయారు.

మందుపాతర పేలి ఇద్దరు జవాన్లకు గాయాలు

» ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని దంతెవాడ జిల్లాలో ఘటన
» వీరిలో ఒకరిది ములుగు జిల్లా తాడ్వాయి మండలం



మునేష్ (ఫైల్)

చర్ల/తాడ్వాయి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టులు అమర్చిన ఐఈడీ మందుపాతర పేలి సీఆర్‌పీఎఫ్ 195 బెటాలియన్‌కు చెందిన ఇద్దరు జవాన్లు తీవ్రంగా గాయపడ్డారు. ఛత్తీస్‌గఢ్‌లోని దంతెవాడ జిల్లాలో గురువారం ఈ ఘటన చోటుచేసుకుంది. బార్సూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇంద్రావతి నది సమీపంలో సీఆర్‌పీఎఫ్ బలగాలు 'ఏరియా డామినేషన్' చేస్తుండగా.. మావోయిస్టులు అమర్చిన భారీ మందుపాతరపై ఓ జవాను కాలు పెట్టారు. అది వెంటనే పేలిపోవడంతో జవాన్లు దివాన్ సింగ్, ఆలం మునేష్ తీవ్రంగా గాయపడ్డారు. పేలుడు ధాటికి వారి కాళ్లు తెగిపడినట్లు తెలిసింది. వెంటనే వీరిని మెరుగైన వైద్యం కోసం దంతెవాడకు, అక్కడ నుంచి రాయ్‌పూర్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఆలం మునేష్ స్వస్థలం ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని భూపతిపురం. మునేష్ గాయపడిన విషయం తెలియడంతో గ్రామంలో విషాద చాయలు అలుముకున్నాయి.

డబ్బులిచ్చి నాపై దుష్ప్రచారం

» ఆ ప్రచారం వెనుక పెట్రోల్ లాబీ
» రాజకీయంగా లక్ష్యం చేసుకున్నారు
» కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ



న్యూఢిల్లీ, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): పెట్రోల్‌లో 20% ఇథనాల్ (ఈ20)ను కలపాలని కేంద్రం తీసుకున్న నిర్ణయంపై డబ్బులిచ్చి సోషల్ మీడియాలో తనకు వ్యతిరేకంగా ప్రచారం చేయించారని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ చెప్పారు. తనను రాజకీయంగా లక్ష్యం చేసుకుని ఆ ప్రచారం జరిగిందన్నారు. ఇథనాల్‌తో కూడిన పెట్రోల్ వల్ల మైలేజీ తగ్గుతుందన్నది అవాస్తవమని తెలిపారు. గురువారం ఢిల్లీలో జరిగిన భారత ఆటోమొబైల్ తయారీదారుల సొసైటీ 65వ వార్షిక సమావేశంలో గడ్కరీ మాట్లాడారు. సోషల్ మీడియాలో దుష్ప్రచారం వెనుక పెట్రోల్ లాబీ, ఇతర శక్తులు ఉన్నాయని ఆరోపించారు. ప్రతి చోటా లాబీలు, ప్రయోజనాలు ఉంటాయన్నారు. అలాగే పెట్రోల్ లాబీ చాలా బలమైనదని, అందులో ధనవంతులు ఉన్నారని పేర్కొన్నారు. పెట్రోల్‌లో ఇథనాల్‌ను కలపడానికి వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు కొట్టివేసిందని తెలిపారు. ఇథనాల్ మిశ్రమం వల్ల ఎటువంటి సమస్యలు రావని అన్ని పరీక్షా సంస్థలు నిర్ధారించాయన్నారు. భారత వాహన పరిశోధన సంఘం (ఏఆర్ఏఐ) ఈ20 వినియోగంపై స్పష్టతనిచ్చిందని చెప్పారు. భారత్ ఏటా రూ.22 లక్షల కోట్ల విలువైన ఇంధనాన్ని దిగుమతి చేసుకుంటోందని, ఆర్థికవ్యవస్థ, పర్యావరణానికి భారంగా మారిన శిలాజ ఇంధన వినియోగాన్ని తగ్గించవలసిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు.

రాష్ట్రపతికి, గవర్నర్లకు గడువు సరి కాదు

» ఆర్టికల్ 200 ప్రకారం నిర్ణయం తీసుకునే సౌలభ్యం వారికే కల్పించాలి
» 50 ఏళ్లలో 90 శాతం బిల్లులకు నెలరోజుల్లోనే గవర్నర్ల ఆమోదం
» సుప్రీంలో కేంద్ర ప్రభుత్వ వాదనలు.. తీర్పు వాయిదా వేసిన ధర్మాసనం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేసిన బిల్లులను ఆమోదించడానికి రాష్ట్రపతి, గవర్నర్లకు కాలపరిమితి విధించే అధికారం సుప్రీంకోర్టుకు ఉందా అనే అంశంపై అన్ని పక్షాల వాదనలూ విన్న సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం తీర్పును గురువారం వాయిదా వేసింది. ఈ అంశంపై న్యాయసలహా కోరుతూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సుప్రీంకోర్టును 14 ప్రశ్నలు అడిగిన (ప్రెసిడెన్షియల్ రిఫరెన్స్) సంగతి తెలిసిందే. దీనిపై భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ ఏఎస్ చందూర్కర్‌ల రాజ్యాంగ ధర్మాసనం ఆగస్టు 19న విచారణ చేపట్టింది. దశలవారీగా 10రోజులపాటు ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వ, రాష్ట్ర ప్రభుత్వాల వాదనలను విన్నది. అటార్నీ జనరల్ వెంకట రమణి, సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కేంద్రం తరఫున గురువారం తుదివాదనలు వినిపించారు. రాష్ట్ర మంత్రివర్గం పంపిన బిల్లులపై నిర్ణయం తీసుకోకుండా నిరవధికంగా పెండింగ్‌లో ఉంచడం సరైనది కాకపోవచ్చునని.. అయితే నిర్దిష్ట కాలంలో బిల్లులను ఆమోదించాలంటూ కాలపరిమితి మాత్రం విధించకూడదని అభిప్రాయపడ్డారు. ఆర్టికల్ 200ప్రకారం నిర్ణయం తీసుకునే సౌలభ్యాన్ని గవర్నర్‌కు కల్పించాలని తెలిపారు. గత యాభై ఏళ్లలో 90% బిల్లులను గవర్నర్లు కేవలం నెలరోజుల్లోపే ఆమోదించారని మరోసారి గుర్తు చేశారు.

మినహాయింపులు పొందిన రిజర్వుడు కేటగిరీ అభ్యర్థులు జనరల్ కోటాకు అర్హులు కాదు

» సుప్రీంకోర్టు స్పష్టీకరణ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 11: వయసు, విద్య తదితర అంశాల్లో మినహాయింపు పొందిన ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు జనరల్ కోటా ఉద్యోగాలకు అర్హులు కాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఎక్కువ మార్కులు వచ్చాయన్న కారణంతో వారికి జనరల్ కోటా ఉద్యోగాలు ఇవ్వలేరని తెలిపింది. రిజర్వు కోటాలో ఉద్యోగాలకు దరఖాస్తు చేసి, వయసు వంటి అర్హతల్లో మినహాయింపులు పొందినవారు అనంతరం తమకు జనరల్ కోటా కింద ఉద్యోగాలు ఇవ్వాలని అడగలేరని తెలిపింది. రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్‌పీఎఫ్) ఉద్యోగాలకు రిజర్వుడు కోటా కింద దరఖాస్తు చేసిన వారికి జనరల్ కోటాలో పోస్టులు ఇవ్వాలంటూ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను కొట్టివేస్తూ ఈ విషయాన్ని స్పష్టం చేసింది. ఈ మేరకు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాలా బాగ్చీ ధర్మాసనం ఆదేశాలు ఇచ్చింది.

భారత్‌లోకి నేపాలీ ఖైదీలు

» సరిహద్దుల్లోనే అడ్డుకున్న బలగాలు
» రెండ్రోజుల్లో 60మంది అదుపులోకి..



కఠ్మాండులో పారిపోతున్న ఖైదీని పట్టుకున్న పోలీసులు

కఠ్మాండూ, సెప్టెంబరు 11: నేపాల్ ఆందోళనలతో తలెత్తిన గందరగోళ పరిస్థితులను ఉపయోగించుకుని జైళ్ల నుంచి పారిపోతున్న ఖైదీల కట్టడి పెద్ద తలనొప్పిగా మారింది. భారత్ భూభాగంలోకి రావడానికి ప్రయత్నించిన 60మందిని సరిహద్దు భద్రతా బలగాలు (ఎస్ఎస్‌బీ) అదుపులోకి తీసుకున్నాయి. అంతర్జాతీయ సరిహద్దుల వెంట యూపీ, బిహార్, పశ్చిమ బెంగాల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో పట్టుబడిన వీరిలో చాలామంది నేపాలీ ఖైదీలు ఉన్నట్టు గుర్తించాయి. నేపాల్ ఆందోళనల నేపథ్యంలో అంతర్జాతీయ సరిహద్దు వద్ద భారతీయ బలగాలు పూర్తిగా అప్రమత్తం అయ్యాయి. నేపాల్‌లోని పాతికకుపైగా జైళ్లనుంచి 15వేలమంది ఖైదీలు ఇప్పటివరకు పరారయ్యారు. వీరిలో 200మందిని పట్టుకుని తిరిగి జైళ్లకు తరలించారు. మధేశ్ ప్రావిన్స్‌లోని రామేచాప్ జిల్లా జైలు గేట్లు బద్దలుకొట్టడానికి ఖైదీలు ప్రయత్నించారు. సైన్యం జరిపిన కాల్పుల్లో గురువారం ముగ్గురు ఖైదీలు మరణించారు. మరో 13మంది గాయపడ్డారు.

నేపాల్ తదుపరి నేతపై గందరగోళం!

'జెన్ జెడ్' యువత ఆందోళనలతో అతలాకుతలమైన నేపాల్‌లో అదే గందరగోళం కొనసాగుతోంది. తాత్కాలిక ప్రభుత్వాధినేతగా ఎవరు ఉండాలన్నది ఎటూ తేలడం లేదు. ఆ దేశ సుప్రీంకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ సుశీల కర్కిని ఆందోళనకారులు ఎంపిక చేసినా.. ఆందోళనకారుల్లోని కొన్ని గ్రూపులు అందుకు సానుకూలంగా లేనట్టు తెలిసింది. ఈ క్రమంలో ఆందోళనకారులతో నేపాల్ అధ్యక్షుడు రామ్‌చంద్ర పౌడెల్, ఆర్మీ చీఫ్ అశోక్ రాజ్ సిగ్డెల్ చర్చలు జరుపుతున్నారు. సుశీల కర్కితోపాటు కఠ్మాండూ మేయర్ బాలేంద్ర షా, నేపాల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ మాజీ సీఈవో కుల్మన్ ఘిసింగ్, ధరణ్ పట్టణ మేయర్ హర్కా సంపంగ్ పేర్లను పరిశీలిస్తున్నారని ఆర్మీ వర్గాలు తెలిపాయి. తాత్కాలిక ప్రధానిగా ఎన్నుకునే వ్యక్తి నియమిత గడువులోగా దేశంలో ఎన్నికలను నిర్వహించాల్సి ఉంటుందని పేర్కొన్నాయి.

'నేపాల్'పై ఎవరూ మాట్లాడొద్దు

» శ్రేణులకు బీజేపీ గట్టి ఆదేశాలు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 11: నేపాల్ పరిణామాలపై ఎవరూ మాట్లాడొద్దని.. ఏదైనా చెప్పాలనుకుంటే ముందుగా అధ్యక్షుడు జేపీ నడ్డా అనుమతి పొందాలని తన శ్రేణులకు బీజేపీ అధిష్ఠానం ఆదేశాలు జారీచేసింది. బిహార్ డిప్యూటీ సీఎం సామ్రాట్ చౌదరీ నేపాల్‌పై చేసిన వ్యాఖ్యలు ఆ పార్టీకి తలనొప్పిగా మారడంతో తాజా నిర్ణయం తీసుకున్నారు. నేపాల్ పరిణామాలను లోతుగా పరిశీలిస్తున్నట్టు కేంద్రప్రభుత్వం తెలిపింది. నేపాల్ ఆందోళనల్లో యువకుల మరణాలు బాధించాయని పేర్కొంది.

అది రహస్య సమాచారం.. బయటకు చెప్పం!

» ఏదైనా ఉంటే కోర్టుకే చెబుతాం
» జగన్ పత్రిక ఎడిటర్, రిపోర్టర్ల డొంకతిరుగుడు జవాబులు
» డీఎస్పీ పదోన్నతుల్లో అవినీతి జరిగిందని రాసిన కథనంపై పోలీసు విచారణకు హాజరు

గుంటూరు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): డీఎస్పీల ఉద్యోగోన్నతుల విషయంలో పెద్దఎత్తున అవినీతి జరుగుతోందంటూ జగన్ రోతపత్రిక ఈ నెల 1న 'పైసా మే ప్రమోషన్' శీర్షికన ప్రచురించిన కథనంపై నమోదైన కేసులో గురువారం ఆ పత్రిక ఎడిటర్, మరో ఇద్దరు రిపోర్టర్లు పోలీసుల ముందు విచారణకు హాజరయ్యారు. డీఎస్పీల పదోన్నతుల విషయంలో డీజీపీ కార్యాలయం ప్రమేయం ఉండదని.. పోలీసుల ఆత్మస్థైర్యాన్ని, మనోభావాలను దెబ్బతీయాలనే దురుద్దేశంతోనే ఈ కథనం ప్రచురించారంటూ పోలీసు అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జనకుల శ్రీనివాసరావు తాడేపల్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో జగన్ పత్రిక ఎడిటర్ ధనుంజయరెడ్డి, స్టేట్ బ్యూరో ఇన్‌చార్జి విశ్వనాథరెడ్డి, క్రైమ్‌బ్యూరో ఇన్‌చార్జి వడ్డాది శ్రీనివాస్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణకు రావాలని నోటీసులు జారీ చేయడంతో న్యాయవాదులు, వైసీపీ నాయకులతో కలిసి గురువారం ఉదయం సుమారు 11:30 గంటలకు వారు తాడేపల్లి పోలీసు స్టేషన్‌కు వచ్చారు. సీఐ వీరేంద్రబాబు సుమారు గంటన్నర పాటు విచారించగా.. డొంకతిరుగుడు సమాధానాలు ఇచ్చినట్లు తెలిసింది. ఈ కథనానికి సంబంధించిన రహస్య సమాచారాన్ని బయటకు చెప్పలేమని.. ఏదైనా ఉంటే కోర్టుకే చెబుతామని వారు అన్నట్లు సమాచారం. 'వార్త ఎవరు రాశారో తెలియదు.. ఎంతోమంది విలేకరులు ఉంటారు.. దానికి సంబంధించిన ఆధారాలు, వివరాలు మా కార్యాలయంలో లేవు' అని చెప్పినట్లు తెలిసింది. డీజీపీ కార్యాలయంలో అవినీతి జరిగిందనడానికి ఆధారాలున్నాయా అని ప్రశ్నించగా.. లేవని చెప్పినట్లు సమాచారం. డొంకతిరుగుడు సమాధానాలు చెబుతుండడంతో విచారణను అర్ధంతరంగా ముగించినట్లు తెలిసింది.

ఇండియా కూటమిలో క్రాస్ ఓటింగ్ చిచ్చు

» ఆప్‌తోపాటు కొన్ని పార్టీల ఎంపీలు ఎన్డీయే అభ్యర్థికి ఓటు వేశారు
» 20 కోట్ల చొప్పున ఆఫర్: అభిషేక్ బెనర్జీ
» మహారాష్ట్రను బద్నాం చేసే కుట్ర: సుప్రియాసూలే
» క్రాస్ ఓటింగ్‌పై దర్యాప్తు చేయాలి: మనీశ్ తివారీ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఉప రాష్ట్రపతి ఎన్నికల ఫలితాలు వెలువడి రెండురోజులు అయినప్పటికీ.. ఆ ఎన్నికల్లో ఇండియా కూటమికి చెందిన కొందరు ఎంపీలు క్రాస్ ఓటింగ్ చేశారన్న అనుమానాలు కూటమిలో చిచ్చు రేపుతున్నాయి. ఆమ్ ఆద్మీ పార్టీతో సహా కొన్ని పార్టీలు క్రాస్ ఓటింగ్‌కు పాల్పడ్డాయని టీఎంసీ నేత అభిషేక్ బెనర్జీ ఆరోపించారు. ఆప్‌లో బీజేపీకి అనుకూలంగా ఉన్న ఒక మహిళా ఎంపీతోపాటు కనీసం నలుగురు ఎన్డీఏ అభ్యర్థికి ఓటు వేశారన్నారు. ప్రతిపక్ష పార్టీల ఓట్లను కొనుగోలు చేసేందుకు ఒక్కొక్కరికీ రూ.20 కోట్లు ఇవ్వజూపారన్నారు. ఆప్ నేత సౌరబ్ భరద్వాజ్ స్పందిస్తూ.. ఏ ఎంపీ ఎవరికి ఓటు వేశారన్న విషయం ఎన్నికల సంఘానికే తెలుస్తుందని, ఎవరు క్రాస్ ఓటింగ్ పాల్పడ్డారో కమిషనే బయట పెట్టాలన్నారు. ఎవరు క్రాస్ ఓటింగ్ చేశారో తేల్చేందుకు దర్యాప్తు చేయాలని కాంగ్రెస్ ఎంపీ మనీశ్ తివారీ డిమాండ్ చేయడం గమనార్హం. తమవైపు నుంచి ఎలాంటి క్రాస్ ఓటింగ్ జరగలేదని ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ ప్రకటించారు. ఉపరాష్ట్రపతి ఎన్నికలో 15 ఓట్లు చెల్లకపోవడంపై శివసేన ఎంపీ అర్వింద్ సావంత్ విస్మయం వ్యక్తం చేశారు. క్రాస్‌ఓటింగ్ వివాదంపై ఎన్సీపీ ఎంపీ సుప్రియా సూలే స్పందిస్తూ.. అనవసరంగా తమ రాష్ట్రాన్ని అప్రదిష్ట పాలు చేస్తున్నారన్నారు. కాగా, విపక్ష కూటమిలోని ఈ లుకలుకలపై అధికార ఎన్డీఏ వ్యంగ్యబాణాలు విసురుతోంది. ఇండియా కూటమికి చెందిన కొందరు ఎంపీలు అంతరాత్మ ప్రబోధానుసారం రాధాకృష్ణన్‌కు అనుకూలంగా ఓటు వేశారని, వారికి కృతజ్ఞతలని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు.

సోనియాతో జస్టిస్ సుదర్శన్ రెడ్డి భేటీ

కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీతో ఇండియా కూటమి ఉప రాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డి గురువారం ఢిల్లీలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. దేశంలో నెలకొన్న ఆర్థిక, రాజకీయ పరిస్థితులు, సామాజిక ఉద్రిక్తతలపై సోనియాగాంధీతో చర్చించినట్టు తెలిపారు. ఇండియా కూటమికి చెందిన మొత్తం ఓట్లు ఎందుకు పడలేదని ఆమె మథనపడ్డారన్నారు. క్రాస్ ఓటింగ్‌పై తాను ఎలాంటి వ్యాఖ్యలు చేయబోనని, అయితే, 15 మంది ఎంపీల ఓట్లు చెల్లకపోవడం ఆశ్చర్యకరమన్నారు. ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్‌ను కలిసి అభినందనలు తెలిపానన్నారు.

నిబంధనల సడలింపునకు సీసీఐ అంగీకారం

- పత్తి కొనుగోలు కేంద్రాలకు త్వరలో నోటిఫికేషన్
- జిన్నింగ్ మిల్లుల యజమానులతో ఢిల్లీలో సమావేశం
- సీసీ కెమెరాల ఏర్పాటు, రైతు మ్యాపింగ్‌పై చర్చ
- కీలక అంశాల్లో రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయమే ఫైనల్

గుంటూరు సిటీ, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని జిన్నింగ్ మిల్లుల యజమానులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్న నిబంధనలను సడలించేందుకు సీసీఐ సూత్రప్రాయంగా అంగీకరించింది. దేశంలో ఉన్న జిన్నింగ్ మిల్లుల యజమానులు, సీసీఐ అధికారులతో టెక్స్‌టైల్స్ మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి పద్మిని సింగ్లా గురువారం ఢిల్లీలో సమావేశం నిర్వహించారు. సీసీఐ సీఎండీ లలిత్ కుమార్ గుప్తా పాల్గొన్న ఈ సమావేశంలో లింట్ (దూది) నాణ్యతపై విధించిన పరిమితులను సడలించేందుకు పూర్తిస్థాయి అంగీకారం కుదిరింది. జిన్నింగ్ మిల్లులను బ్లాక్ లిస్టులో పెట్టే నిబంధనలు కూడా పూర్తిగా పక్కన పెడతామని హామీ ఇచ్చినట్టు తెలిసింది. పత్తి కొనుగోలు కేంద్రాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు, రైతుల మ్యాపింగ్, ఎల్ 1, ఎల్ 2 కేంద్రాల ఏర్పాటు వంటి అంశాలను రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయానికే వదిలేస్తున్నామని ప్రకటించినట్లు సమాచారం. సవరించిన నిబంధనలతో మరో నాలుగు రోజుల్లో కొత్త టెండర్ నోటిఫికేషన్ విడుదల చేస్తామన్నారు. రాష్ట్రం నుంచి ఆంధ్రప్రదేశ్ టీఎంసీ కన్సార్టియం ప్రతినిధులు మన్నవ హరినాథ్‌బాబు, ఎల్‌సీటీసీ శంకర్ పాల్గొన్నారు.

స్టాండింగ్ కౌన్సిల్ నియామకం

అమరావతి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): బాపట్ల, పల్నాడు, ఒంగోలు, నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల తరఫున హైకోర్టులో వాదనలు వినిపించేందుకు న్యాయవాది బొమ్మినాయుని అప్పారావు స్టాండింగ్ కౌన్సిల్‌గా నియమితులయ్యారు. మూడేళ్లపాటు పదవిలో కొనసాగుతారు. ఈ నియామకానికి సంబంధించి న్యాయశాఖ కార్యదర్శి జి.ప్రతిభాదేవి గురువారం ఉత్తర్వులు ఇచ్చారు.



అనంతపురం జిల్లా విడపనకల్లు మండలం ఉండబండ గ్రామం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వంక



కర్నూలు జిల్లా గూడూరు మండలంలోని వక్కిలేరు వాగులో చిక్కుకున్న ఆర్టీసీ బస్సు

కర్నూలు, అనంతలో భారీ వర్షం

పొంగిపొర్లిన వాగులు, వంకలు

- ఉధృతంగా వేదవతి, చిత్రావతి, హంద్రీ, కుందు
- వందల ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు
- నిలిచిన రాకపోకలు

కర్నూలు, నంద్యాల, అనంతపురం అర్బన్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): అనంతపురం, ఉమ్మడి కర్నూలు జిల్లాలోని పలు ప్రాంతాల్లో బుధవారం రాత్రి, గురువారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. కర్నూలు జిల్లా కొలిమిగుండ్ల మండలంలో 12.9, అనంతలోని యల్లనూరు మండలంలో 10.4 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. వాగులు, వంకలు పొంగిపొర్లాయి. పలు నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పలు గ్రామాలకు రాక పోకలు నిలిచిపోయాయి. వేలఎకరాల పంటలు నీట మునిగాయి.

అనంతపురం జిల్లాలో...

కణేకల్లు-మాల్యం మధ్యలో వేదవతి నది ఉధృతంగా ప్రవహించడంతో వాహనాల రాకపోకలు స్తంభించాయి. కర్ణాటకలో భారీ వర్షాలు కురవడంతో శ్రీసత్యసాయి జిల్లా చిలమత్తూరు మండలంలో కుషావతి, చిత్రావతి నదులు పరవళ్లు తొక్కాయి. యాడికి మండలం కోనుప్పలపాడు గ్రామ సమీపంలోని కోన రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద జలపాతం జీవం పోసుకుంది. కంది, వరి పంట నీట మునగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కణేకల్లు మండలంలో 16 హెక్టార్లల్లో రూ.4.05 లక్షల విలువైన వరి పంట దెబ్బతింది. అనంతపురం జిల్లా వ్యాప్తంగా 83.81 హెక్టార్లల్లో రూ.20.95 లక్షల విలువైన వేరుశనగ పంట దెబ్బతిన్నట్లు వ్యవసాయ శాఖ ప్రాథమికంగా అంచనా వేసింది. గుత్తి, యాడికి మండలాల్లో 3.53 హెక్టార్లల్లో రూ.9 లక్షల విలువైన టమోటా పంట దెబ్బతింది. శింగనమల మండలం గోవిందరావు పేటలో 3 ఎకరాల్లో కోత కోసిన వేరుశగన పంట వర్షానికి కొట్టుకుపోయింది.

కర్నూలు జిల్లాలో...

కర్నూలులో హంద్రీ నదీ ఉధృతంగా ప్రవహిస్తోంది. ఒక్కెర వాగు ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తోంది. పెంచికలపాడు దగ్గర బ్రిడ్జిపై వరద పోటెత్తింది. ఈ బ్రిడ్జి వద్ద ఉదయం గూడూరు నుంచి కర్నూలుకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు చిక్కుకుంది. కుందూ నది ఉధృతంగా ప్రవహించింది. కల్వటాల వద్ద ఎర్రవాగు ఉధృతంగా ప్రవహించింది. కొండ ప్రాంతాల్లో నుంచి వాగుకు పెద్ద ఎత్తున వరద నీరు పోటెత్తడంతో నెల్లూరు-ముంబై హైవేపై ట్రాఫిక్ నిలిచిపోయింది. ఆత్మకూరు పట్టణంలోని చాలా వీధులు జలమయమయ్యాయి. ఆత్మకూరు మండలంలోని గుండ్లకమ్మ వాగు ఉధృతంగా ప్రవహించింది. చాగలమర్రి, ప్యాపిలి మండలాల్లో పంటలు నీట మునిగాయి.

గరిష్ఠ నీటి మట్టానికి గాజులదిన్నె ప్రాజెక్టు

గాజులదిన్నె ప్రాజెక్టు గరిష్ఠ నీటి మట్టం 377 మీటర్లు, నీటి నిల్వ సామర్థ్యం 4.50 టీఎంసీలు. హంద్రీ నదిలో భారీగా వరద ప్రవహిస్తోంది. హంద్రీనీవా కాలువ నుంచి కూడా నీటిని విడుదల చేస్తున్నారు. సాయంత్రం 5 గంటల సమయంలో డ్యాంలోకి 7 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ఏ క్షణంలోనైనా గేట్లెత్తే అవకాశం ఉందని హంద్రీనీవా ప్రాజెక్టు కర్నూలు సర్కిల్ ఎస్‌ఈ, టీబీపీ ఎల్లెల్సీ ఈఈ పాండురంగయ్య తెలిపారు.

అల్పపీడనంతో నేడు, రేపు భారీ వర్షాలు..!

అమరావతి, విశాఖపట్నం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ మధ్య బంగాళాఖాతాన్ని ఆనుకుని ఉన్న ఉత్తరాంధ్ర-దక్షిణ ఒడిశా తీరంలో రానున్న రెండు రోజుల్లో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ గురువారం వెల్లడించింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, తీరం వెంబడి గంటకు 40-50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించింది. శుక్రవారం పశ్చిమ గోదావరి, ఏలూరు, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి, కడప, కర్నూలు, నంద్యాల, అనంతపురం జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, అల్లూరి, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, తూర్పు గోదావరి, కృష్ణా, శ్రీసత్యసాయి, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో కొన్ని చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. శనివారం ఏలూరు, ఎన్టీఆర్, పల్నాడు, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో భారీ వర్షాలు, ఇతర జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయని వివరించింది. గురువారం సాయంత్రం వరకు నంద్యాల జిల్లా కొత్తపల్లెలో 60.2, ఎనకండ్లలో 52.2, పాములపాడులో 38.7, అనకాపల్లి జిల్లా దేవరపల్లిలో 34.7, విజయనగరం జిల్లా గొల్లపాడులో 33.2 మిల్లీమీటర్ల వాన పడింది. కాగా, వాయవ్య భారతం నుంచి నైరుతి రుతుపవనాల నిష్క్రమణకు వాతావరణం అనుకూలంగా మారుతోంది.

కాకినాడ తీరం కల్లోలం

కొత్తపల్లి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం ఉప్పాడతీరం అల్లకల్లోలంగా మారింది. రాకాసి అలలు ఉప్పాడ గ్రామంలోకి దూసుకొస్తున్నాయి. 5-6 మీటర్ల ఎత్తులో కెరటాలు ఎగసిపడుతుండటంతో కొత్తపట్నంలోని మత్స్యకారుల ఇళ్లల్లోకి నీరు చేరింది. ప్రాథమిక పాఠశాల నీట మునిగింది. ఉప్పాడ బీచ్‌రోడ్డు వంద అడుగుల పొడువునా కోతకు గురైంది. పరిశీలించేందుకు వెళ్లిన పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ బీచ్‌రోడ్డులో ఉవ్వెత్తున ఎగసిన కెరటాల్లో చిక్కుకుపోయారు. అక్కడి నుంచి వర్మ ధైర్యంగా తప్పించుకోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. ఈ వీడియో గురువారం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.



కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలంలో కోతకు గురైన ఉప్పాడ బీచ్‌రోడ్డు

సీపీ రాధాకృష్ణన్‌తో దీపా వెంకట్ భేటీ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): భారత ఉప రాష్ట్రపతిగా నూతనంగా ఎన్నికైన సీపీ రాధాకృష్ణన్‌తో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు కుమార్తె, స్వర్ణభారత్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ దీపా వెంకట్ మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. గురువారం, మహారాష్ట్ర భవన్‌లో సీపీ రాధాకృష్ణన్‌ను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.



సీపీ రాధాకృష్ణన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న దీపా వెంకట్

సమస్యలు పరిష్కరించకపోతే నిరవధిక సమ్మె

- ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయాలి
- ఫీజుల ఖరారు అధికారం యూనివర్సిటీలకు ఇవ్వాలి
- ప్రైవేటు డిగ్రీ కాలేజీల సంఘాల డిమాండ్
- డిమాండ్లపై ప్రభుత్వానికి 20 వరకు గడువు

అమరావతి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): డిగ్రీ కాలేజీల ఫీజు బకాయిలు, ఇతర సమస్యలను ఈ నెల 20లోగా పరిష్కరించకపోతే సమ్మె చేపడతామని, నిరవధికంగా కాలేజీలను మూసివేస్తామని ప్రైవేటు డిగ్రీ కాలేజీ యాజమాన్యాల సంఘాలు ప్రకటించాయి. రెండు ప్రధాన సంఘాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జె.రమణాజీ, సి.విజయభాస్కర్ రెడ్డి, పి.జయరాం, పి.పెద్దిరాజు ఈ మేరకు వేర్వేరుగా ప్రకటనలు విడుదల చేశారు. ఫీజుల బకాయిలను వెంటనే విడుదల చేయాలని, ప్రస్తుత అవసరాలకు తగ్గట్టుగా డిగ్రీ కోర్సులకు కొత్త ఫీజులు ఖరారు చేయాలని కోరారు. డిగ్రీ కోర్సులకు ఫీజులు నిర్ణయించే అధికారం ఉన్నత విద్య కమిషన్ నుంచి యూనివర్సిటీల పరిధిలోకి మార్చాలని డిమాండ్ చేశారు. డిగ్రీ కాలేజీలకు అఫిలియేషన్ ఐదేళ్లకు పెంచాలని, అన్ని యూనివర్సిటీలకు కామన్ అఫిలియేషన్ విధానం అమలుచేయాలని, డిగ్రీ ఆన్‌లైన్ అడ్మిషన్లలో జరుగుతున్న గందరగోళాన్ని తొలగించాలని పేర్కొన్నారు. పది రోజుల్లో ఈ డిమాండ్లు పరిష్కరించని పక్షంలో నిరవధిక సమ్మెకు దిగి కాలేజీలు మూసివేస్తామని స్పష్టంచేశారు. దీనిపై సీఎంతో పాటు ఉప ముఖ్యమంత్రి, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి, ఆర్థిక శాఖ మంత్రి, విద్యాశాఖ ఉన్నతాధికారులకు వారు లేఖలు రాశారు. గత ఐదేళ్లలో ఉన్నత విద్యకు సరైన తోడ్పాటు లేకపోయినా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో ఎంతో కృషి చేశామన్నారు. గత ప్రభుత్వంలో అశాస్త్రీయంగా డిగ్రీ కోర్సులకు ఫీజులు ఖరారు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వం సరైన ఫీజులు నిర్ణయించి, సకాలంలో వాటిని విడుదల చేసిందని, కానీ ఈసారి 16 నెలల్లో కేవలం ఒక్క విడత ఫీజులే కాలేజీలకు అందాయని వివరించారు. రాష్ట్రంలో ఉన్న 1380 డిగ్రీ కాలేజీల్లో 4.5 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారని, ఫీజులు పెండింగ్ వల్ల కాలేజీలు నడపలేని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తంచేశారు. లెక్చరర్లకు జీతాలు ఇవ్వలేకపోతున్నామని, నిర్వహణ వ్యయాలు భరించలేకపోతున్నామన్నారు. చివరికి అప్పులు కూడా పుట్టని పరిస్థితి తలెత్తిందన్నారు. అందువల్ల వెంటనే ఫీజులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

బీజేపీతో అంటకాగితే టీడీపీ ఉనికి ప్రశ్నార్థకం

- బీవీ రాఘవులు

అమరావతి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : రాజకీయాల్లో మతోన్మాద, విభజన విధానాలను అనురిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీని వదిలించుకుంటేనే దేశం ముందుకు వెళుతుందని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బి.వి.రాఘవులు అన్నారు. విజయవాడలోని బాలోత్సవ్ భవన్‌లో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీకి దూరం జరిగితేనే టీడీపీకి లాభమని, ఇలాగే అంటకాగుతూ ఉంటే టీడీపీ ఉనికినే ప్రశ్నించుకునే పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు. తెలుగుదేశం పార్టీకి ఒక ప్రత్యేకత ఉందని, దానిని నిలబెట్టుకోవాలని హితవు పలికారు. అనంతరం మాకినేని బసవపున్నయ్య భవన్‌లో నిర్వహించిన సీపీఎం పూర్వ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సభలో రాఘవులు పాల్గొని ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏచూరి వ్యాసాలతో ప్రజాశక్తి ప్రచురించిన ఓ సోషలిస్టు ఆచరణ పథకం పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు.

ఆక్వా రైతుకు ధరల స్థిరీకరణ అవసరం

అమెరికా అధిక సుంకాలతో కుదేలు.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టిసారించాలి

- సీడ్, ఫీడ్ మాఫియాపై చర్యలు తీసుకోవాలి
- రాష్ట్ర స్థాయి ఆక్వా రైతుల సదస్సులో వక్తలు

విజయవాడ సిటీ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): "దేశ వ్యాప్తంగా రొయ్యలు, చేపల ఎగుమతుల్లో ఆంధ్రప్రదేశ్ వాటా 70 శాతం. దేశానికి ఏడాదికి రూ.60 వేల కోట్ల ఆదాయాన్ని పన్నుల రూపంలో రాష్ట్ర ఆక్వా రైతులు సమకూర్చుతున్నారు. మార్కెట్ సెస్, ఇతర పన్నుల రూపంలో రాష్ట్రానికి రూ.30 వేల కోట్ల ఆదాయం వస్తోంది. రాష్ట్రంలోని ఆక్వా ఉత్పత్తులు ప్రపంచంలోని 60 దేశాలకు ఎగుమతి అవుతున్నాయి. ఒక్క అమెరికా అధిక సుంకాలు వేసినందుకే వనామి, టైగర్ రొయ్యల ధరలు అమాంతం పడిపోయాయి. దీనిపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మిన్నకుండిపోవడం దురదృష్టకరం. రైతు ప్రభుత్వమని వేదికలపై ఊకదంపుడు ఉపన్యాసాలే తప్ప, వాస్తవంగా రైతులను ఆదుకున్న దాఖలు కనిపించడం లేదని" పలువురు రైతు సంఘాలు, ఆక్వా రైతు సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర స్థాయి ఆక్వా రైతుల సదస్సు విజయవాడలోని బాలోత్సవ్ భవన్‌లో గురువారం జరిగింది. రొయ్యల ధరలు నానాటికి క్షీణిస్తున్న తరుణంలో రాష్ట్రంలోని రైతులు ఈ సదస్సు ద్వారా వారి అభిప్రాయాలను వెల్లడించారు. భవిష్యత్తు ఆహార ఉత్పత్తుల అవసరాల దృష్ట్యా సాగు విస్తీర్ణం పెంచి, సబ్సిడీలు ఇచ్చి రైతులకు అండగా నిలిస్తే మరో 20 ఏళ్లలో ఏడాదికి రూ.6 లక్షల చొప్పున విదేశీమారక ద్రవ్యాన్ని సాధించవచ్చని రైతు సంఘ రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య తెలిపారు. రొయ్యలు, చేపల సాగు చాలా ఖర్చుతో కూడుకున్న కష్టతరమైనదని, సుంకాలకు భయపడకుండా మార్కెట్‌ను విస్తృతం చేసేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్వేషించి రైతులకు అండగా నిలవాలని ఆక్వా రైతుల సంఘం నాయకులు బి.బలరామ్ విజ్ఞప్తి చేశారు. రొయ్యలు, చేపల ఉత్పత్తులపై స్వయం సమృద్ధి సాధించే దిశగా ప్రభుత్వాలు ఆలోచన చేయాలని జైభారత్ క్షీరరామ ఆక్వా రైతుల సంఘం కార్యదర్శి బోనం వెంకట నరసయ్య సూచించారు. చాంబర్ ఆఫ్ కామర్స్ రాష్ట్ర నాయకులు వక్కలగడ్డ భాస్కరరావు మాట్లాడుతూ.. యూరప్ దేశాల్లో సాగు విధానాలను అధ్యయనం చేశానని, ఆ దిశగా రైతులను ఆదుకోవాలని ఎన్నోసార్లు ఎన్నో ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశానని తెలిపారు. విదేశీ మారకద్రవ్యాన్ని తీసుకొచ్చే ఆక్వా ఉత్పత్తులను పెంచేందుకు ప్రభుత్వం ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. సీడ్, ఫీడ్, ఎక్స్‌పోర్ట్ కంపెనీలు సైబర్ మాఫియాగా తయారయ్యాయని వేటపాలెం ఆక్వా రైతుల సంఘ నాయకులు ఆమంచి స్వాములు ఆరోపించారు. 30, 40 కౌంట్ రొయ్యలు మాత్రమే అమెరికా వెళ్తాయని, ట్రంప్ సుంకాలను బూచిగా చూపించి 50, 60, 70, 80, 100 కౌంట్ రొయ్యల రేట్లను తగ్గించేసి, దోచుకుంటున్నారని మండిపడ్డారు. ఆక్వా రైతులను విద్యుత్ శాఖ అధికారులు నిలువునా దోచుకుంటున్నాని ప్రకాశం జిల్లా ఆక్వా రైతుల సంఘం నాయకులు తేళ్ల రామయ్య మండిపడ్డారు.



సదస్సులో మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయ్య, చిత్రంలో రైతు సంఘం ప్రతినిధులు

ఉద్యమాలతో ఆర్‌ఎస్‌ఎస్‌ను నిలువరించాలి

- ఇందుకు వామపక్షాలు సిద్ధమవ్వాలి
- సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.బేబి పిలుపు



పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగిస్తున్న ఎం.ఎ.బేబి

మద్దిలపాలెం (విశాఖపట్నం), సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): దేశంలో నేడు నయా ఫాసిస్ట్ స్వభావంతో నడుచుకుంటున్న ఆర్‌ఎస్‌ఎస్‌ను ఉద్యమాలతో నిలువరించడానికి వామపక్షాలన్నీ సిద్ధమవ్వాలని సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.బేబి పిలుపునిచ్చారు. విశాఖపట్నంలోని పిఠాపురం కాలనీలో నూతనంగా నిర్మించిన సీపీఎం జిల్లా కార్యాలయాన్ని (ఏచూరి భవన్) గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటాలను అణచివేయడానికి గూండాల గుంపులను పోగేసుకుని ఆర్‌ఎస్‌ఎస్ కర్కశంగా, నేరపూరితంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఆర్‌ఎస్‌ఎస్ విధానాలను నిలువరించి వామపక్ష భావజాలాన్ని నిలబెట్టడమే ఏచూరికి నిజమైన నివాళని ఉద్ఘాటించారు. స్వాతంత్ర్య దినోత్సవం నాడు ప్రధాని మోదీ ఎర్రకోట నుంచి ఆర్‌ఎస్‌ఎస్‌ను పొగిడారని, కానీ ఆర్‌ఎస్‌ఎస్‌కు రాజ్యాంగం పట్ల విశ్వాసం లేదన్నారు. మత విద్వేషాలను రెచ్చగొట్టడం ద్వారా బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ తమ ఉనికిని చాటుకుంటున్నాయన్నారు. కేరళలోనూ ఇదే పద్ధతి పాటిస్తున్నాయన్నారు. అస్సోంలో విదేశీయుల పేరుతో పౌరుల హక్కులను కాలరాస్తూ మత విద్వేషాలను రెచ్చగొట్టేందుకు ఆర్‌ఎస్‌ఎస్ చూస్తోందన్నారు. అనంతరం ఏచూరితో తన అనుభవాలను గుర్తుచేసుకుని ఉద్వేగానికి గురయ్యారు. కార్యక్రమంలో సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.పుణ్యవతి, కె.లోకనాథం, సీనియర్ నాయకులు సి.హెచ్.నరసింగరావు, మాజీ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్.శర్మ, నాయకులు జగ్గునాయుడు, ఆర్కెఎస్వీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జాతి నిర్మాణంలో విద్యకు అధిక ప్రాధాన్యం

గవర్నర్ అబ్దుల్ నజీర్



విద్యార్థులకు డిగ్రీ పట్టాలను ప్రదానం చేస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): జాతి నిర్మాణంలో విలువలతో కూడిన విద్య గొప్ప ప్రాధాన్యతను సంతరించుకుందని రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరి మండలం కురగల్లు గ్రామంలోని అమృత విశ్వ విద్యాపీఠం తొలి స్నాతకోత్సవం గురువారం జరిగింది. గవర్నర్ అబ్దుల్ నజీర్ ముఖ్యఅతిథిగా పాల్గొని గ్రాడ్యుయేట్లకు డిగ్రీ పట్టాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు నిత్యం నేర్చుకుంటూనే ఉండాలని.. ఎక్కడికి వెళ్లినా, ఏ పని చేసినా కొత్త విషయాలను నేర్చుకోవడంపై దృష్టిసారించాలని సూచించారు. భౌతికంగా అనేక వస్తువులు వస్తూ పోతూ ఉంటాయని, నేర్చుకున్న విజ్ఞానం మాత్రం శాశ్వతంగా నిలిచిపోతుందని చెప్పారు. మాతా అమృతానందమయి దేవి మానవతా దృక్పథం ద్వారా మార్గనిర్దేశం చేసిన సంస్థలో డిగ్రీలు పూర్తిచేసిన విద్యార్థులను ఆయన అభినందించారు. మాతా అమృతానందమయి మఠం ప్రధాన కార్యదర్శి స్వామి పూర్ణామృతానంద పూరి మాట్లాడుతూ విద్య, కరుణ ఆధారిత పరిశోధనలు అనే లక్ష్యంతో అమృత విద్యాపీఠం పనిచేస్తుందన్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఆధార్‌కు ఆమోదం!

బిహార్‌లో సమగ్ర ప్రత్యేక సవరణ (సర్)కు ఎన్నికల సంఘం ఉపక్రమించిన 77రోజుల తరువాత, ఓటర్ల జాబితాలో 65 లక్షల ఓట్లు తొలగించిన అనంతరం, చెల్లుబాటయ్యే ఒక గుర్తింపుగా ఆధార్‌ను పరిగణనలోకి తీసుకోవాలంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను ఎన్నికల సంఘం ఎట్టకేలకు, అయిష్టంగానే ఆమోదించింది. ఇకమీదట, ఆధార్‌ను కూడా ఓ ఆధారంగా స్వీకరించండి అంటూ బిహార్‌లో ఉన్న తన ఎన్నికల ప్రధానాధికారికి ఈసీ ఆదేశాలు జారీ చేసింది. మధ్యంతర ఉత్తర్వుల ద్వారా ఒక తీవ్ర సమస్యను సుప్రీంకోర్టు ఇలా పరిష్కరిస్తూనే ఆధార్ పౌరసత్వ ధ్రువీకరణ కాదన్న ఎన్నికల సంఘం వాదననే పునరుద్ఘాటించింది. అంతేకాదు, బిహార్ అక్రమవలసదారులకు నిలయం అంటూ ఎన్నికల సంఘం పదేపదే కోర్టును హెచ్చరిస్తూ వచ్చిన నేపథ్యంలో, ఒక పౌరుడి ఆధార్ అసలైనదో, నకిలీదో నిర్ధారించే అధికారాన్ని కూడా సుప్రీంకోర్టు ఎన్నికల సంఘానికే ఇచ్చింది. ఈ దేశంలో పుట్టిన ప్రతీవ్యక్తి ఉనికినీ, మనుగడను నిర్ధారిస్తున్న, ప్రతీ అవసరాన్నీ తీరుస్తున్న ఆధార్‌ను సర్‌లో మాత్రం సర్వోన్నత న్యాయస్థానం పన్నెండో స్థానంలో ఉంచింది. ఒక వ్యక్తిని ఓటరు లిస్టులో చేర్చడానికీ లేదా తొలగించడానికి ఎన్నికలసంఘం గుర్తించిన ధ్రువీకరణ పత్రాల జాబితాలో ఆధార్ ఎట్టకేలకు అడుగున చేరింది.


బిహార్‌లో దాదాపుగా ప్రజలందరి దగ్గరా ఉన్న ఒక గుర్తింపు పత్రాన్ని తాను గుర్తించేది లేదంటూ ఎన్నికల సంఘం తీవ్రంగా పోరాడింది. అభ్యంతరం ఏమిటంటూ సుప్రీంకోర్టు కూడా పలుమార్లు ప్రశ్నించింది. గుర్తించి తీరాల్సిందేనంటూ మొన్న విస్పష్టమైన ఆదేశాలు జారీచేసేలోగా కనీసం మూడుసార్లు న్యాయస్థానం ఆధార్‌ను చేర్చమంటూ ఈసీని కోరింది. ఒక లబ్ధిదారుగా ప్రయోజనాలు పొందడానికి అది పనికొస్తుందేమో కానీ, పౌరసత్వ ధ్రువీకరణ పత్రం కాబోదని ఈసీ వాదన. శాశ్వత నివాసం, కులం, పాస్‌పోర్టు సహా ఎన్నికల సంఘం ప్రకటించిన పదకొండు డాక్యుమెంట్లనూ పొందడానికి మూలాధారంగా ఉపకరిస్తున్న ఆధార్, ఓటుహక్కుకు ఎందుకు పనికిరాకుండా పోయిందన్నది అసలు ప్రశ్న. తాను స్వయంగా జారీచేసిన ఓటరు గుర్తింపు కార్డును కూడా ఎన్నికల సంఘం కాదంటూ వచ్చింది. జాబితాలో చేర్పులు జరగాలి కానీ, మూకుమ్మడి తొలగింపులు కాదు అంటూ ఒక దశలో న్యాయస్థానం చిరాకుపడి, ఆధార్, ఓటరు కార్డు విషయంలో మరింత ఒత్తిడి తీసుకువచ్చింది కూడా. 65లక్షల మంది ఓటర్లను తొలగించిన ముసాయిదాను బహిరంగపరచాలన్న కోర్టు సూచనను కూడా, ఇది ఉపకారం కంటే అపకారమే చేస్తుందంటూ ఎన్నికల సంఘం తిరస్కరించింది. అయితే, అభ్యంతరాలు తెలియచేయడానికి అప్పటివరకూ ఉన్న సెప్టెంబరు 1 గడువును పొడిగించడానికి మాత్రం ఒప్పుకుంది. చివరకు కోర్టు కూడా ఆధార్ చట్టం ప్రకారం అది సిటిజెన్‌షిప్ ప్రూఫ్ కాదంటూనే, ఐడీప్రూఫ్‌గా వాడవలసిందేనంటూ వివాదాన్ని ముగించింది. ఎన్నిసార్లు చెప్పినా వినని ఎన్నికల సంఘం కూడా అయిష్టంగానే సరేనంది.

అక్రమ వలసదారులను జాబితాలో చేర్చాలని ఎవరూ కోరుకోరు, అంత మాత్రాన అసలుసిసలు పౌరులకు ఏదో ఒక డాక్యుమెంట్ లేదన్న కారణంగా అన్యాయం జరగకూడదు, అనర్హుడుగా మిగిలిపోకూడదు అంటూ సర్వోన్నత న్యాయస్థానం చేసిన వ్యాఖ్య ఎంతో ఉన్నతమైనది. ఇప్పటివరకూ ఓటరు జాబితాలో ఉంటూ, దశాబ్దాలుగా అనేక ప్రభుత్వాలను అధికారంలో కూచోబెట్టిన లక్షలాది ఓటర్ల పేర్లు ఈ సమూల ప్రక్షాళన కార్యక్రమంలో గల్లంతైన మాట నిజం. ఆధార్‌ను ఆమోదించాలన్న కోర్టు ఆదేశాలతో ఎంతోమందికి న్యాయం జరిగే అవకాశాలు ఇప్పుడు పెరిగాయి. ఇక, నకిలీ ఆధార్‌లు ఉంటాయనీ, వాటిని నిగ్గుతేల్చవచ్చునంటూ న్యాయస్థానమే అధికారాలు అప్పగించిన నేపథ్యంలో, ఏ మాత్రం తేడాపాడాలున్నా అధికారులకు కాదుపొమ్మనే అవకాశాలు కూడా మెండుగా ఉంటాయి. ప్రతీ 1500మంది స్థానంలో ఇప్పుడు 1200మందికి ఓ పోలింగ్‌బూత్ కేటాయిస్తున్నందున వాటిసంఖ్య 77వేల నుంచి 91వేలకు పెరిగిందనీ, బూత్‌లకు కొత్తనెంబర్లు వచ్చాయనీ, ఆధార్ ఆధారంగా తిరిగి జాబితాలో చేరాలనుకుంటున్నవారు కొత్త బూత్ లెవల్ ఆఫీసర్ (బీఎల్‌వో)తో వ్యవహరించవలసి ఉంటుందని వార్తలు వింటున్నాం. అత్యధిక నిరక్షరాస్యత ఉన్న బిహార్‌లో మరో పదిహేనురోజుల్లోగా ఈ పనంతా ఎంత సవ్యంగా పూర్తవుతుందో తెలియదు. ఆధార్‌ను గుర్తించాలంటూ పోరాడుతున్నవారంతా అక్రమవలసదారుల పక్షాన ఉన్నట్టేనని కోర్టులో బలంగా వాదించిన ఎన్నికల సంఘం, సుప్రీం ఆదేశాలను ఎంత సమర్థంగా అమలు చేస్తుందో చూడాలి.

అమెరికా... అమెరికా.. ఎక్కడ నుంచి ఎక్కడకు!

ప్రాభవం కోల్పోతున్నప్పుడు, దానికి విరుగుడుగా ప్రత్యామ్నాయ మార్గమూ దొరకనప్పుడు విపరీత ప్రవర్తన కనపడుతుంది. వ్యక్తికైనా దేశానికైనా ఇదే వర్తిస్తుంది. ప్రపంచ దేశాల మీద ఎడాపెడా సుంకాలు విధిస్తూ అల్లకల్లోలం సృష్టిస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనల్డ్ ట్రంప్ చర్యల్లో మనకు కనపడేది ఇదే. ఆధిపత్యానికి కావాల్సిన హంగులు, ఏర్పాట్లు, మేధో విశిష్టతలు ఒక్కొక్కటిగా కోల్పోతున్నప్పుడు మర్యాదలూ, సంయమనాలూ మట్టికల్సిపోతాయి. దౌత్యనీతులు మంటగలుస్తాయి. చుట్టూ శత్రు సమూహాలు కమ్ముకొస్తున్నట్లుగా హడావుడులు హోరెత్తుతాయి. పైపైన చూస్తే ట్రంప్ లాంటి నాయకులు తమ ప్రవర్తనతో, లోతులేని ఆలోచనలతో కోరికోరి అమెరికాకు నష్టాలు తెచ్చిపెడుతున్నట్లుగా కనిపిస్తుంది. వ్యక్తుల ప్రవర్తన, వ్యక్తిత్వమే అన్నిటికీ కీలకం అనుకుంటే అసలు పరిస్థితులు అర్థంకావు. నాయకుల ప్రభావం చరిత్రగతి మీద ఉంటుంది. దాన్ని కాదనలేం. కానీ ఒక సమాజం, ఒక దేశం సంక్లిష్ట ప్రయాణాన్నీ, ఆటుపోట్లనూ అర్థం చేసుకోటానికి ఎన్నో పరిస్థితులను పరిగణనలోకి తీసుకోవాల్సి వస్తుంది. నిజానికి ఆ పరిస్థితుల్లో నుంచే విపరీత పోకడల నేతలు పుట్టుకొస్తారు.

వాణిజ్య సుంకాలను అస్త్రాలుగా ఉపయోగించి, వివిధ దేశాల ఎగుమతులపై అనిశ్చితిని సృష్టించి, అమెరికాకు నచ్చినట్టు ఆయా దేశాల ఆర్థిక వ్యవహారాలను మార్చటానికి ట్రంప్ చేస్తున్న ప్రయత్నాలను సునిశితంగా పరిశీలిస్తే ఒక సంక్షోభమే కనపడుతుంది. ఆధిపత్యం కోల్పోతున్న క్రమం వెల్లడవుతుంది. ఎగుమతులు తగ్గి దిగుమతులు విపరీతంగా పెరగటం అమెరికాకు నిన్నోమొన్నో మొదలవ్వలేదు. దిగుమతుల కంటే ఎగుమతులు ఎక్కువ ఉంటే ఏ దేశమైనా వాణిజ్యపరంగా మిగులును (ట్రేడ్ సర్ప్లస్) కలిగి ఉంటుంది. అమెరికా ఆ స్థానాన్ని ఎప్పుడో కోల్పోయింది. 1976 నుంచి ఇప్పటివరకూ ఏ ఏడాదిలోనూ వాణిజ్య మిగులును సాధించలేదు. రకరకాల వస్తువులు, పరికరాలు, పదార్థాలు, యంత్రాల కోసం విదేశాలపై ఆధారపడటం 50 ఏళ్లగా కొనసాగుతోంది. ముడిసరుకులు, శ్రమశక్తి చవకగా ఉన్న దేశాల నుంచి ఎగుమతులను ప్రోత్సహించటం ఒకనాడు విధానంగా పెట్టుకుంది. అక్కడికి పెట్టుబడులనూ తరలించింది. అటువంటి దేశాలను అన్ని విధాలా వెన్నుతట్టింది. తనకు చౌకగా వస్తువులను ఎగుమతి చేసే దేశాలను స్వేచ్ఛా వాణిజ్యానికి అసలుసిసలైన ప్రతినిధులుగా కీర్తించింది. ప్రపంచీకరణ బాగా ఊపందుకున్న 1990ల తర్వాత బ్యాంకింగ్, ఇన్సూరెన్స్, ఐటీ ఆధారిత, విమాన ప్రయాణం, పర్యాటక, విద్యా, మేధో హక్కుల రంగాలకు సంబంధించిన వాణిజ్యసేవల లావాదేవీల్లో అమెరికా మిగులును సాధిస్తూ వస్తున్నా, వస్తూత్పత్తి రంగాల్లో వెనుకబడి పోయింది. కిందటి ఏడాదిలో వస్తూత్పత్తి లావాదేవీల్లో 1.21 ట్రిలియన్ డాలర్ల లోటు ఉంది. సర్వీసు రంగాల్లో వచ్చిన మిగులు 293 బిలియన్ డాలర్లు ఉన్నప్పటికీ మొత్తంగా చూస్తే దాదాపు 918 బిలియన్ డాలర్ల లోటు ఏర్పడింది. ఇదొక విపత్కర పరిస్థితి. అగ్రగామి దేశానికి వాణిజ్య మిగులు ఉండటం సహజం. మొదటి ప్రపంచ యుద్ధం వచ్చేవరకూ దాదాపు వందేళ్ల పాటు వాణిజ్యంలో బ్రిటన్ మిగులును సాధించింది. ఆ తర్వాత దాన్ని కోల్పోయింది. దాంతో ప్రపంచంలో ఒకటో స్థానాన్నీ కోల్పోయింది. ఆ తర్వాత ఆర్థికపరంగా చాలా మెట్లు దిగాల్సి వచ్చింది. వస్తు, యంత్ర ఉత్పత్తిలో అగ్రగామిగా ఉన్నంతవరకూ బ్రిటన్ ఆధిక్యాన్ని నిలబెట్టుకుంది. అమెరికా కూడా ఒకప్పుడు ఆ రకంగానే తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంది. 1980ల తర్వాత ఆసియా దేశాలు బాగా ముందంజ వేస్తున్న పరిస్థితుల్లో ఆ స్థానాన్ని అమెరికా తిరిగి పొందే అవకాశం కనపడటంలేదు. మాగా, మాగా (మేక్ అమెరికా గ్రేట్ అగెన్) అనే నినాదంపై ఎంతగా గొంతెత్తినా ఆశించిన ఫలితాన్ని సాధించటం అంత తేలికకాదు.



akbar

> ఇప్పటి అమెరికా పరిస్థితి చూస్తే 1987లో పాల్ కెనడీ తన పుస్తకం 'ద రైజ్ అండ్ ఫాల్ ఆఫ్ ద గ్రేట్ పవర్స్'లో చెప్పిన విషయాలు గుర్తుకు రాకుండా ఉండవు. ఆర్థిక బలం, సైనికశక్తి, ప్రాబల్య విస్తరణ.. ఈ మూడు ఒకదానితో ఒకటి ముడిపడి ఉంటాయనీ.. ఒకనాడు ఆధిపత్యం నెరపి, ఆ తర్వాత దాన్ని కోల్పోయిన రాజ్యాలన్నిటినీ ఈ కోణం నుంచే చూడాలని చెప్పారు. ఆసియా ఖండం నుంచి అమెరికాకు సవాల్ ఎదురుకానుందని కూడా అప్పుడే హెచ్చరించారు. ఆ తర్వాత పరిణామాలన్నీ దాన్ని ధ్రువపరచే విధంగానే ఉన్నాయి.

స్వదేశంలో పెట్టుబడులు పెట్టాలని ఆపిల్, మైక్రోసాఫ్ట్, ఇంటెల్ లాంటి బడా టెక్ కంపెనీలపై విపరీత ఒత్తిళ్లు వస్తున్నా అవి ఎంతమేరకు నెరవేరతాయో ఇప్పుడే చెప్పలేం. రాజకీయ పరిస్థితులు మారిపోతే ఆ ఒత్తిళ్లు తగ్గుతాయి. లాభాలు, ఇతరత్రా ఉండే సానుకూలతలకే కంపెనీలు ప్రాధాన్యం ఇస్తాయి. వాటి ముందు దేశభక్తి నిలబడటం కష్టం!

అమెరికాతో పోల్చితే చైనా ట్రిలియన్ డాలర్ల మిగులు వాణిజ్యంలో ఉండటానికి కారణం వస్తూత్పత్తిలోనూ, శాస్త్ర సాంకేతిక రంగాల్లో సాధించిన అనూహ్య అభివృద్ధే. ఆధునిక చరిత్రలోనే ఇది అపూర్వం. గ్లోబలైజేషన్ గురించి ఎన్నో పొగడ్తలతోనూ, పోటీ పునాదిగా ఆర్థిక వ్యవస్థలు మారటానికి అదెలా కారణమవుతుందో వివరిస్తూ ప్రముఖ వ్యాఖ్యాత థామస్ ఫ్రీడ్‌మన్ 2005లో 'ద వర్ల్డ్ ఈజ్ ఫ్లాట్' పుస్తకాన్ని రాశారు. ఆన్‌లైన్ ట్రేడింగ్, ఐటీ ఆధారిత సర్వీసులు ప్రపంచాన్ని ఎట్లా మార్చి వేయబోతున్నాయో అప్పుడే చెప్పారు. ప్రపంచీకరణతో అన్ని దేశాలకూ సమాన అవకాశాలు దక్కుతాయని చెప్పటమే కాకుండా అందుకు ఉదాహరణలుగా బెంగళూరులో ఐటీ కంపెనీల గురించి ఘనంగా వివరించారు. అసలు 'వర్ల్డ్ ఈజ్ ఫ్లాట్' అన్న భావననే తాను ఇన్ఫోసిస్ చీఫ్‌గా ఉన్న నందన్ నిలేకని నుంచి స్వీకరించానని కూడా తెలిపారు. ఫ్రీడ్‌మన్ ఒక విషయాన్ని ఆనాడు చాలా స్పష్టంగా చెప్పారు. సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథమ్యాటిక్స్ (స్టెమ్) కోర్సుల్లో అమెరికన్ విద్యార్థుల సంఖ్య తగ్గిపోవటం ప్రమాదకరంగా మారుతోందనీ దాన్ని అరికట్టకపోతే తీవ్ర ప్రమాదం పొంచివుందనీ హెచ్చరించారు. ప్రపంచప్రఖ్యాతి గాంచిన విద్యా సంస్థల్లోని స్టెమ్ కోర్సుల్లో ఆసియా విద్యార్థుల ఆధిపత్యం పెరిగిపోతోందనీ, అది అలాగే కొనసాగితే కొత్త టెక్నాలజీలకు అమెరికా నాయకత్వం వహించే పరిస్థితి ఉండదనీ చెప్పారు. 2005 నాటికే చైనా, జపాన్‌ల్లో అమెరికా కంటే ఎన్నో రెట్లు ఎక్కువగా స్టెమ్ సబ్జెక్టుల్లో చదివే విద్యార్థులు ఉన్నారు. తాజా లెక్కల ప్రకారం ఈ ఏడాదిలో చైనాలో స్టెమ్ కోర్సుల్లో పీహెచ్‌డీ పూర్తిచేసే పరిశోధక విద్యార్థులు 77,000 మంది ఉంటే అమెరికాలో ఆ సంఖ్య 40,000 మాత్రమే. ఇందులోనూ ఆసియా విద్యార్థుల సంఖ్య గణనీయంగానే ఉంటుంది. వీసాల ఆంక్షలతో, సవాలక్ష శల్య పరీక్షలతో ఆసియా పరిశోధకులకు అడ్డంకులు సృష్టిస్తే స్టెమ్ కోర్సుల్లో చేరే ప్రతిభావంతుల సంఖ్య ఇంకా తగ్గుతుంది. పరిశోధన-అభివృద్ధి (ఆర్ అండ్ డీ) కోసం ఖర్చుపెట్టే నిధుల విషయంలో కూడా చైనా అమెరికాను ఈ ఏడాది దాటేయబోతోంది. అమెరికా ఆధిపత్యానికి గండిపడటానికి ఇవన్నీ గట్టి సూచికలు.

సుంకాల యుద్ధంలో తాను ఇప్పటికే విజయం సాధించాననే భావనతోనే ట్రంప్ ఉన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 11 నెలల కాలానికి దిగుమతి సుంకాల ద్వారా 183.6 బిలియన్ డాలర్ల ఆదాయం వచ్చింది. 2024లో వచ్చిన 77 బిలియన్లతో పోల్చుకుంటే ఇది చాలా ఎక్కువ. 2023 నాటి 93 బిలియన్ డాలర్లతో పోల్చినా దాదాపు రెట్టింపు అయినట్లు లెక్క. అయినా అమెరికాను విపరీతంగా కుంగదీస్తోన్న బడ్జెట్ లోటును అది ఆర్చేది తీర్చేది కాదు. ఆ లోటును పూడ్చటానికి అదనపు సుంకాల విధింపును సాధనంగా ఎంచుకున్నా దక్కే ఫలితం మాత్రం కొంతే. 1900 బిలియన్ డాలర్ల బడ్జెట్ లోటులో (2025 అంచనాలు) సుంకాల ద్వారా లభించే మొత్తం ఆదాయం 10 శాతానికి కాస్త అటూఇటూగానే ఉంటుంది. లోటుని పూడ్చటానికి సుంకాలు పెంపు పరిష్కారం కాదనేది ఈ అంకెలే చెబుతాయి. దిగుమతి సుంకాల పెంపు ఆర్థిక వ్యవస్థను సంక్షోభంలోకి నెట్టివేసే ప్రమాదం ఉందని రేటింగ్ సంస్థలు తీవ్ర హెచ్చరికలు చేస్తున్నా ట్రంప్ బృందం పట్టించుకోవటంలేదు.

ఒకప్పుడు అభివృద్ధి చెందుతోన్న దేశాలు తమ దుస్థితికి పరోక్షంగానో, ప్రత్యక్షంగానో ధనిక దేశాలే కారణమని విమర్శించేవి. ధనిక దేశాల సామ్రాజ్యవాదానికి దాదాపుగా ఆసియాలో అన్ని దేశాలూ బాధలు పడినవే. దోపిడీకి లోనైనవే. ఇప్పుడు అత్యంత ధనికదేశం తన దుస్థితికి అభివృద్ధి చెందుతున్న దేశాలే కారణమని నిందిస్తోంది. ఒక కోణం నుంచి చూస్తే సరైన నిర్ణయాలు తీసుకుని పరిస్థితిని చక్కదిద్దుకోలేని దుస్థితి, అశక్తతే ఇందులో కనపడుతుంది. ఫెడరల్ ప్రభుత్వ అప్పులను ఎలా తీర్చాలో తెలియదు. ఏటా పెరిగిపోయే వడ్డీలు కట్టే విషయంలో పరిష్కారం కనుక్కోరు. సంపన్నులపై పన్నులు పెంచకుండా తగ్గించుకుని పోవటమే ఇందుకు నిదర్శనం. అప్పులు 37 ట్రిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. ఏటా కట్టే వడ్డీ ట్రిలియన్ డాలర్లు దాటుతోంది. వాణిజ్య మిగులు (147 బిలియన్ డాలర్లు) విషయంలో యూరోపియన్ యూనియన్ (ఈయూ) పరిస్థితి కూడా అమెరికాతో పోల్చితే కొంతలో కొంత మెరుగ్గా ఉంది.


■ రాహుల్ కుమార్

ఇప్పటి అమెరికా పరిస్థితి చూస్తే 1987లో పాల్ కెనడీ తన పుస్తకం 'ద రైజ్ అండ్ ఫాల్ ఆఫ్ ద గ్రేట్ పవర్స్'లో చెప్పిన విషయాలు గుర్తుకు రాకుండా ఉండవు. ఆర్థిక బలం, సైనికశక్తి, ప్రాబల్య విస్తరణ.. ఈ మూడు ఒకదానితో ఒకటి ముడిపడి ఉంటాయనీ.. ఒకనాడు ఆధిపత్యం నెరపి, ఆ తర్వాత దాన్ని కోల్పోయిన రాజ్యాలన్నిటినీ ఈ కోణం నుంచే చూడాలని చెప్పారు. ఆసియా ఖండం నుంచి అమెరికాకు సవాల్ ఎదురుకానుందని కూడా అప్పుడే హెచ్చరించారు. ఆ తర్వాత పరిణామాలన్నీ దాన్ని ధ్రువపరచే విధంగానే

> ఏక దేశ ఆధిపత్యానికి రోజులు చెల్లిపోయాయని అమెరికా గుర్తించాలి. కానీ అలాంటి ఆలోచనలు రాజకీయరంగాన అక్కడ కనపడటం లేదు. అమెరికాకు అదే విషాదం! తగ్గుతున్న ఆర్థిక బలంతో ఇప్పటిదాకా ప్రపంచానికి బోధించిన సిద్ధాంతాలన్నీ అక్కడ బోర్లాపడుతుండటమే నిజం!

ఉన్నాయి. ఆసియాఖండ ఆర్థిక ఆధిపత్యం 2050 నాటికి ఏర్పడే అవకాశం ఉందన్న అంచనాలు ఇప్పటికే చాలా వచ్చాయి. దీన్ని మరో దృష్టి నుంచి చూస్తే 1820 నాటికి ప్రపంచ జీడీపీలో ఆసియా ఖండానికి ఉన్న స్థానం (56శాతం) తిరిగి లభిస్తున్నట్లుగా పరిగణించొచ్చు. అప్పట్లో ఆసియా ఖండానికి ముఖ్యంగా చైనా, భారత్‌లకు ఆర్థిక సంపదలో, వస్తూత్పత్తుల్లో సగభాగం ఉండేది. ఆర్థిక బలం సైనిక శక్తిని, ప్రాబల్య విస్తరణను నిర్ణయించటం నిజమైతే అమెరికా ఆ బలాన్ని కోల్పోయే రీతిలోనే అక్కడి వ్యవహారాలు సాగుతున్నట్లుగా స్పష్టమవుతుంది. ఉన్న ప్రాబల్యాన్ని కాపాడుకోటానికి మోహరించిన సైనికశక్తిని భరించగలిగే స్థాయిలో కూడా అమెరికా ఆర్థికశక్తి పుంజుకోవటం లేదు. 70కి పైగా దేశాల్లో 800 దాకా సైనిక కేంద్రాలను నిర్వహిస్తున్నప్పటికీ వాటిని ఆర్థికంగా భరించలేని స్థాయికి వెళుతోంది. నాటో కూటమికి నిధులను తామే అధికంగా ఎందుకు సమకూర్చాలని ట్రంప్ అప్పుడప్పుడూ చేసే వ్యాఖ్యల వెనుక అంతరార్థం అదే.

సోవియట్ రష్యా కూటమితో అమెరికా 45 ఏళ్లపాటు ప్రచ్ఛన్నయుద్ధం సాగించినా అది సైనిక రంగానికే పరిమితం. ఆర్థికంగా సోవియట్ రష్యా అమెరికాకు ఇచ్చిన పోటీ అప్పుడు చాలా తక్కువ. ఇప్పుడు చైనాతోపాటు యువరక్తంతో ఉరకలేస్తున్న ఆసియా దేశాలు పారిశ్రామిక, శాస్త్ర, సాంకేతిక బలాన్ని అతి వేగంగా సమకూర్చుకుంటూ ఆర్థికంగా విసురుతున్న సవాళ్లు సాధారణమైనవి కావు. వాటిని ఎదుర్కొనే సత్తాని సంతరించుకోటానికి అమెరికా తనది తిరుగులేని అగ్రరాజ్యమన్న భావనను వీడి తగు వ్యూహాలు రూపొందించుకోగలగాలి. ఏక దేశ ఆధిపత్యానికి రోజులు చెల్లిపోయాయని గుర్తించాలి. అలాంటి ఆలోచనలు రాజకీయరంగాన అక్కడ కనపడటం లేదు. అమెరికాకు అదే విషాదం! తగ్గుతున్న ఆర్థిక బలంతో ఇప్పటిదాకా ప్రపంచానికి బోధించిన సిద్ధాంతాలన్నీ అక్కడ బోర్లాపడుతుండటమే నిజం!

(ఆంధ్రజ్యోతి ఎడిటర్)


ఆర్థిక వ్యవస్థ స్థానికీకరణ

నేను నెహ్రూ భారత్ బిడ్డను. ప్రపంచీకరణ పవనాలు ఆగమించక ముందు భారతీయ సమాజం ఆర్థిక, సామాజిక స్వరూప స్వభావాల గురించి నా పుస్తకం 'The Rise of the Neo-Locals : a generational reversal of globalisation'లో విపులంగా జ్ఞాపకం చేసుకున్నాను. నా ఆరు దశాబ్దాలకు పైగా జీవితంలో ప్రపంచ ప్రస్థానం ఎక్కడ ప్రారంభమయిందో అక్కడకే ఎలా తిరిగివచ్చిందో నేను చర్చించాను. నా బాల్యంలో ఆర్థికాభివృద్ధి విషయమై భారతదేశ దార్శనికత స్వావలంబనకు, దేశీయ వస్తూత్పత్తి రంగాలలో పెట్టుబడులకు ప్రాధాన్యమిచ్చేది; నా తొలి యవ్వనంలో దేశ ఆర్థిక రంగంలోకి ప్రపంచ వాణిజ్య సంస్థ, స్వేచ్ఛా వాణిజ్యం ప్రవేశించాయి. తత్ఫలితంగా మన ఆర్థిక వ్యవస్థ ప్రపంచ ఆర్థిక వ్యవస్థతో అనుసంధానమవడం ప్రారంభమయింది; దరిమిలా ఎగుమతుల ఆధారిత ప్రపంచీకరణ అనేది ఆర్థికాభివృద్ధికి బంగారు ప్రమాణంగా పరిణమించింది. వాషింగ్టన్‌లోని శ్వేత సౌధానికి డోనాల్డ్ ట్రంప్ రెండో రాకడతో ఆ అంతర్జాతీయ వాణిజ్య వ్యవస్థలో ఇప్పుడు అసాధారణ మార్పులు సంభవిస్తున్నాయి.


■ సునీతా నారాయణ్

మట్టివాసన

అమెరికా ప్రజల వినియోగం అపారమైనది. ఈ కారణంగానే ట్రంప్ అనేక దేశాలతో (తన షరతుల ప్రకారం)



srini

> స్థానిక వనరుల ఆధారంగా ఎంత అభివృద్ధి సాధిస్తామో వాతావరణ మార్పు వైపరీత్యాలను అంత సమర్థంగా ఎదుర్కోగలుగుతాము. బకాసుర వినియోగ మనస్తత్వాన్ని త్యజించి స్థానిక ఉత్పత్తిని ప్రోత్సహించే జీవనాధారాలను కాపాడే కొత్త హరిత భవిష్యత్తును నిర్మించుకోవాలి.

వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకుంటున్నారు. ప్రపంచ జనాభాలో 4 శాతం మాత్రమే ఉన్న అమెరికా జనాభా ప్రపంచ గృహ సంబంధ సరుకుల వినియోగంలో ఆ దేశం వాటా 30 శాతం మేరకు ఉన్నది! అమెరికాతో పోలిస్తే చైనా వినియోగం తక్కువగా ఉన్నది. ప్రపంచ జనాభాలో చైనా జనాభా 17 శాతం ఉండగా ప్రపంచ వినియోగంలో ఆ దేశం వాటా 12 శాతంగా ఉన్నది. ఈ వినియోగ చిక్కు ప్రశ్నను అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం. ఎందుకంటే అది మన భవిష్యత్తు నిర్ణాయక అంశం. వాస్తవమేమిటంటే అమెరికా తరహా వినియోగం వనరులు పరిమితంగా ఉన్న, కార్బన్ ఉద్గారాలు అత్యధికంగా ఉన్న సమాజాలలో సాధ్యంకాదు. ఈ ధరిత్రిపై ప్రతి ఒక్కరూ అమెరికన్‌లా జీవించాలంటే ప్రపంచానికి మరెన్నో భూగ్రహాలు అవసరమవుతాయని విజ్ఞులు అనే మాట పూర్తి సత్యం. వినియోగ ఆధారిత ఆర్థికాభివృద్ధి నమూనా పర్యవసానాలను ఎదుర్కోకుండా వాతావరణ మార్పు సమస్యను అధిగమించడం గురించి చర్చించలేము. అదే సమయంలో ఆర్థికాభివృద్ధి సాధనకు సరుకుల వినియోగం చాలా ముఖ్యం అనే వాస్తవాన్ని విస్మరించకూడదు.

మరి మన ముందున్న మార్గమేమిటి? వినియోగానికి సంబంధించిన చిక్కు ప్రశ్నలో రెండు అంశాలు ఉన్నాయి. మొదటిది ఒక దేశంలోని సంపద పంపిణీ మరింత పెంచడానికి ప్రాధాన్యమిస్తుంది. తద్వారా వినియోగం అన్నది కొద్ది మంది సంపదకు సంబంధించినది కాకుండా అత్యధిక ప్రజల సంక్షేమ సంబంధితమవుతుంది. 'పేదల చేతుల్లో డబ్బు ఉన్నంతవరకు వారు వివిధ సరుకుల 'వినియోగదారులు' అవుతారు' అన్నది ఎవరూ కొట్టివేయలేని సత్యం. రెండోది ఆర్థిక వ్యవస్థను స్థానికీకరణ చేసుకోవల్సిన ఆవశ్యకత. మరింత స్పష్టంగా చెప్పాలంటే ప్రజల కోసం పెద్ద ఎత్తున వస్తూత్పత్తి చేయడం కాకుండా ప్రజలు తమ అవసరాలను తీర్చుకోవడానికి అవసరమైన వస్తువులు అన్నిటినీ స్థానికంగా తయారు చేసుకోవడం. దిగుమతులపై ఆధారపడడాన్ని తగ్గించుకుని దేశీయ, ప్రపంచ మార్కెట్ల మధ్య ఆరోగ్యకరమైన సమతుల్యతను సాధించుకోవాలి. గాంధీజీ చెప్పింది ఇదే కదూ? ఆధునిక, స్వావలంబన ఆర్థిక వ్యవస్థకు ఇదే పునాది కావాలి. స్థానిక వనరుల ఆధారంగా స్థానికంగా ఎంత అభివృద్ధి సాధిస్తామో వాతావరణ మార్పు వైపరీత్యాలను అంత సమర్థంగా ఎదుర్కోగలుగుతాము. బకాసుర వినియోగ మనస్తత్వాన్ని త్యజించాలి. స్థానిక ఉత్పత్తిని ప్రోత్సహించే జీవనాధారాలను కాపాడే కొత్త హరిత భవిష్యత్తును నిర్మించుకోవాలి. మరి మనం ఇందుకు సుముఖంగా ఉన్నామా?

('సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్' డైరెక్టర్ జనరల్, 'డౌన్ టు ఎర్త్' సంపాదకురాలు)

పొరుగు ప్రళయాల సుడిలో 'విశ్వగురు'


■ రాజ్‌దీప్ సర్దేశాయి

దీపశిఖ

> అభివృద్ధి చెందుతున్న దేశాలకు ప్రభావదాయక నాయకత్వాన్ని అందించి, అంతర్జాతీయ వేదికలపై తన వాణిని మరింత శక్తిమంతంగా విన్పించేందుకు ఆరాటపడుతున్న భారత్‌కు ఇరుగుపొరుగున నిరంతరం సంభవిస్తున్న సంక్షోభాలు ఒక మహా సవాల్‌ను సృష్టిస్తున్నాయి. చైనా నుంచి ఎదురవుతున్న ప్రతికూలతల నేపథ్యంలో భారత్ తక్షణమే దక్షిణాసియా పట్ల తన వైఖరులు, విధానాలను మౌలికంగా మార్చుకోవల్సిన అవసరమున్నది.

నరేంద్ర మోదీ అధికార ప్రస్థానం జాతీయ మలుపు తిరిగిన సందర్భమది. 2014లో ఆయన ప్రధానమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టారు. తన ప్రమాణ స్వీకారోత్సవానికి దక్షిణాసియాలోని అన్ని దేశాల ప్రభుత్వాధినేతలను ఆయన సాదరంగా ఆహ్వానించారు. అద్భుత రాజనీతిజ్ఞత అది, సందేహం లేదు. దక్షిణాసియా ప్రాంతీయ సమైక్యత విషయమై భారత్ ప్రగాఢ ఆరాటాన్ని మోదీ అసాధారణ దౌత్యనీతి ప్రతిబింబించిందని ఆనాడు అందరూ భావించారు. పదకొండు సంవత్సరాలు గడిచిపోయాయి. దక్షిణాసియా ప్రాంతీయ సహకార సంఘం (సార్క్) గుర్తుందా? దాని పునరుద్ధరణ ఆలోచనే ఇప్పుడు ఎవరికీ లేదు. అంతర్గత రాజకీయాలు, జాతీయవాద భావోద్రేకాలు, ఆర్థిక అవస్థలు, పరస్పర విరోధాలు మళ్లీ అనూహ్య రీతుల్లో పెచ్చరిల్లుతున్నాయి. సార్క్ ఎవరికి కావాలి? 'పొరుగుదేశాలకే ప్రథమ ప్రాధాన్యం' అన్న మోదీ ప్రభుత్వ సుభాషితం ఒట్టి మాటగా మిగిలిపోయింది.

నేపాల్‌ను తాజాగా అతలాకుతలం చేస్తున్న హింసాత్మక నిరసనలే అందుకు ఒక నిదర్శనం. ఒక దశాబ్ద కాలంగా నిరంతర అస్థిరతతో కుదేలైపోతున్న దేశమది. 2015లో ఒక కొత్త రాజ్యాంగం అమలులోకి వచ్చిన నాటి నుంచి నేపాల్ తొమ్మిది ప్రభుత్వాలను చూసింది. పదో ప్రభుత్వం అధికారంలోకి రానున్నది. పేదరికం, నిరుద్యోగం అవినీతి మితిమీరిపోయిన కారణంగా ఆ హిమాలయ రాజ్యంలో తిరుగుబాటు సంభవించింది. యువ నేపాలీలే ఆ తిరుగుబాటుకు పురిగొల్పడం, అందులో అత్యధికంగా పాల్గొనడం గమనార్హం. నేపాల్ పరిణామాలను మోదీ ప్రభుత్వం ఏ మాత్రం ఊహించలేకపోయిందన్నది అంగీకరించవలసిన సత్యం.

నేపాల్‌లో జనరేషన్ జెడ్ (1997–2012 సంవత్సరాల మధ్య జన్మించిన యువజనులు. పుట్టినప్పటి నుంచి ఇంటర్నెట్, సోషల్ మీడియా, మొబైల్ టెక్నాలజీతో పెరిగిన మొదటితరంవారు) నిరసనలు గత ఏడాది జూలైలో సంభవించిన పరిణామాలను ప్రతిబింబించాయి. నేపాల్‌లో సామాజిక మాధ్యమాలపై నిషేధం యువజనుల నిరసనలను ప్రజ్వలింపచేస్తే బంగ్లాదేశ్‌లో సివిల్ సర్వీస్‌లలో రిజర్వేషన్ల విధానానికి వ్యతిరేకంగా విద్యార్థులు తిరుగుబాటు చేశారు. అది అంతిమంగా షేక్ హసీనా ప్రభుత్వ పతనానికి, ఆమె భారత్‌లో ఆశ్రయం పొందడానికి దారితీసింది. అటు నేపాల్‌లోను, ఇటు బంగ్లాదేశ్‌లోను ప్రభుత్వాల అవినీతి, ఆశ్రిత పక్షపాతం యువజనుల తిరుగుబాటుకు పురిగొల్పాయి.

బంగ్లాదేశ్‌లో షేక్ హసీనా ప్రభుత్వానికి అన్ని విధాల మద్దతు నిచ్చిన మోదీ ప్రభుత్వం విద్యార్థుల తిరుగుబాటును ముందుగా పసిగట్టలేకపోయింది. ఇస్లామిక్ పార్టీల ప్రాబల్యం పెరిగిపోవడంతో భారత్ వ్యతిరేక, అందునా హిందూ వ్యతిరేక ధోరణులు పెచ్చరిల్లిపోయాయి. స్వదేశంలో హిందూ ఆధిపత్య పాలనను నెలకొల్పడానికి ప్రయత్నిస్తోందన్న విమర్శల నెదుర్కొంటున్న మోదీ సర్కార్ బంగ్లాదేశ్‌లో హిందూ మైనారిటీలను కాపాడేందుకు ప్రభావశీలంగా వ్యవహరించలేకపోతోంది. ప్రజల తిరుగుబాటుతో అధికారాన్ని కోల్పోయిన షేక్ హసీనాకు భారత్ ఆశ్రయమివ్వడాన్ని బంగ్లాదేశ్ పాలకులేకాకుండా ప్రజలు సైతం హర్షించలేకున్నారు. న్యూఢిల్లీ–ఢాకాల మధ్య సుహృద్భావ సంబంధాల పునరుద్ధరణకు ఇది తీవ్ర అవరోధంగా ఉన్నది.




మరో పొరుగుదేశం శ్రీలంక సైతం ఇటీవలి కాలంలో పలు ఉపద్రవాలను చవి చూసింది. భ్రష్ట రాజకీయాలు, అవినీతి పాలన, పెరిగిపోయిన ద్రవ్యోల్బణం, ఇంధనం కొరత మొదలైన సమస్యలతో విసిగిపోయిన ప్రజలు ప్రభుత్వంపై తిరగబడ్డారు. శ్రీలంక పాలనా వ్యవస్థపై పూర్తి ఆధిపత్యాన్ని చెలాయించిన రాజపక్స సోదరులు అధికారచ్యుతులయ్యారు. కొలంబోలో అధ్యక్ష భవనాన్ని ప్రజలు స్వాధీనం చేసుకున్న తీరు చూస్తే ఎంత బలమైన పాలకులైనా ప్రజాందోళనలతో ఎంతగా దుర్బలమవుతారో అర్థమవుతుంది. శ్రీలంక పరిణామాలను తొలుత ఉపేక్షించిన మోదీ ప్రభుత్వం సకాలంలో శ్రీలంకకు తగు ఆర్థిక సహాయమందించడం ద్వారా ఆ దేశంతో భారత్ సంబంధాలు మరింతగా దిగజారిపోకుండా నివారించగలిగింది.

నేపాల్, బంగ్లాదేశ్, శ్రీలంకల్లో నెలకొన్న పరిణామాల విషయంలో భారత్‌కు ప్రత్యక్ష బాధ్యత లేదు. అయితే 2024లో మాల్దీవులతో నెలకొన్న దౌత్య ప్రతిష్టంభన పూర్తిగా నివారింపదగినది. ఆ దేశ అధ్యక్షుడు మొహమ్మద్ ముయిజ్జు భారత్‌ను వ్యతిరేకించడం ప్రాతిపదికపైనే ఎన్నికలలో విజయం సాధించాడు. న్యూఢిల్లీకి వ్యతిరేకంగా ఆయన తీసుకున్న నిర్ణయాల పట్ల సామాజిక మాధ్యమాలలో పాలకపక్ష ప్రేరేపిత విమర్శలు వెల్లువెత్తాయి. విహారయాత్రకు మాల్దీవులకు వెళ్లవద్దని పలువురు సెలెబ్రిటీలు పిలుపునిచ్చారు. సామాజిక మాధ్యమాలను ఉపయోగించుకుని విదేశాంగ విధాన సంబంధిత విషయాలను రాజకీయం చేయడం భారత్‌కు తగని పని అని చెప్పక తప్పదు. ఇటీవల ప్రధాని మోదీ మాల్దీవులలో పర్యటించిన తరువాత ఉభయ దేశాల మధ్య సంబంధాలు పూర్తిగా మెరుగుపడ్డాయి. అయితే చిన్న దేశాల నిర్ణయాలకు అతిగా ప్రతిస్పందించడం శ్రేయస్కరం కాదన్న వాస్తవాన్ని గత ఏడాది మాల్దీవులతో నెలకొన్న దౌత్య ప్రతిష్టంభన స్పష్టం చేసింది.

ఇక మనకు 'నిత్య' శత్రువుగా ఉన్న పాకిస్థాన్ విషయాన్ని చూద్దాం. మన దేశంలో ఉగ్రవాద కార్యకలాపాలకు మద్దతు నివ్వడం పాక్ ప్రభుత్వ విధానంగా ఉందనేది కొట్టివేయలేని వాస్తవం. కనుకనే పహల్గాం ఉగ్రదాడి అనంతరం ఎటువంటి ఉగ్రదాడినైనా 'యుద్ధచర్య'గా పరిగణిస్తామని న్యూఢిల్లీ నిక్కచ్చిగా ప్రకటించవలసి వచ్చింది. పాకిస్థాన్ ఒక విఫల రాజ్యం. సైన్యం–జిహాదీ బంధనాల నుంచి ఎంతకూ బయటపడలేకపోతోంది. ఉమ్మడి ప్రయోజనాలకు ప్రాధాన్యమిస్తూ దక్షిణాసియా వ్యవహారాలపై మరింత ప్రభావాన్ని నెరిపేందుకు దోహదం చేసే ఒక సుసంగత, సమ్మిళిత విధానాన్ని రూపొందించుకోవడంలో న్యూఢిల్లీ విఫలమయింది. చేరువనే ఉన్న సకల దేశాలలో సంభవించే పరిణామాలను నిరంతరం గమనిస్తూ ఆ దేశాలలో తన పలుకుబడిని విస్తరించుకోవాలి. ఇరుగుపొరుగు దేశాలలో ఏ ఒక్కదానినీ ఎట్టి పరిస్థితులలోను నిర్లక్ష్యం చేయకూడదు. ప్రస్తుత అనిశ్చిత ప్రపంచ పరిస్థితులలో అటువంటి వ్యవహారశైలి భారత్ ప్రయోజనాలకు దోహదం చేయదు. ఈ రాజనీతిజ్ఞతను విస్మరించినందువల్లే నేడు నేపాల్‌లో సంభవిస్తున్న పరిణామాలకు తల్లడిల్లుతున్నాం; నిన్న బంగ్లాదేశ్, శ్రీలంకలో చోటుచేసుకున్న ఘటనలకు కలవరపడ్డాం; మరి రేపు ఏ పొరుగు దేశం నుంచి మన ప్రయోజనాలకు విఘాతం వాటిల్లనున్నదో ఎవరికి తెలుసు?

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)



యూరియాపై రచ్చ

సరఫరాలో వైఫల్యాలపై ఆగ్రహం

ఉమ్మడి కృష్ణాజిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం వాడీవేడిగా సాగింది. యూరియా సమస్యపై జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు భగ్గుమన్నారు. సరఫరాలో వైఫల్యాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పోడియం ఎదుట నిలబడి 20 నిమిషాల పాటు ఆందోళనకు దిగారు. రైతులు పడుతున్న ఇబ్బందులను ఏకరువు పెట్టారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇవ్వడంతో శాంతించారు.

పోడియం వద్దకు దూసుకొచ్చిన జెడ్పీటీసీ సభ్యులు ● సుమారు 20 నిమిషాల పాటు ఆందోళన

- కొన్ని పీఏసీఎస్‌లకు ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారని ఆరోపణ
- సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్న అధికారులు
- జెడ్పీటీసీ సభ్యుల గౌరవ వేతనం రూ.74.93 లక్షలు విడుదలకు ఆమోదం
- వాడీవేడిగా ఉమ్మడి కృష్ణాజిల్లా జెడ్పీ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, చిత్రంలో కలెక్టర్ బాలాజీ, ఎన్టీఆర్ జిల్లా జేసీ ఇలక్కియా, నూజివీడు సబ్ కలెక్టర్ వినూత్న, జెడ్పీ సీఈవో కన్నమనాయుడు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం: ఉమ్మడి కృష్ణాజిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక అధ్యక్షతన జెడ్పీ కన్వెన్షన్ హాలులో గురువారం జరిగింది. తొలుత వ్యవసాయశాఖపై సమీక్ష నిర్వహించారు. గూడూరు మండలంలోని తరకటూరు, రాయవరం పీఏసీఎస్‌లకు ఇంతవరకు యూరియా ఇవ్వలేదని గూడూరు జెడ్పీటీసీ సభ్యుడు సురేష్ తెలిపారు. ఇంట్లో మహిళల పుస్తెలను తాకట్టు పెట్టి మరీ రైతులు బయట మార్కెట్‌లో అధిక ధరకు యూరియా కొనుగోలు చేస్తున్నారని గన్నవరం జడ్పీటీసీ సభ్యురాలు ఎలిజబెత్‌రాణి ఆవేదన వ్యక్తం చేశారు. కృత్తివెన్ను మండలానికి 400 టన్నుల యూరియా సరఫరా చేయాల్సి ఉండగా, ఇప్పటి వరకు కేవలం 150 టన్నులను మాత్రమే ఇచ్చారని కృత్తివెన్ను జెడ్పీటీసీ మిగతా 6లో..



పోడియం ఎదుట ఆందోళన చేస్తున్న జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు

యూరియా కొరత లేకుండా చూస్తున్నాం : కలెక్టర్

ఈ సందర్భంగా కలెక్టర్ బాలాజీ మాట్లాడుతూ భారీవర్షాల కారణంగా మొక్కదశలో ఉన్న వరిపైరు నీటమునిగిందని, ఆ పైరును బతికించుకునేందుకు అదనపు కోటాగా రైతులు పలు మండలాల్లో యూరియాను వినియోగించారని తెలిపారు. ఒకరిద్దరు యూరియాను పెద్ద మొత్తంలో తరలించుకుపోయారని, ఈ ఘటనలపైనా విచారణ చేశామన్నారు. ఇన్ని ఇబ్బందుల మధ్య యూరియా కొరత కొంతమేర ఏర్పడిందన్నారు. ఈ విషయాలు ప్రభుత్వానికి నివేదించి అదనంగా యూరియాను జిల్లాకు తీసుకువచ్చేందుకు అనుమతులు తీసుకున్నామని తెలిపారు. ఒకటీ రెండు రోజుల్లో పరిస్థితిని చక్కదిద్దుతామని చెప్పారు. ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియా మాట్లాడుతూ ఎన్టీఆర్ జిల్లాలో రైతులకు అవసరమైన 23 వేల టన్నుల యూరియా సరఫరా చేశామని తెలిపారు. ఇంకా 500 టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రైతులు సాగుచేసిన భూమిని బట్టి యూరియాను సరఫరా చేయాలని అధికారులను కోరారు. యూరియా సరఫరాలో సమస్యలు ఉంటే తనకు ఏ సమయంలోనైనా ఫోన్ చేసి చెప్పాలని కలెక్టర్ బాలాజీ భరోసా ఇచ్చారు.

పాఠశాల భవనాలను పూర్తి చేయాలి

విద్యాశాఖపై సమీక్షలో పాఠశాల భవనాల నిర్మాణం తుదిదశలో ఉండగా పనులను నిలిపివేశారని జి.కొండూరు, కృత్తివెన్ను, పెదపారుపూడి, తోట్లవల్లూరు జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. కొద్ది మొత్తం నగదు విడుదల చేస్తే భవనాలు అందుబాటులోకి వస్తాయని, కొన్ని పాఠశాల భవనాలకు అనుమతులు ఇచ్చినా పనులు చేయడం లేదని వివరించారు. ఏ.కొండూరు మండలం కుంటముక్కల గురుకుల బాలికల పాఠశాల చుట్టూ ఉన్న ప్రహరీ వరదల కారణంగా కూలిపోయి ఏడాది అయ్యిందని, నేటివరకు నిర్మాణం చేయలేదని సమావేశం దృష్టికి తెచ్చారు. తల్లికి వందనం నగదు కొందరికి జమకాలేదని, నగదు జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

డయేరియా డర్!

పెరుగుతున్న బాధితులు



ఫుడ్‌సేఫ్టీ ఆన్ వీల్స్ వాహనంలో నీటి పరీక్షలు చేస్తున్న సిబ్బంది

కొత్త ప్రభుత్వాస్పత్రిలో 40 మంది..

- పాత ప్రభుత్వాస్పత్రిలో ఏడుగురు చేరిక
- ప్రమాదం లేదంటున్న వైద్యులు
- న్యూరాజరాజేశ్వరీపేటలో అధికారుల పర్యటన
- తాగునీటి సరఫరా బంద్
- ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా



కేర్ అండ్ షేర్ పాఠశాలలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరం వద్ద బాధితురాలు

(ఆంధ్రజ్యోతి - విజయవాడ): నగర వాసులను డయేరియా భయం వెంటాడుతోంది. రోజురోజుకు బాధితుల సంఖ్య పెరుగుతోంది. న్యూరాజరాజేశ్వరిపేటలో ఒక ఇంట్లో నలుగురు ఉంటే ఒకరికి మాత్రమే నీళ్ల విరేచనాలు అవుతున్నాయి. పిల్లలు, తల్లి కలిసి నిద్రపోయినా తల్లి మాత్రమే విరేచనాల బారిన పడింది. కొన్ని చోట్ల పిల్లలపై కూడా దీని ప్రభావం ఉంటుంది. దీనికి కారణం ఏమిటన్నది తెలియడం లేదు. రెండు, మూడు రోజులుగా ఇలా నీళ్ల విరేచనాలు అవుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. దీన్ని డయేరియా అని వ్యవహరిస్తున్నప్పటికీ వైద్యులు మాత్రం జీఈ (గ్యాస్ట్రో ఎంట్రైటీస్) అని పేర్కొంటున్నారు. మూడుకు మించి విరేచనాలు అయితే దాన్ని జీఈగా పరిగణించాలని స్పష్టం చేస్తున్నారు. ఈ సమస్య ఉన్న బాధితుల సంఖ్య గురువారం పెరిగింది. మొత్తం 47 మంది బాధితులు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స మిగతా 6లో..

నగరంలో 122 డయేరియా కేసులు

నగరంలో మొత్తం 122 డయేరియా కేసులు నమోదయ్యాయి. ప్రస్తుతం 61 మంది ప్రభుత్వాస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. మరో 61 మంది ఆస్పత్రుల్లో చికిత్స పొంది డిశ్చార్జయ్యారు.

దసరా డబుల్ డ్యూటీ!

ఒక ఉద్యోగికి ఒకే రోజు ఒకే షిఫ్ట్‌లో రెండు ప్రాంతాల్లో విధులు

వార్డు సచివాలయంలో వెల్ఫేర్ సెక్రటరీగా పని చేస్తున్న జస్వంత్‌కు పున్నమి ఘాట్ వద్ద దసరా డ్యూటీ వేశారు. ప్రతి రోజూ రాత్రి 10 నుంచి మరుసటి రోజు ఉదయం 6 గంటల వరకు అక్కడే విధులు నిర్వర్తించాలని వీఎంసీ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. అదే ఉత్తర్వుల్లో అదే జస్వంత్‌కు అదే సమయంలో(రాత్రి 10 నుంచి మరుసటి రోజు ఉదయం 6 గంటల వరకు) నాలుగు పిల్లర్ల సెంటర్‌లో విధులు నిర్వర్తించాలని ఆదేశాలిచ్చారు.

మరో సచివాలయంలో పని చేసే వెల్ఫేర్ సెక్రటరీ సాయికిషోర్‌కు రాత్రి 10 నుంచి మరుసటి రోజు ఉదయం 6 గంటల వరకు మోడల్ గెస్ట్ హౌస్ వద్ద డ్యూటీ వేశారు. అదే సమయంలో పున్నమి ఘాట్ వద్ద డ్యూటీ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఇలా ఒకే ఉద్యోగికి ఒకే రోజు ఒకే షిఫ్ట్‌లో రెండు ప్రాంతాల్లో డ్యూటీలు వేశారు. ఇలా మొత్తంగా 207 మంది ఉద్యోగులకు డబుల్ డ్యూటీలు వేశారు. సచివాలయ ఉద్యోగులకు విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్(వీఎంసీ) అధికారులు కేటాయించిన దసరా ఉత్సవాల విధుల తీరు తీవ్ర విమర్శలకు తావిస్తోంది.

- మొత్తం 207 మంది ఉద్యోగులకు ఇదే విధంగా విధుల కేటాయింపు
- ఉత్తర్వులు చూసి నివ్వెరపోతున్న వెల్ఫేర్ సెక్రటరీ, మహిళా పోలీసులు
- వీఎంసీ అధికారుల పనితీరుపై వెల్లువెత్తుతున్న విమర్శలు
- 50 ఏళ్ల వయసు పైబడిన దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు రాత్రి విధులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న వార్డు సచివాలయాల ఉద్యోగులు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ సిటీ): ఇంద్రకీలాద్రిపై ఈ నెల 22వ తేదీ నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు 11 రోజుల పాటు దసరా ఉత్సవాలు ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. లక్షల సంఖ్యలో తరలివచ్చే భక్తులకు అవసరమైన వసతులను కల్పించేందుకు అన్నిశాఖల అధికారులకు ప్రభుత్వం విధులు కేటాయిస్తోంది. తాగునీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణ, వాహనాల పార్కింగ్, వీఐపీ ప్రోటోకాల్, కంట్రోల్ రూం నిర్వహణ తదితర పనులు చేసేందుకు వార్డు వెల్ఫేర్ సెక్రటరీ, మహిళా పోలీసులకు వీఎంసీ అధికారులు కేటాయించిన విధుల తీరుపై విమర్శలు వెల్లువెత్తున్నాయి. అక్టోబర్ ఒకటో తేదీన సామాజిక పింఛన్లను వెల్ఫేర్ సెక్రటరీలు పంపిణీ చేయాల్సి ఉందనే విషయాన్ని వీఎంసీ అధికారులు మర్చిపోయి దసరా విధులు కేటాయించడాన్ని ఉద్యోగ మిగతా 6లో..

బాలిక మృతదేహం కోసం గాలింపు!

రెండు చోట్ల పడేసినట్టు చెబుతున్న తండ్రి

- ఎ.కొండూరు అటవీ ప్రాంతం, మధిర చెరువు వద్ద డ్రోన్లతో జల్లెడ
- వరదల్లో కొట్టుకుపోయినట్టు భావిస్తున్న పోలీసులు
- హత్యలో మొదటి భార్య సహకారం!



మైలవరంలో బాలిక హత్య జరిగిన ఇల్లు, పోలీసులు స్వాధీనం చేసుకున్న ఆటో



(ఆంధ్రజ్యోతి - విజయవాడ): కుమార్తె మృతదేహాన్ని గంజాయి వ్యాపారి ఎలా మాయం చేశాడు? నిజంగా అటవీ ప్రాంతంలో పడేశాడా? లేక ఏదైనా పారే నదిలో వేశాడా? మైలవరంలో మిస్టరీగా మారిన బాలిక హత్య కేసులో ఉదయిస్తున్న ప్రశ్నలు ఇవి. మైలవరం సిద్ధిపేటకు చెందిన గంజాయి వ్యాపారి రెండో భార్య కుమార్తెను హత్య చేసినట్టు పోలీసులు నిర్ధారణకు వచ్చిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఆమె మృతదేహం కనిపించకపోవడంతో పోలీసులు తలలు పట్టు కుంటున్నారు. బాలిక తండ్రిని విచారిస్తున్న పోలీసులకు అతడు గంటకో సమాధానం చెబుతున్నట్టు తెలిసింది. పోలీసులు విచారిస్తున్నప్పుడు కొద్దిసేపు ఎ.కొండూరు అటవీ ప్రాంతంలో పడేశానని చెబుతున్నాడు. తర్వాత కాసేపటికి ఖమ్మం జిల్లాలోని మధిరలో ఉన్న చెరువులో పడేసినట్టు చెబుతున్నాడు. ఇలా వేర్వేరు సమాధానాలు చెప్పి పోలీసులకు స్పష్టత ఇవ్వడం లేదు. గడిచిన నెలలో కురిసిన వర్షాలకు ఈ చెరువు నిండి వాగుల ద్వారా నీరు కృష్ణా నదిలోకి ప్రవహించింది. ఈ నీటి ప్రవాహంలో బాలిక మృతదేహం కొట్టుకుని వెళ్లిపోయినట్టు పోలీసులు భావిస్తున్నారు. కుమార్తెను చంపినప్పుడు అతడు పూర్తిగా మద్యం మత్తులో ఉన్నాడు. ఆ మైకంలో మిగతా 6లో..

రొయ్య రైతుకెంత కష్టం!
● అమెరికా సుంకాల ప్రభావంతో తగ్గిన ధరలు 8లో

చెక్ పవర్ గేమ్! 6లో



దసరా ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ, మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర, ఏడీసీపీ రామకృష్ణ, ఈవో శీనానాయక్

శరన్నవరాత్రులకు ఏర్పాట్లు

» పనులు పరిశీలించిన కలెక్టర్ లక్ష్మీశ, అధికారులు

ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవరాత్రి మహోత్సవాలకు సంబంధించి జరుగుతున్న పనులను కలెక్టర్ జి.లక్ష్మీశ, వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర, అడిషనల్ ఎస్పీ రామకృష్ణ, ఏసీపీ దుర్గారావు తదితరులు దుర్గగుడి ఈవో వి.కె.శీనానాయక్‌తో కలిసి గురువారం పరిశీలించారు. క్యూలలో అత్యవసర ద్వారాల ఏర్పాటు, హోల్డింగ్ ఏరియాలను, భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని విశ్రాంతి తీసుకోవడానికి, క్యూలలోకి క్రమంగా ప్రవేశించడానికి కొత్త హోల్డింగ్ పాయింట్లు నిర్ణయించారు. వినాయకుడి గుడి, ఆర్‌ఈ ఛైనావాల్, టోల్‌గేట్, ఘాట్ రోడ్డు మీదుగా అమ్మవారి ఆలయం వరకు విస్తరిస్తారు. ట్రాఫిక్ నియంత్రణ, భక్తుల పార్కింగ్ కోసం ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నారు. పార్కింగ్ స్థలాల గుర్తింపు, ట్రాఫిక్ మళ్లింపు మార్గాలపై పోలీసు అధికారులు సమీక్షించారు. భక్తులకు మంచినీరు, పాలు, అన్నప్రసాదం ఏర్పాట్లు చేయనున్నారు. మరుగుదొడ్లు, వైద్య సహాయ కేంద్రాలు, సమాచార కేంద్రాలు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. గతేడాది అనుభవాల ఆధారంగా భద్రతా చర్యలను మరింత బలోపేతం చేస్తున్నారు. ఆలయ పరిసరాలు, క్యూలలో, ఘాట్‌లలో సీసీ టీవీ కెమెరాల నిఘా పెంచనున్నారు.ఆన్‌లైన్‌లో స్వచ్ఛంద సేవకులకు నమోదు చేసుకునే అవకాశాన్ని కల్పించనున్నారు. పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, భక్తులకు ప్రసాదాలు, అన్నప్రసాదం నాణ్యతలో రాజీ పడకూడదని సూచించారు. ఈ ఏడాది దసరా ఉత్సవాలను విజయవంతం చేయడానికి, భక్తులకు మెరుగైన దర్శనం, సౌకర్యాలు కల్పించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు పేర్కొన్నారు.



ఎంపీ కేశినేని శివనాథ్‌కు ఆహ్వానపత్రికను అందజేస్తున్న ఈవో

దసరా మహోత్సవాలకు ఎంపీకి ఆహ్వానం

ఇంద్రకీలాద్రి : దుర్గామల్లేశ్వరస్వామి సన్నిధిలో ఈనెల 22 నుంచి అక్టోబరు 2వరకు జరగబోయే దసరా శరన్నవరాత్రి మహోత్సవాలకు విచ్చేయాలని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)ని ఆలయ ఈవో శీనానాయక్ ఆహ్వానించారు. గురువారం ఎన్టీఆర్ భవన్‌లో ఎంపీ శివనాథ్‌కు ఈవో, ప్రధాన అర్చకుడు ఎల్.దుర్గాప్రసాద్, వేద పండితులు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఇంద్రకీలాద్రిపై దసరా ఏర్పాట్లు గురించి ఎంపీ అడిగి తెలుసుకున్నారు.



చౌటపల్లి వద్ద చప్టాపై ప్రవహిస్తున్న వెదుళ్లవాగు

ఉధృతంగా వెదుళ్లవాగు.. రాకపోకలు బంద్

చౌటపల్లి(తిరువూరు) : మండలంలోని చౌటపల్లివద్ద వెదుళ్ల వాగు చప్టాపై (లోలెవల్‌బ్రిడ్జి)నుంచి ప్రవహిస్తుండటంతో గురువారం ఉదయం జి.కొత్తూరు, చిక్కుళ్లగూడెం, పల్లెర్లమూడి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. బుధవారం డివిజన్ పరిధిలోని గంపలగూడెంలో 109.4 మిల్లీమీటర్లు, విస్సన్నపేటలో 91.2 మిల్లీమీటర్లు, తిరువూరులో 78.6 మిల్లీమీటర్లు, రెడ్డిగూడెం మండలంలో 22.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు ప్రకటించారు. భారీవర్షంతో పలుగ్రామాల్లో లోతట్టు ప్రాంతాల్లో వరదనీరు నిలిచింది. అక్కపాలెం పడమటి వాగు చప్టాపై నుంచి నీరు ప్రవహిస్తుండంతో, రాజుపేటకు చెందిన పలువురు రైతులు ఎగువప్రాంతంలో ఉన్న సాగుభూములకు వెళ్లేందుకు ఇబ్బంది పడ్డారు. మధ్యాహ్నం నుంచి వరద తగ్గడంతో రాకపోకలు యాధవిధిగా కొనసాగాయి.

పండుగకు ప్రత్యేక రైళ్లు, కొన్ని పొడిగింపు

రైల్వేస్టేషన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : లోకమాన్య తిలక్ టెర్మినల్ (ఎల్‌టిటి) ముంబయి-కరీంనగర్ మధ్య పండుగ సీజన్‌ను పురస్కరించుకుని ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్టు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఎ.శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్యేక రైళ్లను కొద్ది రోజులపాటు పొడిగిస్తున్నట్టు పేర్కొన్నారు. 01067, 01068 ఎల్‌టిటి ముంబయి-కరీంనగర్ అప్ అండ్ డౌన్ రైళ్లలో ఈనెల 23న ఎల్‌టిటి ముంబయి స్టేషన్ నుంచి బయలుదేరే రైలు అక్టోబరు 7 వరకు మూడు సర్వీసులు నడుస్తుంది. కరీంనగర్ నుంచి ఈనెల 24న బయలుదేరే రైలు అక్టోబరు 8 వరకు మూడు సర్వీసులు నడుస్తుంది. ఈ రైళ్లు థానే, కళ్యాణ్, ఇగత్‌పురి, నాసిక్ రోడ్డు, మన్మాడ్, నాగర్‌సోల్, ఔరంగాబాద్, జల్నా, పర్టూర్, సెలు, పర్భనీ, పూర్ణ, నాందేడ్, ముద్ఖేడ్, ధర్మాబాద్, బాసర, నిజామాబాద్, ఆర్మూర్, మెట్‌పల్లి, కోరట్ల స్టేషన్లలో ఆగుతాయి. ఈ రైళ్లలో ఫస్ట్ ఏసీ, సెకండ్ ఏసీ, త్రీ ఏసీ, స్లీపర్, జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌లు ఉంటాయి.

పత్యేక రైళ్ల పొడిగింపు..

03247 ధానాపూర్-ఎస్ఎంవిటి బెంగళూరు గురువారాల్లో బయలుదేరుతుంది. ఈనెల 18 నుంచి డిసెంబరు 25వ తేదీ వరకు 15 సర్వీసులు నడుస్తుంది. 03248 ఎస్ఎంవిటి బెంగళూరు-ధానాపూర్ శనివారాల్లో నడుస్తుంది. ఈనెల 20 నుంచి డిసెంబరు 27వ తేదీ వరకు 15 సర్వీసులు నడుస్తుంది. 03241 ధానాపూర్ - ఎస్ఎంవిటి బెంగళూరు శుక్ర, శనివారాల్లో నడుస్తుంది. ఈనెల 19 నుంచి డిసెంబరు 27 వరకు 30 సర్వీసులు నడుస్తుంది. 03242 ఎస్ఎంవిటి బెంగళూరు - ధానాపూర్ ఆది, సోమవారాల్లో నడుస్తుంది. ఈనెల 21 నుంచి డిసెంబరు 29వ తేదీ వరకు 30 సర్వీసులు నడుస్తుంది.

పోలీసుల కోసం హెల్త్ ఫస్ట్ 1991 యాప్

విజయవాడ సిటీ, సెప్టెంబర్ 11(ఆంధ్రజ్యోతి): పోలీసులు, వారి కుటుంబసభ్యుల ఆరోగ్యం కోసం హెల్త్ ఫస్ట్ 1991 యాప్‌ను రూపొందించినట్లు జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు వెల్లడించారు. 1991 ఎస్‌ఐ(ప్రస్తుతం డీఎస్పీలు) బ్యాచ్ ఆధ్వర్యంలో ఏలూరు సీఆర్ రెడ్డి కాలేజీ బి.టెక్ మూడో సంవత్సరం విద్యార్థులు దినేష్‌కుమార్, జస్వంత్, మిథున్‌చందు, భార్గవకృష్ణ, ధనుష్ రూపొందించిన ఈ యాప్‌ను విజయవాడలోని పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సీపీ గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాప్‌లో 14 వేల మంది పోలీసులు, వారి కుటుంబ సభ్యులు రిజిష్టర్ అయ్యారని, మిగిలిన వారు వీలైనంత త్వరగా రిజిష్టర్ కావాలని సూచించారు. యాప్‌లో రిజిష్టర్ అయిన వారికి వైద్య ఖర్చుల్లో 20 నుంచి 30 శాతం రాయితీని ఇచ్చేందుకు కొన్ని ఆసుపత్రులు ముందుకు వచ్చినట్లు వివరించారు. ఈ అవకాశాన్ని పోలీసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీసీపీ కె.జి.వి.సరిత, 1991 బ్యాచ్ పోలీసులు పాల్గొన్నారు.



చెక్ పవర్ గేమ్!

అక్రమాలు చేశారని అధికారులే నిర్ధారించారు.. సర్పంచ్ చెక్ పవర్ రద్దు చేశారు.. చెక్ పవర్‌ను తిరిగి పొందటం కోసం పాలకవర్గం ర్యాటిఫికేషన్ ఎత్తుగడ వేసింది.. ర్యాటిఫికేషన్ పేరుతో అక్రమాలన్నీ సక్రమం చేశారు.. రద్దు చేసిన చెక్ పవర్‌ను తిరిగి పొందేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు.. జిల్లా పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యం కారణంగా మేజర్ గ్రామ పంచాయతీలో మూడేళ్లుగా సాగుతున్న అవినీతి బాగోతాలకు ముగింపు పడటం లేదు.

» మైలవరం పంచాయతీలో భారీగా నిధుల దుర్వినియోగం

» అవకతవకలపై కోర్టుకెళ్లిన వార్డు సభ్యుడు

» చెక్ పవర్ తీయకపోయినా.. తీశామంటూ కోర్టుకు డీపీవో నివేదిక

» అక్రమాలు చేసిన వారిని రక్షించేలా .. డీపీఓ కార్యాలయం తీరు?



(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

మైలవరం గ్రామ పంచాయతీ పరిధిలో సాధారణ నిధులు, 15 ఫైనాన్స్ నిధులతో నామినల్ మస్టర్ రోల్ (ఎన్ఎంఆర్) పద్ధతిన పారిశుధ్యపనులకు గత వైసీపీ ప్రభుత్వ హయాంలో శ్రీకారం చుట్టారు. అయితే ఈ పనుల్లో అంతులేని అవినీతి చోటు చేసుకుందని గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యుడు ఒకరు జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ)కు ఫిర్యాదు చేశారు. రూ. 40 లక్షల మేర అవకతవకలు జరిగాయని ఆరోపించారు. తర్వాత కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేయటం జరిగింది. పారిశుధ్య కార్మికులకు ఇవ్వాల్సిన నిధులను దారి మళ్లించి సొంత ఖాతాలకు బదిలీ చేసుకున్నారని ఆరోపించారు. దీనిపై కలెక్టర్ విచారణకు ఆదేశించారు. అప్పటి డీపీవో ఆదేశాల మేరకు మైలవరం విస్తరణ అధికారి (ఈఓపీఆర్‌డీ) విచారణ జరిపి డీపీఓకు నివేదికను ఇచ్చారు.

● నివేదిక ప్రకారం 2021-22, 2022-23, 2023-24 సంవత్సరాలలో జనరల్ ఫండ్స్ రూ. 25.15 లక్షలు, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.3,50,800 లు కలిపి రూ. 28,65,800లు ఖర్చు చేయటం జరిగిందని నిర్ధారించారు. ఈ ఖర్చులకు సంబంధించిన సీఎఫ్ఎంఎస్ ఐడీలను పరిశీలించగా.. మైలవరం గ్రామ ఉపసర్పంచ్ చామల సీతారామిరెడ్డి ఖాతాలో రూ.12,91,100, సర్పంచ్ మంజుభార్గవి ఖాతాలో రూ.1,50,000, సర్పంచ్ భర్త డానియేల్ వ్యక్తిగత సేవింగ్ ఖాతాలో రూ.2,00,900లు జమ చేసినట్టుగా ధృవీకరించటం జరిగింది. పంచాయతీ వర్కర్ జి.చంద్రరావు ఖాతాలో రూ.3,84,000లు జమ చేసినట్టుగా ధృవీకరించారు. దీనిపై జిల్లా పంచాయతీ అధికారి నుంచి అప్పటి కలెక్టర్‌కు నివేదిక వెళ్లిందో లేదో కానీ ఆ తర్వాత విచారణ ముందుకు కదల్లేదు. దీంతో వార్డు సభ్యుడు చిట్టిబాబు ఈ వ్యవహారంపై కోర్టును ఆశ్రయించారు. దీనిపై న్యాయస్థానం డీపీవోను వివరణ కోరగా.. సర్పంచ్ చెక్ పవర్‌ను రద్దు చేసినట్టు కోర్టుకు నివేదించడంతో కేసును కొట్టివేశారు.

● సర్పంచ్ చెక్ పవర్ రద్దు చేశామని కోర్టుకు చెప్పినా.. తర్వాత రద్దు చేయలేదని వార్డు సభ్యుడు కోర్టుకు వెళ్లారు. ఈ క్రమంలో గ్రామ పంచాయతీలో పారిశుధ్య పనులకు మరో రూ.11.20 లక్షలను దుర్వినియోగం చేశారన్న అభియోగంపై సర్పంచ్ చెక్ పవర్‌ను రద్దు చేశారు. ఈ పనులు 2021, 2022, 2023లలో పారిశుధ్య పనులు చేసినట్టుగా బిల్లులు చేసుకున్నారని, కార్మికులు జీతాలు తీసుకున్నట్టుగా ఆఫీసు సిబ్బందే వేలిముద్రలు వేశారన్న ఆరోపణలు వచ్చాయి. ఈ నిధులు కూడా సర్పంచ్, సర్పంచ్ భర్త, ఉప సర్పంచ్ ఖాతాల్లోకి వెళ్లాయన్న ఆరోపణలు వచ్చాయి. అన్నింటినీ పరిశీలించిన మీదట అక్రమాలు జరిగాయని నిర్ధారించిన డీపీవో సర్పంచ్ మంజుభార్గవికి నోటీసు ఇచ్చి.. ఆ తర్వాత ఆమె చెక్ పవర్‌ను రద్దు చేయటం జరిగింది.

● సర్పంచ్ చెక్ పవర్ రద్దు చేయటంతో.. పాలకవర్గం దీనినుంచి బయట పడేందుకు కొత్త ఎత్తుగడ వేసింది. పనులను ర్యాటిఫికేషన్ చేయాలని నిర్ణయించారు. ఇటీవల సమావేశాన్ని ఏర్పాటుచేసి మెజారిటీ సభ్యులు తమ వెంట ఉండటంతో అన్నింటినీ ర్యాటిఫికేషన్ చేయించుకున్నారు. ర్యాటిఫికేషన్ ద్వారా డీపీవోకు రిపోర్టు పంపి చెక్ పవర్‌ను తిరిగి పొందే ప్రయత్నం చేశారు. దీనిపై మరల వార్డు సభ్యుడు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. మూడేళ్ల క్రితం చేసిన అవినీతి పనులకు ఇప్పుడు ర్యాటిఫికేషన్ చేయడమేమిటని, ఇది చెల్లదని తీర్మానాన్ని రద్దు చేయాల్సిందిగా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. దీనిపై కలెక్టర్ లక్ష్మీశ నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

డీపీవో తీరుతో సాగదీత..

మైలవరం గ్రామ పంచాయతీ నిధుల దుర్వినియోగం వ్యవహారంలో జిల్లా పంచాయతీ అధికారుల పాత్ర వివాదాస్పదమైంది. మైలవరం విస్తరణ అధికారి తొలిదశలో చోటు చేసుకున్న నిధుల దుర్వినియోగానికి సంబంధించి నిర్ధారించి నివేదిక ఇచ్చిన అంశాలపై ఇప్పటి వరకు డీపీవో ఎలాంటి చర్యలు తీసుకోలేదు. చెక్ పవర్ రద్దు చేయకుండా చేశామని కోర్టుకు చెప్పారు. కోర్టు ధిక్కరణకు వెళ్లే క్రమంలో.. మరో కేసును పట్టుకుని అందులో అక్రమాలు జరిగాయని చెక్ పవర్ రద్దు చేశారు. పనులు సవ్యంగానే చేశామని పాలకవర్గం ర్యాటిఫికేషన్ చేసే వరకు వెళ్లింది. పంచాయతీ పాలకవర్గానికి అంటకాగుతూ.. కోర్టు ధిక్కరణ నుంచి తప్పించుకునేందుకు వేసిన ఎత్తుగడ అన్న విమర్శలు వస్తున్నాయి.

కాంట్రాక్టు వైద్యులకు అప్పనంగా జీతాలు!

» సిద్ధార్థ మెడికల్ కళాశాలలో నిర్వాకం

» విధులు మానేసిన ముగ్గురు కాంట్రాక్టు వైద్యులకు జీతాలు

» 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. అంగీకరించిన అధికారులు.. చర్యలు తీసుకుంటామని వెల్లడి

» అధికారుల ఫోన్లు ఎత్తని కాంట్రాక్టు వైద్యులు.. చివరకి ఒక డాక్టర్ అందుబాటులోకి

» మీరు జీతాలు వేసి తప్పు చేశారు.. మేమేమైనా వేయమన్నామా అంటూ బుకాయింపు

» తలలు పట్టుకుంటున్న సిద్ధార్థ మెడికల్ కళాశాల అధికారులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): సిద్ధార్థ మెడికల్ కళాశాలలో పనిచేయకుండా కాంట్రాక్టు వైద్యులు కొందరు జీతాలు తీసుకోవటం సంచలనం సృష్టిస్తోంది. పనిచేయని కాంట్రాక్టు వైద్యులకు సిద్ధార్థ మెడికల్ కళాశాల యాజమాన్యం జీతాలు ఇవ్వడం అర్థం కాని విషయం. మొత్తం ముగ్గురు కాంట్రాక్టు వైద్యులు చాలాకాలంగా పని చేయకుండానే జీతాలు తీసుకున్నట్టు వెలుగు చూసింది. ముగ్గురు కాంట్రాక్టు వైద్యుల విధులకు రాని రోజుల్లో కూడా జీతాలు చెల్లించిన విషయాన్ని అధికారుల దగ్గర 'ఆంధ్రజ్యోతి' ప్రస్తావించగా.. సిద్ధార్థ మెడికల్ కళాశాల అధికారులు కూడా ఈ విషయాన్ని అంగీకరించారు. తక్షణ చర్యలు చేపడుతున్నట్టు చెప్పారు.

ఈ ముగ్గురు కాంట్రాక్టు ఉద్యోగులు కూడా ప్రస్తుతం సిద్ధార్థ మెడికల్ కళాశాల యాజమాన్యానికి చెప్పాపెట్టకుండా వెళ్లిపోయారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో వారికి మంచి ఆఫర్స్ రావటంతో వెళ్లిపోయినట్టు తెలిసింది. బయటకు వెళ్లిపోయిన ముగ్గురిలో ఒక కాంట్రాక్టు వైద్యుడు కొన్ని నెలలుగా విధులకు హాజరు కావటం లేదని తెలుస్తోంది. కాంట్రాక్టు వైద్యులు పనిచేస్తున్నారో లేదో కూడా తెలుసుకోకుండా కళాశాల యాజమాన్యం జీతాలు ఇవ్వటం మరింత విమర్శలకు దారి తీస్తోంది. ఒక్కో డాక్టర్‌కు రూ. 92 వేల మేర సిద్ధార్థ మెడికల్ కళాశాల యాజమాన్యం జీతాలిచ్చేసినట్టు వెలుగులోకి వచ్చింది. ఈ విషయాన్ని ఆలస్యంగా తెలుసుకున్న మెడికల్ కళాశాల యాజమాన్యం దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించింది. ఎవరైతే కాంట్రాక్టు డాక్టర్లు ఉన్నారో వారికి తమ సిబ్బంది ద్వారా ఫోన్లు చేయించగా ముగ్గురు కాంట్రాక్టు వైద్యులు ఫోన్లకు దొరకలేదు. ఉన్నతాధికారుల ఆదేశాలతో సిబ్బంది నిరంతరాయంగా కొద్ది రోజులుగా వారికి ఫోన్లు చేస్తూనే ఉన్నారు. వీరిలో ఒక కాంట్రాక్టు వైద్యుడు ఇటీవల ఫోన్ ఎత్తడంతో మీరు పనిచేయని కాలంలో వేసిన జీతాన్ని వెంటనే తిరిగి చెల్లించండి అంటూ సిబ్బంది ఆదేశించగా తాను ఉద్యోగం మానేశానని, జీతం వేయటం మీ తప్పు అంటూ ఫోన్ పెట్టేయడం గమనార్హం. దీంతో సిద్ధార్థ మెడికల్ కళాశాల అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

ఎలా జరిగింది?

ప్రతి నెలా కూడా ఆయా డిపార్ట్‌మెంట్ హెడ్స్ నుంచి ప్రిన్సిపల్‌కు అటెండెన్స్ వివరాలు పంపుతారు. అటెండెన్స్ ప్రాతిపదికన జీతాలు రాస్తుంటారు. ముగ్గురు కాంట్రాక్టు వైద్యులు చాలా కాలంగా విధులకు రాకపోయినా.. జీతాలు ఇచ్చారు. దీనిని బట్టి చూస్తే అటెండెన్స్ ప్రాతిపదికన జీతాలు ఇవ్వలేదని తెలుస్తోంది. అటెండెన్స్ చూడకుండా జీతాలు ఇవ్వటం వెనుక ఎవరి బాధ్యతారాహిత్యం ఉందన్నది తేలాల్సి ఉంది.

కృష్ణా మిల్క్ ఛైర్మన్‌కు సత్కారం

» చలసానికి మెమోంటో అందజేసిన ఎన్‌డీడీబీ

చిట్టినగర్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : జాతీయ పాడిపరిశ్రమ అభివృద్ధి బోర్డు (ఎన్‌డీడీబీ) ఆరు దశాబ్దాలు పూర్తిచేసుకున్న సందర్భంగా గురువారం పుదుచ్చేరి హోటల్ సన్‌వీమేనర్‌లో వజ్రోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా సహకార సమితిని సమర్థవంతంగా నడిపిస్తూ, పాడిరైతుల ఆర్థిక అభివృద్ధికి విశేష కృషి చేస్తున్న కృష్ణామిల్క్ యూనియన్‌ను గుర్తించి, ఛైర్మన్ చలసాని ఆంజనేయులును సత్కరించి, మెమోంటోను పుదుచ్చేరి ముఖ్యమంత్రి ఎన్.రంగస్వామి, పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ కె.కైలాశ్ నాథన్, జాతీయ డెయిరీ అభివృద్ధి బోర్డు (ఎన్‌డీడీబీ) ప్రస్తుత ఛైర్మన్ మీనేష్ షా, పుదుచ్చేరి వ్యవసాయ మంత్రి సి.డిజె. కౌమర్ నుంచి అందుకున్నారు. కృష్ణా మిల్క్ యూనియన్ ఎండీ కొల్లి ఈశ్వరబాబు తదితరులు పాల్గొన్నారు.



పుదుచ్చేరి ముఖ్యమంత్రి ఎన్.రంగస్వామి నుంచి మెమోంటోను అందుకుంటున్న చలసాని ఆంజనేయులు

యూరియాపై రచ్చ!

(5వ పేజీ తరువాయి)

సభ్యురాలు రత్నకుమారి ఆరోపించారు. పెదపారుపూడి, నందిగామ మండలాల్లో అరకొరగానే యూరియాను ఇచ్చారని, కొత్తగా ఎంపికైన పీఏసీఎస్‌ల అధ్యక్షులు తమకు అనుకూలమయిన రైతులకు యూరియా ఇచ్చి, మిగిలిన రైతులకు ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాపులపాడు మండలం రేమల్లె, గన్నవరం పీఏసీఎస్‌లకు సక్రమంగా యూరియా పంపలేదని జెడ్పీటీసీ సభ్యులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. బంటుమిల్లి మండలంలో బల్లిపర్రు, కంచడం, బంటుమిల్లి పీఏసీఎస్‌ల పరిధిలో 18 గ్రామపంచాయతీలు ఉన్నాయని, యూరియా సక్రమంగా అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఎంపీపీ మహేష్ అన్నారు. ఇటీవల బంటుమిల్లి మండలానికి సరిపడా యూరియా ఇవ్వాలని ఆర్డీవోకు రైతులంతా వినతి పత్రం ఇచ్చినా పట్టించుకోలేదని చెప్పారు. బంటుమిల్లి మండలానికి యూరియా ఇస్తామని జేసీ గీతాంజలిశర్మ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. కంచికచర్ల మండలంలో ఐదు వేల టన్నుల యూరియాను ఇవ్వాల్సి ఉండగా, కేవలం 1100 టన్నులను మాత్రమే ఇచ్చారని, బయటి మార్కెట్‌లో బస్తా రూ.450, అంతకు మించి ధరతో రైతులు కొనుగోలు చేస్తున్నారని కంచికచర్ల జెడ్పీటీసీ తెలిపారు. మిగిలిన మండలాలకు చెందిన జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు యూరియా కొరతపై రైతులు పడుతున్న ఇబ్బందులను ఏకరువు పెట్టారు.

కొరత లేదని అనడంతో పోడియం వద్దకు దూసుకెళ్లిన సభ్యులు

యూరియా కొరతపై జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు అధికారులను ప్రశ్నిస్తూ ఉమ్మడి జిల్లాలో యూరియా కొరత ఉందా లేదా అనే అంశంపై స్పష్టమైన సమాధానం చెప్పాలని నిలదీశారు. ఎన్టీఆర్ జిల్లా వ్యవసాయ శాఖ జేడీ విజయకుమారి స్పందిస్తూ జిల్లాలో యూరియా కొరత లేదని అన్నారు. దీంతో సభ్యులంతా ఒక్కసారిగా పోడియం వద్దకు వెళ్లి అధికారులతో వాగ్వాదానికి దిగారు. మీ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు తప్పుడు సమాచారం ఇచ్చి రైతులను ఇబ్బందులపాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సుమారు 20 నిమిషాల పాటు సభ్యులంతా పోడియం ఎదుట నిలబడి ఆందోళన చేశారు. కృష్ణా కలెక్టర్ బాలాజీ సభ్యులకు సర్దిచెప్పినా వారు పట్టించుకోలేదు. కలిదిండి మండలం క్యాంప్‌బెల్ కాల్వకు పూర్తిస్థాయిలో సాగు నీటిని విడుదల చేయాలని సభ్యులు కోరారు. కంచికచర్ల మండలం తవ్వకాల్వకు గండ్లు పడ్డాయని, వాటిని పూడ్చేందుకు రూ.1.20కోట్ల నిధులు విడుదలైనా పనులు చేయడం లేదని కంచికచర్ల ఎంపీపీ ఎం.గాంధీ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. వరదల వల్ల పొలాల్లో ఇసుక మేటలు వేశాయని, వాటిని తొలగిస్తుంటే రైతులపై కేసులు పెడుతున్నారని తెలిపారు.

జెడ్పీ ఛైర్‌పర్సన్‌పై దాడిచేసిన వారిపై చర్యలేవీ?

జెడ్పీ ఛైర్‌పర్సన్ ఉప్పాల హారికపై గుడివాడలో దాడి చేసిన వారిపై ఎందుకు చర్యలు తీసుకోలేదని పలువురు సభ్యులు అధికారులను నిలదీశారు. మూడు నెలలుగా జాప్యం చేస్తున్నారని మండిపడ్డారు. కలెక్టర్ వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై కలెక్టర్ బాలాజీ స్పందించారు. వెంటనే ఎస్పీ గంగాధరరావుతో ఫోన్‌లో మాట్లాడారు. తాను ఎస్పీతో మాట్లాడానని, ఈ ఘటనపై కేసు నమోదు చేశారని, త్వరలో తగు చర్యలు తీసుకుంటారని కలెక్టర్ తెలిపారు. జెడ్పీ నిధులతో చేపట్టే పనులకు నిధులు ఇచ్చిన జెడ్పీటీసీ సభ్యులకు కనీస సమాచారం ఇవ్వకుండా ప్రారంభోత్సవాలు చేస్తున్నారని, ఇలాంటి ఘటనలు జరగకుండా చూడాలని జెడ్పీ ఛైర్మన్‌తోపాటు సభ్యులంతా కలెక్టర్‌కు వివరించారు.

జెడ్పీటీసీ సభ్యుల గౌరవ వేతనం విడుదలకు ఆమోదం

గత 18 నెలలుగా జెడ్పీటీసీ సభ్యులకు పెండింగ్‌లో ఉన్న గౌరవ వేతనం రూ.74.93 లక్షలను జెడ్పీ జనరల్ ఫండ్ నుంచి విడుదల చేసేందుకు ప్రభుత్వం ఇటీవల అనుమతులు ఇవ్వడంతో, గౌరవ వేతనాన్ని విడుదల చేసేందుకు సమావేశంలో తీర్మానం చేశారు. ఈ సమావేశంలో కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, నూజివీడు సబ్‌కలెక్టర్ వినూత్న, జెడ్పీ సీఈవో కన్నమనాయుడు, డిప్యూటీ సీఈవో ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.



అన్నమ్మ దివ్యాంగ ఆశ్రమం ఎదుట ఆందోళన చేస్తున్న బాలుడి తల్లిదండ్రులు, గ్రామస్థులు, సన్ని (ఇన్‌సెట్)

ఆశ్రమ నిర్వాహకులే చంపేసి ఉంటారు!

» బాలుడి అదృశ్యంపై తల్లిదండ్రుల ఆందోళన

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : తమ బిడ్డను అన్నమ్మ దివాంగుల ఆశ్రమ నిర్వాహకులే చంపేసి ఉంటారని షైదా సన్ని (దివ్యాంగుడు) తల్లిదండ్రులు జ్యోత్స్న, జ్యోతిరాజులు ఆరోపించారు. పెనుగంచిప్రోలు మండలం అనిగండ్లపాడు గ్రామానికి చెందిన సన్ని ఇబ్రహీంపట్నంలోని అన్నమ్మ దివ్యాంగుల ఆశ్రమంలో ఉంటూ టెన్త్ చదువుతున్నాడు. ఈనెల ఎనిమిదో తేదీ నుంచి బాలుడు అదృశ్యమయ్యాడు. ఆశ్రమ యజమానే తమ బిడ్డను చంపేసి ఉంటారని గురువారం బాలుడి తల్లిదండ్రులు, గ్రామస్థులతో కలిసి ఆశ్రమం ఎదుట ఆందోళనకు దిగారు. కొడుకు తప్పిపోతే తమకు చెప్పాలని, ఒకవేళ బయటకు వెళితే సీసీ కెమెరాల్లో నమోదవుతుందని చెప్పారు. సీఐ ఎ.చంద్రశేఖర్ ఆశ్రమ సిబ్బందిని ప్రశ్నించారు. ఆశ్రమ యజమాని అందుబాటులో లేరని, వచ్చిన తర్వాత పూర్తిస్థాయిలో విచారణ చేసి బాలుడి ఆచూకీ కనుగొంటామని సీఐ బాలుడి తల్లిదండ్రులకు హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమించారు.

దసరా డబుల్ డ్యూటీ

(5వ పేజీ తరువాయి)

సంఘాల నాయకులు తప్పుపడుతున్నారు.

డ్రాఫ్ట్, ఇంజనీరింగ్ సెక్షన్‌లను కలిపేసి.. డబుల్ డ్యూటీ!

నిర్దేశించిన 26 సెక్టార్‌లకు 43 విభాగాల్లో 1,490 మంది పారిశుధ్య కాంట్రాక్ట్ కార్మికులకు విధులు కేటాయించారు. వీరిని పర్యవేక్షించే విధులను నగరంలోని 286 సచివాలయాల్లో పని చేసే వెల్ఫేర్ సెక్రటరీ, మహిళా పోలీసులకు అప్పగిస్తూ ఈ నెల తొమ్మిదో తేదీన వీఎంసీ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఒక్కో సెక్టార్‌లో ఎనిమిది గంటల చొప్పున ఒక వ్యక్తికి విధులు కేటాయించి, రోజుకు ముగ్గురికి డ్యూటీ వేశారు. ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఒక షిఫ్ట్, మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 10 గంటల వరకు రెండో షిఫ్ట్, రాత్రి 10 నుంచి మరుసటి రోజు ఉదయం 6 గంటల వరకు నైట్ షిఫ్ట్‌గా నిర్ణయించారు. డ్రాఫ్ట్ సెక్షన్‌లోని 26 సెక్టార్‌లలో విధులు కేటాయించిన ఉద్యోగికే, మరలా ఇంజనీరింగ్ లోని 43 విభాగాల్లో విధులు కేటాయించేశారు. అదీ ఒకే షిఫ్ట్‌లో కేటాయించడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది.

దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు రాత్రి విధులు

వయసుపైబడి, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న ఉద్యోగులకు రాత్రి సమయంలో విధులు కేటాయించడంపై ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కేవలం కక్షసాధింపు ధోరణితోనే వీఎంసీ అధికారులు ఈ తరహా ఉత్తర్వులు జారీ చేశారని మండిపడుతున్నారు. సచివాలయంలో పని చేసే యువతకు ఎలాంటి విధులు కేటాయించకుండా 50 ఏళ్లు పైబడి బీపీ, షుగర్, కిడ్నీ తదితర వ్యాధులతో బాధపడుతున్న తమనే విధులకు పంపాలనుకోవడం ఎంత వరకు సబబని ప్రశ్నిస్తున్నారు. అస్పష్టంగా, అనాలోచితంగా, కక్షసాధింపుతో ఉన్న ఉత్తర్వులను మరోసారి పరిశీలించి, ఉత్తర్వులు జారీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

బాలిక మృతదేహం కోసం గాలింపు!

(5వ పేజీ తరువాయి)

మృతదేహాన్ని ఎక్కడ పడేశాడో చెప్పలేకపోతున్నాడని తెలుస్తోంది. పోలీసులకు ఈ విషయంలో నిందితుడు ఎలాంటి సమాచారం చెప్పడం లేదు.

డ్రోన్లతో గాలింపు

కుమార్తెను హత్య చేసిన తర్వాత మృతదేహాన్ని రెండు ప్రాంతాల్లో పడేసినట్టు నిందితుడు చెబుతున్నాడు. ఎ.కొండూరు అటవీ ప్రాంతం, మధిర చెరువు వద్ద పోలీసులు డ్రోన్లతో గాలింపు చేపట్టారు. ఈ కేసు దర్యాప్తునకు అధికారులు ప్రత్యేక బృందాన్ని నియమించారు. అటవీ ప్రాంతంలోకి రెండు డ్రోన్లను, మధిర చెరువు వద్దకు రెండు డ్రోన్లను పోలీసులు పంపారు. అక్కడ గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు డ్రోన్లను ఎగురవేసినప్పటికీ ఎలాంటి ఫలితం కనిపించలేదు. ఈ కేసులో మృతదేహం కీలకంగా మారింది. నిందితుడు ఒక్కడే బాలికను హత్య చేయలేదని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ ఘటనలో మొదటి భార్యతోపాటు ఆమె కుమార్తెల పాత్ర ఉన్నట్టు భావిస్తున్నారు. పక్కింటి వ్యక్తి ఆటోను చంద్రగూడెంలోని మావయ్య ఇంటికి వెళ్లి భోజనం తెచ్చుకుంటానని చెప్పి తీసుకున్నట్టు తెలిసింది. పోలీసులు ఆటోడ్రైవర్‌ను పిలిపించి విచారించారు. అతడూ ఇదే విషయాన్ని చెప్పినట్టు తెలిసింది. గడిచిన నెల 31వ తేదీ రాత్రి ఆటోను తీసుకున్న నిందితుడు ఒకటో తేదీ ఉదయం తీసుకొచ్చి ఇచ్చాడు. కుమార్తె మృతదేహాన్ని గోనె సంచిలో చుట్టేసి ఆటోలో తీసుకెళ్లి పారేశాడు. ఆ రోజు రాత్రంతా ఆటోను శుభ్రంగా కడిగేసి ఎలాంటి రక్తపు వాసన రాకుండా స్ప్రే చేసినట్టు సమాచారం. మృతదేహం విషయంలో ఒక స్పష్టత వచ్చిన తర్వాత రెండు, మూడు రోజుల్లో పోలీసులు అధికారికంగా ఈ వివరాలను వెల్లడించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

డయేరియా డర్!

(5వ పేజీ తరువాయి)

పొందుతున్నారు. వారిలో ఏడుగురు పాత ప్రభుత్వాసుపత్రిలో ఉండగా, 40 మంది కొత్త ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మరికొంత మందికి కేర్ అండ్ షేర్ పాఠశాలలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో చికిత్స అందజేస్తున్నారు. బుధవారం ఆసుపత్రిలో చేరిన బాధితులు ఐదుగురు క్షతగాత్రులను ఇళ్లకు పంపించారు. తాజాగా మూడో డివిజన్ పాత రామాలయం వద్ద ముగ్గురు చిన్నారులకు వాంతులు కావడంతో ఆసుపత్రికి తరలించారు.

అక్కడికక్కడే పరీక్షలు

న్యూరాజరాజేశ్వరిపేటలో ప్రబలిన జీఈకి కారణం ఏమిటన్న విషయాన్ని విశ్లేషించే పనిలో అధికారులు ఉన్నారు. ఆ ప్రాంతంలో మంత్రి పి.నారాయణ, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు పర్యటించారు. అధికారులు న్యూరాజరాజేశ్వరి ప్రాంతాన్ని 13 జోన్లుగా విభజించారు. వాటి బాధ్యతలను సచివాలయ సిబ్బందికి అప్పగించారు. 50వ డివిజన్‌లో తొమ్మిది సచివాలయాలు ఉన్నాయి. అదనంగా మరో నాలుగు సచివాలయాల నుంచి సిబ్బందిని న్యూఆర్‌ఆర్ పేటలోకి దింపారు. ఈ ప్రాంతాల్లో ఉన్న నీటి నమూనాలను సేకరించి అక్కడికక్కడే ఫలితాలను తెలిపేలా పరీక్షలు చేస్తున్నారు. ఇందు కోసం ఫుడ్‌సేఫ్టీ ఆన్ వీల్స్ వాహనాన్ని ఇక్కడకు రప్పించారు. ఇదొక సంచార ప్రయోగశాల. ఇందులో ఉన్న ప్రయోగశాలలో 70-80 పరీక్షలు చేయవచ్చు. గురువారం మధ్యాహ్నం 20-25 ప్రదేశాల్లో నీళ్ల నమూనాలను సేకరించారు. సీసాల ద్వారా తీసుకొచ్చి ఈ నీటిని ఫుడ్ సేఫ్టీ ఆన్ వీల్స్‌లో పరీక్షిస్తున్నారు. సాయంత్రం వరకు జరిగిన పరీక్షల్లో ఎలాంటి కలుషిత ఛాయలు కనిపించలేదు. మొత్తం తొమ్మిది రకాల రసాయన పరీక్షలు చేశారు. దీంతో ఆ నమూనాలను మైక్రోబయాలజీ ల్యాబ్‌కు పంపారు.

పబ్లిక్ కుళాయిలు బంద్

న్యూఆర్‌ఆర్‌పేటలో గ్యాస్ట్రో ఎంట్రైటీస్ రావడానికి కారణం ఏమిటో ఇప్పటి తెలియలేదు. కుళాయిల ద్వారా వచ్చిన కలుషితమైన నీటిని తాగడం వల్ల ఈ పరిస్థితి వచ్చిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇక్కడ చాలాచోట్ల కుళాయిలపై నుంచి డ్రెయిన్ ప్రవహిస్తోంది. పరిస్థితిని కట్టడి చేయడానికి అధికారులు ముందుగా వీఎంసీ పైపులైన్లు బంద్ చేశారు. ఆ ప్రాంతలకు కుళాయిల నుంచి నీటి సరఫరాను ఆపేశారు. మినరల్ వాటర్‌ను వ్యాన్ల ద్వారా అక్కడి ప్రజలకు సరఫరా చేస్తున్నారు.

విజయవాడ తూర్పు

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్ 140,149, 160
చికెన్ విత్ స్కిన్ 268
చికెన్ స్కిన్‌లెస్ 278



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 545

సుబ్రహ్మణ్యేశ్వర దేవస్థానంలో

అక్టోబరు 22నుంచి స్వామివారి కల్యాణ బ్రహ్మోత్సవాలు

వన్‌టౌన్: కొత్తపేట ఇంద్రకీలాద్రిపై ఉన్న సుబ్రహ్మ ణ్యేశ్వరస్వామి దేవస్థానంలో విశ్వావసు నామ సంవత్సర కార్తీకమాస స్కంద షష్ఠి, కల్యాణ బ్రహ్మోత్సవాలు అక్టోబరు 22 నుంచి 31 వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు దేవస్థానం ఈవో సలాది వెంకట సుబ్బారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రోజూ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ బ్రహ్మోత్సవాలకు ఎంపీ కేశినేని శివనాథ్, పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి, దేవదాయ శాఖ ఉన్నతాధికారులు హాజరుకానున్నట్లు ఈవో తెలిపారు.



న్యూ ఆర్ఆర్‌పేటలో కేజీఎఫ్ అపార్ట్‌మెంట్ వద్ద మురుగు నీటి మధ్య మంచినీటి ట్యాంకు, డ్రెయినేజీ పైపులు లీకై ఆవాసాల మధ్య మురుగు

అంతా అపరిశుభ్రమే..

- న్యూ ఆర్ఆర్‌పేటలో పారిశుధ్య నిర్వహణ శూన్యం
- మంచినీటి సంపుల చుట్టూ మురుగు నీరు
- దుర్వాసనతో స్థానికుల పాట్లు

అజిత్‌సింగ్‌నగర్, ఆంధ్రజ్యోతి : న్యూ రాజరాజేశ్వరిపేటలో డయేరియా లక్షణాలతో ప్రజలు ఆసుపత్రుల పాలవుతున్నా అధికారుల తీరు మాత్రం మారటం లేదు. రోజు రోజుకు బాధితుల సంఖ్య పెరుగుతున్నా నివారణా చర్యలు మాత్రం శూన్యంగా కనిపిస్తున్నాయి. మంత్రులు, ఎమ్మెల్యేలు, కలెక్టర్ స్థాయి ఉన్నతాధికారులు పరామర్శలకు వచ్చే ప్రాంతాలను తప్ప మిగిలిన ప్రాంతాల్లో పారిశుద్యాన్ని గాలికి వదిలేశారు. ఆసుపత్రి, ప్రధాన రహదారుల్లో బ్లీచింగ్‌లు చల్లి నానా హడావుడి చేసి చేతులు దులుపుకుని మిగిలిన ప్రాంతాలను నిర్లక్ష్యం చేస్తున్నారు. స్థానిక జేఎన్ఎన్‌యూఆర్ఎం, కేజీఎఫ్ అపార్ట్‌మెంట్లు ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ దుర్భరంగా కనిపిస్తున్నా అటువైపు కన్నెత్తి చూడటం లేదు. పలు చోట్ల తాగునీరుకు వాడే మంచినీటి సంపుల చుట్టూ మురుగునీరు చేరి తీవ్ర దుర్వాసన వస్తుంది. మంచి నీటి సంపుల చుట్టూ చెత్త, చెదారం పేరుకుపోయి కుక్కలు, ఎలుకలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఈగలు, దోమలు విపరీతంగా చేరి ఆ ప్రాంతం మురికికూపంలా కనిపిస్తుంది. అపార్ట్‌మెంట్లలో వాడుక నీరు రోడ్లపై చేరి దుర్గంధాన్ని వెదజల్లుతోంది. ప్రస్తుత న్యూ రాజ రాజేశ్వరిపేట పరిస్థితుల దృష్ట్యా జీప్లస్‌త్రీ అపార్ట్‌మెంట్ వాసులు బెంబేలెత్తిపోతున్నారు. తమ ప్రాంతంలో పారిశుద్యం మెరుగుపరచి వ్యాధులు ప్రబలకుండా చూడాలని వేడుకుంటున్నారు.



జేఎన్ఎన్‌యూఆర్ఎం అపార్ట్‌మెంట్స్ వద్ద అధ్వానంగా ఉన్న పారిశుధ్యం

బీఎస్ఎన్ఎల్ లోక్ అదాలత్ రేపు

గుణదల, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): బిల్లులు చెల్లించక నిలిపివేయబడ్డ బీఎస్ఎన్ఎల్ ఫోన్ల పునరుద్ధరణ నిమిత్తం, కేసుల పరిష్కారానికై ఈనెల 13న లోక్ అదాలత్ నిర్వహించడం జరుగుతుందని బీఎస్ఎన్ఎల్ ఏరియా ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ ఎల్.శ్రీను తెలిపారు. క్లోజ్ చేయబడిన బీఎస్ఎన్ఎల్ ఫోన్ల తాలూకా వినియోగదారులకు న్యాయసేవాధి కార సంస్థ ద్వారా నోటీసులు ఇవ్వడం జరుగుతుందన్నారు. కోర్టుకు హాజరు కాకుండానే ముందుగా మీ బకాయిలు చెల్లించాలని చెప్పారు. 13లోగా బకాయిలు వడ్డీ లేకుండా చెల్లించే సౌలభ్యం కల్పిస్తూ పూర్వాపరాలు పరిశీలించాక తగిన రాయితీ కూడా పొందే అవకాశం ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 0866-2444266, 8333898997 నెంబర్లకు ఫోన్ చేయాలని కోరారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలోని విజయవాడ, నందిగామ, జగ్గయ్యపేట, తిరువూరు, మైలవరం, నూజివీడు, మచిలీపట్నం, కైకలూరు, గుడివాడ, అవనిగడ్డ, ఉయ్యూరు, గన్నవరం కోర్టులందు నేషనల్ లోక్ అదాలత్ జరుగుతుందని తెలిపారు.

పర్యావరణ వాస్తు రూపకల్పనపై స్పాలో జాతీయ సదస్సు నేడు

భారతీనగర్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నగర ప్రాంతాల్లో పర్యావరణ వాస్తురూపకల్పన, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా నేరాల నివారణపై ప్రప్రథమ జాతీయ సదస్సు ఐదో నెంబరు రోడ్లోని స్పా(స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ కళాశాల)లో శుక్రవారం నిర్వహించనున్నట్లు ప్రొఫెసర్ డాక్టర్ కె. రమేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా కలెక్టర్ లక్ష్మీశ, నగర పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు, ప్రొఫెసర్ డాక్టర్ వీరేంద్ర కుమార్ పాల్ పాల్గొంటారని తెలిపారు.

అగ్నిప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



గుణదల, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): బాల బాలికలు అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి మాల్యాద్రి తెలిపారు. గుణదల్లోని సెయింట్ జాన్స్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో అగ్ని ప్రమాద నిరోధక అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ అగ్ని ప్రమాదం జరిగిన సమయంలో కంగారుపడకుండా జాగ్రత్తగా మనవద్ద సామాగ్రితో మంటలను ఎలా అదుపు చేయవచ్చు అన్న ఆలోచన చేయాలని చెప్పారు. మంటలు ఎలా అదుపు చేయాలి, ఎలాంటి పరికరాలు వాడాలి, తదితర విషయాలను తెలియజేశారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా భారీ భవనాలు, కాంప్లెక్సుల వద్ద చుట్టూ ఫైర్ సేఫ్టీ మెజర్స్ ఏమేం చేయాలి అన్న దానిపై అవగాహన కల్పించారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

పెనమలూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : చీరెకు నిప్పంటుకొని కాలిన గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కానూరుకు చెందిన మహిళ మృతి చెందింది. మంచినేని స్వరూపరాణి (50) చీరెకు స్టౌ మంట అంటుకొని కాలిన గాయాలయ్యాయి. ఆమెను కుమార్తె విజయ ఆసుపత్రికి తరలించారు. వారంపాటు చికిత్స చేసి డిశ్చార్జి చేశారు. కాలిన గాయాలకు ఇన్ఫెక్షన్ సోకడంతో గతనెల 26న మరో ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

జగన్‌ది రాజకీయ రాబందుల జాతి

టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గన్నే ప్రసాద్

వన్‌టౌన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): జగన్‌ది రాజకీయ రాబందుల జాతి అని, సీఎం చంద్రబాబుపై జగన్ చేసిన దిగజారుడు వ్యాఖ్యలను టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గన్నే ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. తండ్రి మరణాన్ని రాజకీయ ప్రయోజనంగా వాడుకుని, బాబాయ్ హత్యతో అధికారంలోకి వచ్చి, ఆస్తుల కోసం తల్లి, చెల్లిని కోర్టుల్లోకి లాగిన నీచుడు జగన్ అన్నారు. అనంతపురంలో నిర్వహించిన సూపర్ సిక్స్ విజయోత్సవ సభకు రాయలసీమ ప్రజలు బ్రహ్మరథం పట్టడంతో దానిని తట్టుకోలేని జగన్ తన 'జె గ్యాంగ్' పేటీయం కార్మికులతో సోషల్ మీడియా ద్వారా రాష్ట్రంలో నిత్యం ఫేక్ ప్రచారాలు చేస్తున్నాడన్నారు. అహంకారంతో, రౌడీ మనస్తత్వంతో తండ్రి వయస్సున్న సీఎం చంద్రబాబుపై 'చావాలి' అంటూ చేసిన వ్యాఖ్యలను, బలహీన వర్గాల నేత అచ్చెన్నాయుడుపై చేసిన అనుచిత వ్యాఖ్యలను జగన్ వెంటనే ఉపసంహరించుకుని క్షమాపణలు చెప్పాలన్నారు.

జగన్ బహిరంగ క్షమాపణ చెప్పాలి

కోనేరు నాగేంద్ర కుమార్

గుణదల, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): తండ్రి వయస్సులో ఉన్న చంద్రబాబును చావాలి అంటూ జగన్మోహన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు తక్షణమే బహిరంగ క్షమాపణ చెప్పాలని తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోనేరు నాగేంద్ర కుమార్ డిమాండ్ చేశారు. తండ్రి మరణాన్ని రాజకీయ ప్రయోజనంగా వాడుకుని, బాబాయ్ హత్యతో అధికారంలోకి వచ్చి ఆస్తుల కోసం తల్లి-చెల్లిని కోర్టుకు లాగిన నీచుడు జగన్ అని విమర్శించారు. రాయలసీమలో ప్రజలు కూటమి సభకు బ్రహ్మరథం పట్టడంతో జీర్ణించుకోలేని జగన్ తన జె గ్యాంగ్ పేటీఎం కార్మికులతో సోషల్ మీడియాలో నిత్యం ఫేక్ ప్రచారాలు చేస్తూ పబ్బం గడుపుకుంటున్నారన్నారు. ప్రత్యేక హోదా తెస్తానని 22 పార్లమెంట్ సీట్లు అడిగి మోసం, కల్తీ లిక్కర్ అమ్మి అవినీతికి పాల్పడటం ఇలా చెప్పుకుంటూ పోతే జగన్ వందసార్లు సెప్టిక్ ట్యాంక్‌లో దూకి చావాల్సిన స్థితి అంటూ విమర్శించారు.

రైలులో మర్చిపోయిన బ్యాగ్ యజమానికి అప్పగింత

రైల్వేస్టేషన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): విజయవాడ గవర్నమెంట్ రైల్వే పోలీసులు (జీఆర్‌పీ) గురువారం ఒక ప్రయాణికుడు రైలులో మర్చిపోయిన బ్యాగ్‌ను ట్రేస్ చేసి తిరిగి అతనికి అప్పగించారు. గురువారం ఒంగోలుకు చెందిన రావిపాటి లక్ష్మీనారాయణ (68) చిట్రగుంట నుంచి విజయవాడ వచ్చే ప్యాసింజర్ రైలులో వస్తుండగా రైలు కృష్ణాకెనాల్ వద్ద కొంతసేపు ఆగింది. ఈ లోపల లక్ష్మీనారాయణ రైలు దిగి వాష్ రూమ్‌కు వెళ్లాడు. తిరిగి అతను వచ్చే లోగా సిగ్నల్ పడటంతో రైలు కదిలి వెళ్లిపోయింది. అతని బ్యాగ్ రైలులోనే ఉండిపోయింది. బ్యాగ్‌లో భూమికి సంబంధించిన విలువైన డాక్యుమెంట్లు ఉన్నందున ఆ సమాచారాన్ని విజయవాడ రైల్వే పోలీసు సీఐ రమణకు లక్ష్మీనారాయణ తెలియజేశాడు. సీఐ వెంటనే స్పందించి తన సిబ్బందిని రైలులో వెతికించారు. బ్యాగ్‌ను గుర్తించి లక్ష్మీనారాయణకు తిరిగి అప్పగించారు. విలువైన డాక్యుమెంట్లు లభించినందుకు లక్ష్మీనారాయణ జీఆర్‌పీకి కృతజ్ఞతలు తెలిపారు.



బ్యాగ్‌ను లక్ష్మీనారాయణకు అందజేస్తున్న గవర్నమెంట్ రైల్వే పోలీసు

చెట్టు కొమ్మలు తొలగింపు



ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

భారతీనగర్, సెప్టెంబరు11(ఆంధ్రజ్యోతి): మూడో డివిజన్ పరిధిలోని విజయలక్ష్మి నగర్ కాలనీలోని ఎండిపోయిన చెట్టు కొమ్మలను గురువారం వీఎంసీ సిబ్బంది తొలగించారు. విజయలక్ష్మి నగర్ కాలనీలోని ఎండిన చెట్టు కొమ్మలు తొలగించండి అనే శీర్షిక గురువారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైంది. ఈ కథనంతో స్పందించిన అధికారులు సిబ్బందిని పంపించి ఆ రోడ్డులోని చెట్టుకొమ్మలను తొలగించారు.



ఫైనల్ పోటీలకు అర్హత సాధించిన టీం సభ్యులతో యాజమాన్యం

క్వాంటమ్ వ్యాలీ హ్యాకథాన్ ఫైనల్లో వీఆర్ విద్యార్థినులు

పెనమలూరు, సెప్టెంబరు11(ఆంధ్రజ్యోతి): గంగూరు ధనేకుల ఇంజనీరింగ్ కళాశాలలో ప్రతిష్టాత్మకంగా జరిగిన అమరావతి క్వాంటమ్ వ్యాలీ హ్యాకథాన్-2025 పోటీల సెమీఫైనల్లో వీఆర్ సిద్ధార్థ యూనివర్సిటీ విద్యార్థినుల జట్టు విజయం సాధించి ఫైనల్లో ప్రవేశించిందని యాజమాన్యం తెలిపింది. మొదటి స్థానంలో నిలిచిన యూనివర్సిటీ టీం రూ.15 వేల ప్రథమ బహుమతిని సాధించి త్వరలో జరగనున్న ఫైనల్ పోటీలకు అర్హత సాధించిందని తెలిపారు. ఫైనల్ పోటీలకు తలపడే టీంలో పి. శ్రీహాసిని, బి.ఉదిత, కె. జాహ్నవి, డి. పల్లవి, ఎం.ప్రవల్లిక, పి.జస్విత సభ్యులుగా ఉంటారని తెలిపారు.

పెజ్జోనిపేటలో జోరుగా గంజాయి అమ్మకాలు

విద్యార్థులే టార్గెట్‌గా చేసుకుని వ్యాపారం

వన్‌టౌన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పెజ్జోనిపేటలో గంజాయి అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. విజయవాడ రైల్వే స్టేషన్‌కు కూతవేటు దూరంలో పెజ్జోనిపేట ప్రాంతం ఉండటంతో ఇతర ప్రాంతాల నుంచి రైళ్లలో అక్రమంగా గంజాయి ఈ ప్రాంతానికి తరలిస్తున్నారు. విజయవాడ రైల్వే స్టేషన్‌కు ప్రతిరోజూ ఇతర ప్రాంతాల నుంచి వందలాది రైళ్లు వస్తూపోతుంటాయి. ఈ క్రమంలో కొందరు ముఠాగా ఏర్పడి విశాఖపట్నం, విజయనగరం, ఒడిస్సా, తదితర ప్రాంతాల నుంచి పెద్ద మొత్తంలో రైళ్ల ద్వారా గంజాయిని తరలిస్తున్నారు. విజయవాడ స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్న పాత రాజరాజేశ్వరిపేట వద్ద తప్పనిసరిగా రైళ్లు ఆగుతూ ఉంటాయి. ఆ సమయంలో గంజాయి తరలించేవారు అక్కడ రైలు నుంచి గంజాయి బండిల్స్‌ను దించి పాత రాజరాజేశ్వరిపేట, ఖుద్దూస్‌నగర్, పెజ్జోనిపేట, సమీప ప్రాంతాలకు తరలిస్తారు. అక్కడి నుంచి చిన్న పొట్లాలుగా తయారు చేసి యువకులకు అధిక ధరలకు అమ్ముతున్నారు. ముఖ్యంగా విజయవాడ రైల్వే డీఆర్ఎం కార్యాలయం సమీపంలో, పెజ్జోనిపేట, పాత రైల్వేట్రాక్ కట్ట, లోకోషెడ్డు, సైజాంగేటు, పాతరాజరాజేశ్వరిపేట వద్ద గంజాయి పొట్లాలు జోరుగా విక్రయిస్తుంటారు. పెజ్జోనిపేట డేవిడ్ వీధి, మసీదు సెంటర్, పప్పుల మిల్లు సెంటర్, తదితర ప్రాంతాలలో గంజాయి పొట్లాలు విక్రయిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. రాత్రి వేళల్లో ఇద్దరు మహిళలు గుట్టుచప్పుడు కాకుండా రైల్వేస్టేషన్, ఆటోస్టాండ్, పప్పులమిల్లు సెంటర్ వద్ద గంజాయి పొట్లాలు అధిక రేట్లకు విక్రయిస్తున్నట్లు పలువురు ఆటోడ్రైవర్లు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా గంజాయి విక్రేతలు విద్యార్థులను టార్గెట్ చేసుకుని వారికి మొదట్లో తక్కువ ధరకు గంజాయి పొట్లాలు విక్రయించి, వారు అలవాటుపడిన తరువాత ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు పలువురు చెబుతున్నారు. ఇటీవల ఓ విద్యార్థి గంజాయికి బానిసయ్యాడని తల్లిదండ్రులు గుర్తించి మందలించారు. దీంతో ఆ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం. ఈ ఘటన పెజ్జోనిపేటలో కలకలం రేపింది. గంజాయి మత్తులో యువకులు అర్ధరాత్రి వేళల్లో రోడ్డు పక్కన, ఇళ్ల ముందు బైక్‌లను ధ్వంసం చేస్తున్నారు. మూడు రోజుల క్రితం బత్తులవారి వీధిలో ఇంటిముందు పార్కింగ్ చేసిన బైక్‌ను కొందరు యువకులు గంజాయి మత్తులో ధ్వంసం చేసినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. గంజాయి అమ్మకాల పై కఠిన చర్యలు తీసుకోవాలని యువకుల తల్లిదండ్రులు పోలీసు ఉన్నతాధికారులను కోరుతున్నారు.

ఆటో మోటార్ కార్మికుల సమస్యలపై

18న నగరంలో భారీ నిరసన

గాంధీనగర్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): వాహన మిత్రను పెంచకుండా ప్రకటించడం, ఎన్నికల హామీలను విస్మరించిన సీఎం చంద్రబాబు వైఖరిని తీవ్రంగా వ్యతిరేస్తున్నామని ఆటో మోటార్ రాష్ట్ర కార్మిక సంఘాల నేతలు తెలిపారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆటో మోటార్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ. ఏఐసీసీటీయూ, ఇఫ్టూ నేతలు ముజాఫర్ అహ్మద్, దాది శ్రీనివాసరావు, ఎం.ఈశ్వర్, ఎం.రామకృష్ణ మాట్లాడారు. వాహనమిత్రను రూ.15 వేల నుంచిరూ.30 వేలకు పెంచాలని, ఓనర్‌షిప్‌తో నిమిత్తం లేకుండా ఆటో, క్యాబ్, లారీ వంటి అన్ని వాహనాల డ్రైవర్లకు వాహనమిత్ర పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆటో మోటార్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 18న విజయవాడ నగరంలో ఆటో మోటార్ కార్మికులతో భారీ నిరసన ప్రదర్శన చేపడతామని పేర్కొన్నారు. ఏపీ ప్రగతిశీల ఆటో కార్మిక సంఘం , ఏపీ ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ , ఏపీ ప్రోగ్రెసివ్ మోటార్ అండ్ వెహికల్ డ్రైవర్స్ యూనియన్ నేతలు కె.పోలారి, దుర్గారావు, ఈశ్వర్ పాల్గొన్నారు.

స్పెషల్ ఎడ్యుకేషన్ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయండి

గాంధీనగర్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 86 వేల మంది ప్రత్యేక అవసరాల పిల్లలకు న్యాయం చేయాలని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరుతూ డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో స్థానిక ధర్నాచౌక్‌లో గురువారం ధర్నా నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో 13 ప్రకారం ప్రతేక ఉపాధ్యాయుల పోస్టులు 2,260 తక్షణమే సిలబస్ ప్రకటించి నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. డీవైఎఫ్ఐ నేతలు బసవ, కృష్ణ, మహేష్, అభ్యర్థులు పాల్గొన్నారు.

12వ పీఆర్సీ కమిటీ చైర్మన్‌ను నియమించాలి

ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి డి.విద్యాసాగర్

గన్నవరం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పీఆర్సీ 12వ కమిటీ చైర్మన్‌ను వెంటనే నియమించాలని ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి డి.విద్యాసాగర్ డిమాండ్ చేశారు. గొల్లనపల్లి, టీటీ గూడెం, కొండపావులూరు, కట్టుబడిపాలెం, గోపవరపుగూడెం, వీఎన్‌పురం కాలనీలోని పాఠశాలలో గురువారం ఎస్టీయూ సభ్యత్వం నమోదు చేయించి సమస్యలు తెలుసుకున్నారు. విద్యాసాగర్ మాట్లాడుతూ 30శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు గడుస్తున్నా ఉపాధ్యాయ సమస్యలపై దృష్టి పెట్టకపోవటం విచారకరమన్నారు. ఎస్టీయూ జిల్లా నాయకులు అనిల్‌బాబు, ఎన్.అశోక్, బి.శ్రీధర్, అబ్దుల్ బషీర్, ఎం.ఆనంద్‌కుమార్, డి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.



పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న మురళీకృష్ణంరాజు, శివనాగేశ్వరరావు, కనకారావు

రెబల్‌స్టార్ కృష్ణంరాజుకు ఘననివాళి

సత్యనారాయణపురం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తెలుగు సినిమా పరిశ్రమ గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన గొప్ప నటుడు రెబల్‌స్టార్ కృష్ణంరాజు అని ప్రభాస్ ఫ్యాన్స్ అసోసియేషన్ డి. మురళీకృష్ణంరాజు తెలిపారు. ప్రభాస్ ఫ్యాన్స్ అసోసియేషన్ డి. మురళీకృష్ణంరాజు, నున్న శివనాగేశ్వరరావు, యు.కనకారావు ఆధ్వర్యంలో గురువారం ముత్యాలంపాడు అల్లూరిసీతారామరాజు రోడ్డులో కృష్ణంరాజు మూడో వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. తొలుత కృష్ణంరాజు చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం పేదలకు చీరలు, పండ్లు, పంచారు. టీడీపీ రాష్ట్రప్రధానకార్యదర్శి నవనీతం సాంబశివరావు, గుర్రం సుబ్బారావు, మన్నం వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

డయేరియా కేసులపై అప్రమత్తం

అధికారులతో మంత్రి నారాయణ సమీక్ష

కలెక్టరేట్/అజిత్‌సింగ్‌నగర్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): విజయవాడలోని న్యూ రాజరాజేశ్వరీ పేటలో డయేరియా కేసులపై పూర్తి అప్రమత్తంగా ఉన్నామని, బాధితులకు మెరుగైన వైద్యం అందజేస్తున్నామని, ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని, వదంతులు నమ్మొద్దని మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. గురువారం ఆయన న్యూ రాజరాజేశ్వరీపేటలో పర్యటించి, డయేరియా ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితులను పరిశీలించారు. స్థానిక మెడికల్ క్యాంపును సందర్శించి బాధితులకు అందుతున్న వైద్యసేవలను ఆరా తీశారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని, పారిశుధ్యం మెరుగుపరచి వ్యాధి ప్రబలకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అక్కడి నుంచి ప్రభుత్వాసుపత్రికి చేరుకుని చికిత్స పొందుతున్నవారిని పరామర్శించారు. అనంతరం కలెక్టరేట్‌లోని కమాండ్ కంట్రోల్ కేంద్రం (సీసీసీ)లో మంత్రి నారాయణ, కలెక్టర్ లక్ష్మీశ, పురపాలక శాఖ సంచాలకుడు పీ సంపత్‌కుమార్, వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్రతో కలిసి వైద్యారోగ్యశాఖ, మున్సిపల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. డయేరియా ప్రబలకుండా ఇప్పటికే తీసుకొన్న చర్యలపై చర్చించారు. క్షేత్రస్థాయిలో తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. అనంతరం మాట్లాడుతూ రాజరాజేశ్వరీపేటలో ముందు జాగ్రత్తగా కుళాయి నీటి సరఫరా ఆపేసి ట్యాంకర్లు, వివిధ మార్గాల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నామన్నారు. ఇప్పటికే అధికారుల ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే నిర్వహించామని, కాచి వడపోసిన నీటిని తాగడం వంటి జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించినట్టు వెల్లడించారు. ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు, న్యూ జీజీహెచ్‌లో బాధితులకు వైద్యం అందిస్తున్నామన్నారు. ఇప్పటికే ఒకసారి నీటి నమూనాలను పరీక్షించామని, లోపాలు కనిపించలేదని, మరిన్ని పరీక్షల ద్వారా సమస్యకు అసలు కారణాలను విశ్లేషించే పనిలో ఉన్నట్లు పేర్కొన్నారు.



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నారాయణ, కలెక్టర్ లక్ష్మీశ తదితరులు

ప్రభుత్వాసుపత్రికి బాధితుల తరలింపు


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

న్యూ రాజరాజేశ్వరిపేట ప్రాంతంలో వాం తులు, విరేచనాలతో బాధపడుతున్నవారికి అ ధికారులు మెరుగైన చికిత్సను అందిస్తున్నారు. సాధారణ రోగులకు స్థానిక మెడికల్ క్యాంపులో చికిత్స అందిస్తుండగా వ్యాధి లక్షణాలు ఎక్కువగా కనిపించిన బాధితులను నగరంలోని సర్వజన ప్రభుత్వాసుపత్రికి తరలిస్తున్నారు. 3 రోజుల వ్యవధిలో 70 మంది ఆసుపత్రుల పాలయ్యారు. గురువారం ఒక్కరోజే వ్యాధి లక్షణాలతో బాధపడుతున్న వారి సంఖ్య 194కు చేరింది. వైద్య సేవలను పర్యవేక్షిస్తున్న డీఎంహెచ్‌వో సుహాసిని మెరుగైన వైద్యం అందిస్తున్నట్టు చెప్పారు. బాధితుల రక్త నమూనాలను ల్యాబ్‌లకు పంపించామని, వ్యాధి లక్షణాలకు గల కారణాలను తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నామన్నారు.

కంట్రోల్ రూమ్ నంబరు 9154970454 : కలెక్టర్

డయేరియా కేసుల నేపథ్యంలో జిల్లా కలెక్టరేట్‌లో 91549 70454 నంబరుతో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్టు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. పరిస్థితి చక్కదిద్దేందుకు, సమన్వయానికి రెవెన్యూ, వివిధ శాఖల జిల్లా అధికారులతో ప్రత్యేక బృందాలు క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నట్టు వెల్లడించారు. బాధితుల ఆరోగ్యం నిలకడగా ఉందని, డయేరియా మరణాలు సంభవించినట్టు వస్తున్న వార్తల్లో నిజం లేదని స్పష్టం చేశారు. ప్రత్యేక బృందాలతో తాగునీటి సరఫరా పైపులైన్ల వ్యవస్థలకు క్షుణంగా పరిశీలిస్తున్నామన్నారు. కేర్ అండ్ షేర్ స్కూల్లోని మెడికల్ క్యాంపు అత్యంత సమర్థవంతంగా సేవలందించేలా ఏర్పాట్లు చేశామన్నారు. ర్యాపింగ్ రెస్పాన్స్ బృందాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. సమావేశంలో డీఆర్‌వో ఎం లక్ష్మీనరసింహం పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకోవాలి: మల్లాది విష్ణు, బాబూరావు

న్యూ రాజరాజేశ్వరిపేట డయేరియా బాధితులను మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, సీపీఎం నేత సీహెచ్ బాబూరావు విడివిడిగా పరామర్శించారు. డయేరియా లక్షణాలతో మృతి చెందిన బాధిత కుటుంబాలకు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. అలాగే న్యూ ఆర్‌ఆర్‌పేటలో పారిశుధ్యం అధ్వానంగా ఉందని మంచినీటి సరఫరాలో అధికారుల నిర్లక్ష్యం కనిపిస్తుందన్నారు. తక్షణం పారిశుధ్యం, మంచినీటి సరఫరా మెరుగుపరచాలని డిమాండ్ చేశారు.

నగరంలో ఆర్‌వో ప్లాంట్ల రిపోర్టులను పరిశీలించండి

- ట్రేడ్ లైసెన్స్, వాటర్ టెస్టింగ్ తాజా ల్యాబ్ రిపోర్టులు లేకుంటే మూసేయండి
- కమిషనర్ ధ్యానచంద్ర



కార్పొరేషన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఆర్‌వో వాటర్ ప్లాంట్ల నీటి శుద్ధత ల్యాబ్ రిపోర్టులు పరిశీలించాలని, ట్రేడ్ లైసెన్స్, తాజా ల్యాబ్ రిపోర్టులు ఏది లేకపోయిన వెంటనే ప్లాంట్‌ను మూసివేయాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. గురువారం శాఖాధిపతులు, ప్రజారోగ్య విభాగం సిబ్బందితో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రజారోగ్య విభాగంలో అధికారులందరూ తమ పరిధిలోని ఆర్‌వో ప్లాంట్ల ద్వారా తాగునీటి సరఫరా వ్యాపారులను గుర్తించి, ట్రేడ్ లైసెన్స్ నీటి పరీక్షల ల్యాబ్ రిపోర్ట్‌లు ఏది లేకపోయిన ఆర్‌వో ప్లాంట్లను మూసివేయాలని అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. ల్యాబ్ రిపోర్ సక్రమంగా ఉందని నిర్ధారించుకున్న తరువాత తాగునీటి సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. సాయంత్రానికల్లా నగర పరిధిలో అటువంటివి ఎన్ని దుకాణాలున్నాయి, వాటి నివేదిక తమకు సమర్పించాలని ఆదేశించారు.

ఆర్‌ఆర్‌పేటలో సరఫరా నీళ్లు వాడకానికి మాత్రమే..!

కొత్త రాజరాజేశ్వరిపేటలో పైప్ లైన్లు ద్వారా సరఫరా అవుతున్న నీళ్లను వాడకానికి మాత్రమే ఉపయోగించాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తాగునీటి కోసం టాంకర్ల ద్వారా సరఫరా చేస్తారని, తాగునీటిని కాచి చల్లార్చిన తర్వాతే తాగాలని కమిషనర్ పేర్కొన్నారు.



రొయ్య రైతుకెంత కష్టం!

- అమెరికా సుంకాల ప్రభావంతో ధర దిగాలు
- అమాంతం పడిపోయిన 100, 40, 30 కౌంట్ రొయ్యలు
- తగ్గని సీడ్, ఫీడ్, విద్యుత్ ధరలు
- సాగు ఖర్చులు పెరిగి, రాబడి తగ్గడంతో రైతుల అయోమయం
- సాగుకు స్వస్తి చెప్పేందుకు ఉమ్మడి కృష్ణా రైతుల సమాయత్తం

ఆంధ్రజ్యోతి, విజయవాడ సిటీ: అంతర్జాతీయ మార్కెట్ ఒడుదుడుకులు ఉమ్మడి కృష్ణాజిల్లాలోని రొయ్యల సాగును తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. ఎగుమతులు తగ్గిపోవడంతో ధర నెమ్మదిగా నేల చూపులు చూస్తోంది. క్రమక్రమంగా తగ్గుతున్న ధరలు రైతులను తీవ్ర నిరాశకు గురి చేస్తున్నాయి. కనీసం ఖర్చులైనా రాని పరిస్థితులు నెలకొనడంతో రొయ్యల సాగుకు స్వస్తి చెప్పేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. ఇదే ధర ఉంటే రూ.లక్షల్లో నష్టపోవాల్సి వస్తుందనే భయం రైతులను వెంటాడుతోంది. నానాటికీ క్షీణిస్తున్న రొయ్యల ధరలు జిల్లా ఆర్థిక స్థితిగతులను ప్రభావితం చేస్తుందని రైతులు అభిప్రాయపడుతున్నారు. జిల్లాలోని 35,908 మంది రైతులు 43,762.5 ఎకరాల్లో వనామీ రొయ్యల సాగు చేస్తున్నారు. ప్రధానంగా సముద్ర తీరంలోని మచిలీపట్నం, కైకలూరు, మండవల్లి, ముదినేపల్లి, పెడన, బంటుమల్లి, కృత్తివెన్ను, కోడూరు, నాగాయలంక, అవనిగడ్డ మండలాలతో పాటు గుడివాడ, హనుమాన్‌జంక్షన్ ప్రాంతాల్లో వీటి సాగు అత్యధికంగా ఉంది. ఏ మాత్రం ప్రతికూల వాతావరణ పరిస్థితులు తలెత్తినా, నీటిలో గాఢత హెచ్చుతగ్గులు వచ్చినా, చెరువు అడుగు భాగంలోని నేలలో కొద్దిపాటి మార్పులు వచ్చినా, ఇతర జీవులు చెరువులోకి ప్రవేశించినా పంట పూర్తిగా దెబ్బతింటుంది. ఈ నేపథ్యంలోనే ఏడాదికి ఒక్క పంట సజావుగా చేతికి రావడం గగనమవుతోంది. ఒక్కో దఫా ఎకరానికి రూ.2లక్షల నుంచి రూ.4 లక్షల వరకు పెట్టుబడి పెట్టి రైతులు నష్టపోతుంటారు. అయినా పట్టువదలకుండా సాగు చేసి ఏదో ఒక సందర్భంలో సజావుగా పంట దిగుబడి సాధిస్తారు.



ధర దిగాలు

ఇతర దేశాలకు ఎగుమతయ్యే ఆక్వా ఉత్పత్తుల్లో వనామీ అగ్రస్థానంలో ఉంటుంది. అమెరికా అధిక సుంకాల ప్రకటన వెలువడిన నాటి నుంచి వీటి ఎగుమతులు పూర్తిగా క్షీణించారు. ఆగస్టు మొదటి వారంలో రూ.550 ఉన్న 30 కౌంట్ రొయ్యల ధర నేడు రూ.380కి పడిపోయింది. 40 కౌంట్ రూ.450 నుంచి 340కి చేరింది. అయితే 50 నుంచి 100 కౌంట్ ధరలు మాత్రం రూ.10, రూ.20 హెచ్చుతగ్గులతో మార్కెట్‌లో కొనసాగుతున్నాయి. ధర అమాంతం పడిపోతుండటం, రోజురోజుకీ తగ్గుముఖం పడుతుండటం రైతులను తీవ్రంగా కలవరానికి గురి చేస్తోంది. రొయ్య కౌంట్‌కు రాకుండానే పట్టుబడి చేస్తున్న దృశ్యాలు తీరంలో కనిపిస్తున్నాయి. ఇదే ధరలు భవిష్యత్తులో కొనసాగితే ఎకరాకు రూ.2 నుంచి రూ.4 లక్షల వరకు నష్టపోవాల్సి వస్తుందని సాగుదారులు అభిప్రాయపడుతున్నారు.

యథాతథంగానే సాగు ఖర్చులు

ధర తగ్గి సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న రైతులకు కాస్త మేలు చేద్దామనే ఆలోచన సీడ్, ఫీడ్ కంపెనీలకు, విద్యుత్ పంపిణీ సంస్థకు రాకపోవడం రైతులను మరింత కుంగదీస్తోంది. సీడ్ (మేత)లో వాడే సోయాబీన్, మొక్కజొన్న ధర పెరిగినపుడు మేత మిశ్రమం ధరను ఆమాంతం పెంచేసే కంపెనీలు, వాటి ధరలు తగ్గినపుడు మాత్రం ధరను తగ్గించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం 25 కేజీల మేత మిశ్రమాన్ని రూ.2,200కు కొనుగోలు చేయాల్సి ఉండటం రైతులను భారీగా ఆర్థిక నష్టానికి దారితీస్తోంది. రాష్ట్రంలోని సీడ్ కంపెనీలన్నీ పలు రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులకు చెందినవే. రొయ్యల ధర పడినపుడు కనీసం సీడ్ ధరను తగ్గించాలనే ఆలోచన ప్రజాప్రతినిధులకు రాకపోవడాన్ని రైతులు తప్పుపడుతున్నారు. ప్రస్తుతం ఒక్కో రొయ్య పిల్ల (సీడ్)ను 39 నుంచి 50 పైసలకు విక్రయిస్తూ నిలువునా దోచుకుంటున్నారని రైతులు మండిపడుతున్నారు. ఒక్కో ఎకరానికి 50 వేల నుంచి రూ.లక్ష వరకు రొయ్య పిల్లలను రైతులు వేస్తారు. వీటిలో కొన్ని రోజులకే దాదాపు 50 శాతం పిల్లలు చనిపోతాయి. ఈ నేపథ్యంలోనే ముందుగానే అధిక సంఖ్యలో పిల్లలను చెరువులో వదులుతారు. సీడ్ కోసమే ఎకరానికి రూ.40వేల నుంచి రూ.50వేల వరకు (రవాణా ఖర్చులు అదనం) రైతులు ఖర్చు చేయాల్సి వస్తోంది. రొయ్యల సాగులో విద్యుత్ ముఖ్య భూమిక పోషిస్తుంది. చెరువులకు యూనిట్‌ను రూ.1.50 కే సరఫరా చేయాలని రైతులు ఎప్పటి నుంచో ప్రభుత్వాలను వేడుకుంటున్నారు. ఆ దిశగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోకపోగా అధిక వసూళ్లతో ఆక్వా రైతులను ఇబ్బందుల్లోకి నెడుతున్నారు. సాగు లేని చెరువుకు సైతం నెలకు రూ.5వేల నుంచి రూ.8వేల వరకు వసూలు చేస్తున్నారని రైతులు వాపోతున్నారు. సాగు జరిగేపుడు నెలకు రూ.30 నుంచి రూ.50 వేల వరకు విద్యుత్ చార్జీలు చెల్లించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



రూ.10 లక్షల నష్టంతో బయటపడ్డా
సూరపనేని సురేష్, వెన్ననపూడి

పదెకరాల సాగు చేశా. ఎలాంటి ఇబ్బందులు లేకుండా రొయ్య పెరుగుతూ 40 కౌంట్‌కు వచ్చింది. 20 కౌంట్‌కు వచ్చే వరకు పెంచుదామనుకున్నాను. అయితే రేటు రోజురోజుకీ పడిపోతూ వస్తుంది. ఆ భయంతో వెంటనే పట్టుబడి చేశా. కేజీకి రూ.340 వచ్చింది. ఆ రేటు అస్సలు గిట్టుబాటు కాదు. పెట్టుబడి ఖర్చులైనా రాకపోగా ఎకరానికి రూ.లక్ష చొప్పున నష్టం వచ్చింది.

చాలా నష్టపోతున్నాం
నాదెళ్ల గౌతమ్, విజయవాడ



సముద్రతీర గ్రామాల్లో ఎకరానికి రూ.40 వేలు కౌలు చెల్లించి 15 ఎకరాల్లో రొయ్యల సాగు చేస్తున్నా. 30, 40 కౌంట్ రొయ్యలు కేజీకి రూ.100 నుంచి రూ.150 వరకు తగ్గిపోయింది. ఇంకా తగ్గిపోయే ప్రమాదం ఉందని తెలుస్తోంది. ఎకరం సాగు చేసేందుకు రూ.4లక్షల నుంచి రూ.5 లక్షలు ఖర్చవుతోంది. సీడ్, ఫీడ్, విద్యుత్ ఖర్చులు పెరుగుతున్నాయి. రాబడి తగ్గిపోతుంది.

జగన్.. దమ్ముంటే సభకు రా..!

- మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు



గొల్లపూడి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): జగన్‌మోహన్ రెడ్డి తన పాలనలో జరిగిన దుర్మార్గాలు బయటపడతాయనే భయంతోనే అసెంబ్లీకి రాకపోవడానికి కారణమని, జగన్‌కు దమ్ముంటే సభకు రావాలని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు సవాల్ విసిరారు. గురువారం టీడీపీ విజయవాడ రూరల్ గొల్లపూడి కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. జగన్ రెడ్డికి దమ్ము ధైర్యం ఉంటే జగన్ సభకు రావాలని, ప్రెస్‌క్లబ్‌కు వచ్చి మీడియా ఎదుట మాట్లాడాలని సవాల్ విసిరారు. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో మెడికల్ కాలేజీల పేరిట వేల కోట్ల రూపాయలు ఖర్చుపెట్టినట్టు చెబుతూనే, కేంద్రం ఇచ్చిన నిధుల్లో కేవలం రూ.470 కోట్లు మాత్రమే ఖర్చుచేసిన దాఖలాలున్నాయన్నారు. కేంద్రం రూ.975 కోట్లు విడుదల చేయగా, మిగతా నిధుల విషయమేంటో జగన్ సమాధానం చెప్పాలన్నారు. కన్వీనర్ కోటాలో 85 శాతం స్థానాలను 50 శాతానికి తగ్గించి, ఎన్నారై కోటాను 15 శాతం నుంచి 35 శాతానికి పెంచడం ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు అన్యాయం చేశారని విమర్శించారు. ఇటీవల జరిగిన ఒంటిమిట్ట ఉప ఎన్నికలో వైసీపీకి వచ్చిన ఘోర పరాజయం, పులివెందులలో డిపాజిట్ కోల్పోయిన పరిణామాలు జగన్‌ను అసెంబ్లీకి రానివ్వకుండా చేస్తున్నాయన్నారు.

రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి చంద్రబాబు కృషే కారణం

- ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు




తిరువూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): అప్పుల అగాధంలో ఉన్న రాష్ట్రం అభివృద్ధిలో, ఆర్థిక వృద్ధి రేటు సాధించడంలో పరుగులు పెట్టిస్తున్న ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు అన్నారు. గురువారం రాత్రి ఆయన క్యాంప్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 2025-2026 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో భారతదేశం 8.8 శాతం వృద్ధిరేటును రికార్డు చేస్తే, ఆంధ్రప్రదేశ్ 10.5 శాతం ఆర్థిక వృద్ధిని నమోదు చేసిందన్నారు. 2014-2019లో సైతం రాష్ట్ర వృద్ధిరేటును పెంచిన ఘనత కూడా చంద్రబాబుకే దక్కుతుందన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రాన్ని శ్రీలంక, ఇథియోపియా వంటి ఇతర చితికిపోయిన దేశాల పక్కన పెట్టాలని చూశారని, చంద్రబాబు మాత్రం అభివృద్ధి చెందిన సింగపూర్, అమెరికా, జపాన్ దేశాల పక్కన నిలపాలనే ధ్యేయంతో పనిచేస్తున్నట్టు వివరించారు. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన వృద్ధి రేటు రాష్ట్ర ప్రగతికి చిహ్నమన్నారు. దీనిపై బహిరంగ చర్చకు వైసీపీ నేతలు ఎవరొచ్చినా కూటమి ప్రభుత్వం తరఫున తాను సిద్ధమన్నారు.

లోకేష్ కృషి హర్షణీయం

నేపాల్‌లో చిక్కుకున్న తెలుగువారిని తిరిగి మన దేశానికి తీసుకువచ్చేందుకు మంత్రి నారా లోకేశ్ సాగించిన కృషి హర్షణీయమని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు పేర్కొన్నారు. తెలుగువారు నేపాల్‌లో ఇబ్బందులు పడుతున్న సమాచారంతో అనంతపురం పర్యటన రద్దుచేసుకొని సచివాలయానికి వెళ్లి అందరినీ సమన్వయం చేసుకుంటూ, వారిని మన దేశానికి తీసుకువచ్చిన లోకేశ్‌కు, తెలుగువారి తరుపున, నియోజకవర్గం ప్రజల తరుపున కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్టీఆర్ జిల్లాలో 4 పీఏసీఎస్‌ల చైర్మన్లు, సభ్యులు


నంబూరి హరి కృష్ణ ప్రసాద్


షేక్ రెహ్మాతుల్లా

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లాలో నాలుగు పీఏసీఎస్‌లకు ప్రభుత్వం చైర్మన్లను, సభ్యులను నియమిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. వీరులపాడు మండలం జుజ్జూరు పీఏసీఎస్ చైర్మన్‌గా షేక్ రెహ్మాతుల్లా, సభ్యులుగా చెన్నుపాటి సౌరయ్య, షేక్ జాన్ సాహెబ్, కంచికచర్ల మండలం వేములపల్లి పీఏసీఎస్ చైర్మన్‌గా ముక్కపాటి నరసింహారావు, సభ్యులుగా పాలపర్తి దిబ్బయ్య, జినెపల్లి చిన్న వెంకట కొండ, గంపలగూడెం మండలం కొణిజర్ల పీఏసీఎస్ చైర్మన్‌గా నంబూరి హరికృష్ణ ప్రసాద్, సభ్యులుగా ఇలవరపు శ్రీనివాస్, ఇలవరపు నాగేంద్రమ్మ, తిరువూరు మండలం మల్లెల పీఏసీఎస్ చైర్మన్‌గా గాడిపర్తి హనుమంతరావు, సభ్యులుగా ఆరేపల్లి నవీన్, కంటే శివ చరణ్ నియమితులయ్యారు.

నెలలో అగ్నిమాపక పరికరాల వివరాలు తెలపాలి

భవన యజమానులకు అగ్నిమాపక సేవల శాఖ సూచన

వన్‌టౌన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని భవన యజమానులు నెలలోపు వారి భవనాల్లో అగ్నిమాపక పరికరాల వివరాలను తెలపాలని రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక సేవల శాఖ సంచాలకుడు రమణ పేర్కొన్నారు. ఏదైనా సమాచారం కావాలంటే 9441236448 నంబరులో కానీ, కనెక్ట్ డీజీ ఫైర్ జీమెయిల్‌లో కానీ సంప్రదించాలని గురువారం తెలిపారు. రాష్ట్ర హైకోర్టు తీర్పు మేరకు 2021-22లో అగ్నిమాపక శాఖ జారీ చేసిన నిరభ్యంతర ధ్రువపత్రాలను సవరిస్తూ జారీ చేసిన ప్రభుత్వ గెజిట్ మేరకు అగ్నిమాపక చట్టం 1999కి అనుగుణంగా హై రైజెడ్ భవనాల్లో అగ్నిమాపక పరికరాలను ఏర్పాటు చేయటానికి సమయం ఇచ్చినట్టు వెల్లడించారు. భవన యజమానులు 30 రోజుల్లో వివరాలను అందించాలని, అదనపు సమయం కావాలంటే విజ్ఞప్తి చేసుకోవచ్చన్నారు. చట్టానికి అనుగుణంగా ఉంటే రివైజ్డ్ నిరభ్యంతర (ఎన్‌వోసీ) జారీ చేస్తామన్నారు.

విజయవాడ ఉత్సవ్ విజయవంతానికి ఏం చేద్దాం!

- నగర ప్రముఖులు, ఎన్‌జీవోలు, నేతలతో సమాలోచనలు
- పవిత్రసంగమం వద్ద కార్యక్రమాల నిర్వహణపై పరిశీలన

ఆంధ్రజ్యోతి, విజయవాడ: దసరా సందర్భంగా నిర్వహిస్తున్న విజయవాడ ఉత్సవ్ - 2025ను దిగ్విజయం చేసేందుకు అనుసరించాల్సిన విధానాలపై నిర్వాహక కమిటీ సమాలోచనలు చేస్తోంది. పదకొండు రోజుల పాటు నగర వ్యాప్తంగా నిర్వహించే కార్యక్రమాలను విజయవంతం చేయాలంటే అందరి భాగస్వామ్యం అవసరం. ఈ దిశగా నిర్వాహక కమిటీ నగరంలోని ప్రముఖులు, వివిధ రంగాల ప్రతినిధులు, ఎన్‌జీవో సంస్థల సహకారాన్ని కోరుతోంది. ఆర్థిక అవసరాలతో పాటు అన్ని రకాలుగా చేయి అందించే వారికోసం ప్రయత్నాలు చేస్తోంది.

దసరా ఉత్సవాలకు భారీ సంఖ్యలో వచ్చే వారిని ఈవెంట్లకు తీసుకువెళ్లగలిగేలా చేయటంలో ఎలాంటి విధానాలు అవలంభించాలి? విజయవాడ ఉత్సవ్ గురించి మరింత లోతుగా ప్రజల్లోకి ఎలా తీసుకు వెళ్లాలన్న అంశాలపై నిర్వాహక కమిటీ మల్లగుల్లాలు పడుతోంది. విజయవాడ ఉత్సవ్‌లో భాగంగా ఇప్పటికే ప్రధానంగా నిర్వహించే కార్యక్రమాల వేదికల వివరాలను ప్రకటించడం జరుగుతోంది. దీంతో పాటు పవిత్ర సంగమాన్ని కూడా పరిశీలిస్తున్నట్టు సమాచారం. అక్కడ ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించగలమన్న ఆలోచనలు చేస్తున్నట్టు తెలుస్తోంది. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో వీలయ్యేలా లేదు. ఎందుకంటే పవిత్ర సంగమానికి వెళ్లే ప్రధాన రోడ్డు కుంగిపోయింది. కాలువ పక్కనే నిర్మించటం వల్ల భారీగా కుంగుదల సంభవించింది. దీన్ని ఇప్పటికిప్పుడు బాగు చేయాలంటే ఖర్చు ఎక్కువ. ప్రస్తుతం ఉన్న బీటీని తొలగించి వెట్‌మిక్స్ హాట్‌మిక్స్‌తో పటిష్ఠపరిచి రోడ్డు వేస్తే తప్ప పవిత్ర సంగమానికి వాహనాల్లో చేరుకునే పరిస్థితి లేదు. దీన్ని దృష్టిలో పెట్టుకుని చూస్తే ఈ దసరా నాటికి పవిత్ర సంగమం ముఖద్వారాన్ని అభివృద్ధి చేయటం కష్టం. మరి నిర్వాహకులు ఏం చేస్తారన్నది వేచి చూడాల్సిందే!


కేంద్ర మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఆషా ప్రతినిధులు

ప్రస్తుత స్టార్ హోటళ్లకు పరిశ్రమ హోదా ఇవ్వండి

- కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌కు విజ్ఞప్తి

వన్‌టౌన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం కొనసాగుతున్న స్టార్ హోటళ్లకు కూడా పరిశ్రమ హోదా ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ స్టార్ హోటల్స్ అసోసియేషన్ (ఆషా) గురువారం కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్, సహాయ మంత్రి సురేష్ గోపీకి విజ్ఞప్తి చేసింది. న్యూఢిల్లీలో మంత్రులను కలిసిన వారిలో అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్‌వీ స్వామి, జనరల్ సెక్రటరీ చిట్టూరి ఎస్ మూర్తి ఉన్నారు. న్యూఢిల్లీలో జరిగిన 2025-26 బడ్జెట్‌కు సంబంధించి జాతీయ స్టేక్ హోల్డర్ కన్సల్టేషన్ సందర్భంగా మంత్రులకు ఈ విజ్ఞప్తి చేశారు. కొత్త ప్రాజెక్టులకు మాత్రమే పరిశ్రమ హోదా ఇవ్వటాన్ని పరిమితం చేయకుండా ఇప్పటికే కొనసాగుతున్న స్టార్ హోటళ్ల కూడా పరిశ్రమ హోదా ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో చాలెంజ్ మూడ్‌లో 50 ప్రపంచస్థాయి పర్యాటక ప్రదేశాల అభివృద్ధికి డెస్టినేషన్ మేనేజ్‌మెంట్ మెరుగుదలకు చర్చ జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున ఏపీ టూరిజం సీఈవో కటా ఆమ్రపాలి మాట్లాడుతూ లక్ష్యసాధనలో కేంద్ర ప్రభుత్వంతో తమ భాగస్వామ్యం ఉంటుందని తెలిపారు. హోటళ్ల అభివృద్ధికి సంబంధించి పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ ఏకగవాక్ష క్లియరెన్స్‌లు, తదితర అనేక అంశాలపై ఈ సమావేశంలో చర్చించారు.

జీఐఎస్ అండ్ ఆర్‌ఎస్‌ఏ టెక్నాలజీ వినియోగంలో సీఆర్‌డీఏకు ప్రతిష్ఠాత్మక అవార్డు

కలెక్టరేట్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ క్యాపిటల్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీకు జీఐఎస్-జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టం, ఆర్‌ఎస్‌ఏ-రిమోట్ సెన్సింగ్ అసిస్టెంట్ టెక్నాలజీల వినియోగంలో విశేష ప్రతిభ కనబరిచినందుకు ప్రతిష్ఠాత్మకమైన బెస్ట్ యూజర్ ఆర్గనైజేషన్ అవార్డు లభించింది. హైదరాబాద్‌లో సెప్టెంబరు 10న పార్క్ హోటల్‌లో జరిగిన ఇస్రీ ఇండియా సంస్థ వార్షిక యూజర్ కాన్ఫరెన్సులో ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ అజేంద్ర కుమార్ ఈ అవార్డును ఏపీసీఆర్‌డీఏ ప్లానింగ్ విభాగ డైరెక్టర్ బీ సురేష్ కుమార్, జీఐఎస్, ఆర్‌ఎస్‌ఏ విభాగ సిబ్బందికి అందజేశారు. ఏపీసీఆర్‌డీఏ పట్టణ ప్రణాళిక, అమరావతి నగర నిర్మాణం, అభివృద్ధిలో జియోస్పేషియల్ టెక్నాలజీని సృజనాత్మకతతో సమర్థవంతంగా వినియోగిస్తున్నందున ఈ అవార్డు అందజేశారు. ఇది డేటా ఆధారిత సేవలు, పట్టణాభివృద్ధికి అత్యాధునిక జీఐఎస్, ఆర్‌ఎస్‌ఏ టెక్నాలజీని వినియోగించడంలో సీఆర్‌డీఏ నిబద్ధతను ప్రతిబింబిస్తోంది.



వార్షిక యూజర్ కాన్ఫరెన్సులో పాల్గొన్న సంస్థ ప్రతినిధులు

ఆంధ్రజ్యోతి
నవ్య
నివేదన
శుక్రవారం • 12 సెప్టెంబరు 2025

సహజయోగ

ఏకాదశ రుద్రశక్తులు

మహా విష్ణువు దశావతారాల్లో కల్కి అవతారం ఆఖరిది అనీ, సదాశివుడి పదకొండు రుద్ర శక్తులతోనే ఈ కల్కి అవతారం రాబోతున్నదనీ, ఆ అవతారమే దుష్ట శక్తులను, దైవ వ్యతిరేక కార్యాలు చేసేవారని సంహరిస్తుందనీ ప్రాచీన పురాణ గ్రంథాలు వివరించాయి. భౌతిక స్థాయిలో ఆ ఏకాదశ రుద్రశక్తులు మన అంతర్గత సూక్ష్మ నాడీ వ్యవస్థలో... నుదుటి మధ్య భాగంలో ఉన్న ఆజ్ఞా చక్రం పైభాగంలో స్థిరపడి ఉంటాయి. సృష్టి పరిణామ క్రమంలో మానవుల నుదుటి భాగం సృష్టి అంత సులువుగా జరగలేదు. ఎంతో ప్రత్యేకమైన, సుదీర్ఘమైన ఆధ్యాత్మిక ప్రక్రియ ద్వారా ఇది సంభవించింది. దీనిలో ఎంతో లోతైన అంతరార్థం ఉంది.



ప్రకృతిలో కాలానుగుణంగా అన్నీ సరైన రీతిలో సక్రమంగా జరుగుతాయి. ఇదంతా అందంగా జరిగే నిరంతర ప్రక్రియ. కానీ మనిషి అనాలోచితమైన మూర్ఖ విధానాలతో ప్రకృతికి భంగం కలుగుతుంది. ప్రకృతిని నాశనం చేసే దుష్ట శక్తులను ఏకాదశ రుద్రులు నాశనం చేస్తారు. ప్రస్తుత కాలంలో మానవులు భ్రాంతి, భ్రమలకు లోనై జీవిస్తున్నారు. కార్యాచరణలో విఫలమైనప్పుడు... తమకంటే ఇతరులు గొప్పగా ఉన్నారని భావిస్తారు. వేరొకరితో పోల్చుకొని, వారితో సరితూగలేకపోతున్నామనే వ్యథ, అసూయ, కోపోద్రేకాల వల్ల నిగ్రహం కోల్పోతారు. ఆ స్వభావం పెరిగి పెద్దదై... భగవత్ వ్యతిరేక శక్తిగా మారుతుంది. ఇలాంటి శక్తులు బలపడి, మానవులకు అర్థం కాని రీతిలో చాలా సూక్ష్మంగా పని చేస్తాయి. వైరస్‌లా అనుక్షణం వినాశనం సాగిస్తూ ఉంటాయి. మరి మనం ఏం చేయ్యాలి? ఆత్మ సాక్షాత్కారం ద్వారా దైవికంగా పొందిన చైతన్య తరంగాలతో ప్రకృతిని మీరు రక్షించగలరు. ఆత్మ సాక్షాత్కారం పొందిన తరువాత మనలోనే ఉన్న ఏకాదశ రుద్రశక్తులు ఎలా పనిచేస్తాయనేది తెలుస్తుంది. కానీ ఈ శక్తిని మనలో పెంపొందించుకోవడానికి ముందు... మనం నిర్మాణాత్మక స్థితి వైపు వెళ్తున్నామా? లేక వినాశనం వైపు వెళ్తున్నామా? అనే విషయాన్ని మనం ఆత్మ విమర్శ చేసుకోవాలి.

నేటి ప్రపంచంలో ఎన్నో చెడ్డ విషయాలు, ప్రలోభాలు మనలో దుష్ట స్వభావాన్ని ప్రేరేపించి తప్పులు చేయిస్తున్నాయి. మనశ్శాంతి లేకుండా చేస్తున్నాయి. ఆరోగ్యాన్ని నాశనం చేస్తున్నాయి. మనలో ఉన్న ఏకాదశ రుద్రశక్తిని జాగృత పరుచుకోవడమే దీనికి పరిష్కారం.. ఆత్మసాక్షాత్కారం ద్వారా మనలోని కుండలినీ శక్తి జాగృతమైనప్పుడు... ఆ ఏకాదశ రుద్ర శక్తులు నుదుటిపైన, శిరస్సు చుట్టూ నిలబడి మనల్ని కాపాడతాయి. సహజయోగ సాధన ద్వారా మనలోని ఆ శక్తులను జాగృతం చేసుకోవడం ద్వారా... దుష్ట శక్తుల ప్రభావం మన మీద పడకుండా జాగ్రత్త పడవచ్చు.



డాక్టర్ పి. రాకేష్,
8988982200
'పరమ పూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి,
సహజయోగ ట్రస్ట్', తెలంగాణ


విశేషం



కృతజ్ఞతా పక్షం...

మహాలయం

బిడ్డలు పుట్టాలని తల్లితండ్రులు గుళ్ళూ, గోపురాలు తిరుగుతారు, ఎత్తైన కొండలు ఎక్కి దేవతలకు మొక్కుకుంటారు. వారి ఋణం తీర్చుకోవడం మన ధర్మం. అలాగే మనం, మన కుటుంబం అధ్వాన్న స్థితిలో ఉన్నప్పుడు ఆపన్న హస్తాన్ని అందించి, ఒక స్థాయికి చేరుకోవడానికి దోహదం చేసినవారికి, తిట్టి, అవసరమైతే కొట్టి.. నాలుగు అక్షరాలు మనకు ఒంటపట్టేలా చేసి, నాలుగు రాళ్ళు సంపాదించుకోవడానికి మార్గం వేసిన దైవసమానులైన గురువులకు, మన బంధువులకు... ఇలా ఏదో విధంగా మనకు సాయం చేసినవారందరికీ కృతజ్ఞతలు సమర్పించుకోవాల్సిందే. అలా చేయని పక్షంలో మనం కృతఘ్నులం. మనం ధర్మాన్ని నిర్వర్తించుకోవడానికే పెద్దలు ఏడాదిలో అయిదుసార్లు వారిని స్మరించుకొనే ఏర్పాటు చేశారు.



అయిదు విధానాలు

వ్యక్తి మరణించిన ప్రతి 'అబ్ద' కాలానికి (సంవత్సర కాలానికి, అలా ప్రతి సంవత్సరం) వారికి కృతజ్ఞతలు ప్రకటించుకొనే విధానాన్ని 'ప్రత్యాబ్దికం' (ప్రతి+ఆబ్దికం) అన్నారు. ఇక జీవనది ప్రవహిస్తూ ఉండే ప్రదేశానికి వెళ్ళినప్పుడు... మన పెద్దలను గుర్తు చేసుకుంటూ ఆచరించే ఇదే విధానాన్ని 'తీర్థ శ్రాద్ధం' అంటారు. గయ లాంటి తీర్థ ప్రదేశాలకు వెళ్ళినప్పుడు చేసేది అదే. వీటితోపాటు మకర సంక్రమణం (ఉత్తరాయణం... జనవరి పధ్నాలుగు/పదిహేను), కర్కాటక సంక్రమణం (దక్షిణాయనం... జూలై పదహారు/పదిహేడు) రాగానే... ఆ రోజుల్లో నిర్వహించుకొనే ఇదే కృతజ్ఞతా సమర్పణ కార్యక్రమాన్ని 'సంక్రమణ శ్రాద్ధం' అంటారు. అందుకే సంక్రాంతి మరుసటి రోజైన కనుము (కనుమ అనకూడదు) నాడు 'పెద్దలకు పెట్టుబడులు' అనే కార్యక్రమాన్ని నిర్దేశించారు. అందుకే 'కనుము రోజున కాకైనా కదలదు' అంటూ ప్రయాణాలు పెట్టుకోవద్దన్నారు. ఇక ఆశ్వయుజ మాసంలో లక్ష్మీదేవి పుట్టిన అమావాస్య నాడు పెద్దల కోసం శ్రాద్ధ కార్యక్రమం నిర్వహించుకొనే విధానం కూడా ఉంది. ఇది తెలియని వారికి, మరచిపోయినవారికి 'లక్ష్మీ పూజనాడు తద్దినమా?' అనిపిస్తుంది. వీటికి అదనంగా భాద్రపద మాసంలో పౌర్ణమికి మరుసటి రోజు నుంచి 15 పాటు కూడా పెద్దలకు కృతజ్ఞతలను సమర్పించుకోవడం అనే గొప్ప పద్ధతి మనకు ఉంది. దాన్ని 'మహాలయ పక్షం' అంటారు. ఆ కాలంలో ఆచరించేది మహాలయ శ్రాద్ధం.

ఎలా చేయాలి?

ఆదౌ పితా తథా మాతా సాపత్నీ జననీ తథా... తండ్రి, తాత, ముత్తాత, తల్లి, ఆమె అత్త, ఆమెకు అత్తా... ఇలా బంధుగణంలో మరణించినవారు ఎవరెవరు ఉన్నారో వారి పేర్లను ఉచ్చరిస్తూ, వారు మనకు చేసిన సహాయాలను గుర్తు చేసుకుంటూ ఒక్కొక్క పిండాన్ని సమర్పించాలి. వారితోపాటు మనకు చేయూత అందించినవారికి, గురువులకు, చివరిగా భీష్మ పితామహులకు, ఈ వ్యవస్థను మనకోసం ఏర్పాటు చేసిన ఆదిశంకరులకు కూడా పిండ నివేదన చేయాలి. శరీర ఆరోగ్యం లేని వారు స్వయంపాకాన్ని ఇవ్వవచ్చు. రెండోది... బియ్యపు పిండితో పిండాలను చేసి సమర్పించవచ్చు. మూడోది శాస్త్రోక్తంగా... అన్నశ్రాద్ధాన్ని ఆచరించాలి. ఆబ్దికం నాడు చేసే వంటకాలతో ఆ కార్యక్రమాన్ని చేయించిన వారికి భోజనం పెట్టాలి. అలాగే ఏవో పనులు ఉన్నాయని ఈ కార్యక్రమాన్ని పొద్దున్నే ముగించేయకూడదు. పితృదేవతలది 'అపర-అహ్ణ' (అపరహ్ణ) కాలం (రోజులో రెండవ సగం... అంటే మధ్యాహ్నం పన్నెండు దాటాక). కాబట్టి అప్పుడే పెట్టాలి. "మహాలయాన్ని ఆచరించడం మాకు కష్టం" అనుకోవద్దు. మీకు జ్వరమో, ఆపదో వచ్చినప్పుడు మీ తల్లితండ్రులు మాకు కుదరదని అనుకోలేదు కదా? అలాగే... 'మనం ఇక్కడ ఉండి చేసినవి మన పితృదేవతలకు చేరుతాయా?' అనే సందేహం కూడా వద్దు. "విదేశాల్లో ఉన్నవారికి భారతీయ రూపాయల్లో పంపుతాం. వారికి అది రూపాయిల్లో చేరదు... ఆ దేశపు కరెన్సీలో చేరుతుంది. ఇదీ అంతే!" అని కంచి పరమాచార్యులవారు ఒక సందర్భంలో చెప్పారు.

దీనివల్ల ఏం లాభం?

'ఇలా చేయడం వల్ల లాభం ఏమిటి?' అని కొందరు అనుకుంటారు. 'పితృశాపాలు' అనే మాట మనం వింటూ ఉంటాం. గతించి, పైలోకాలకు వెళ్ళిన వారు అక్కడినుంచి మన మీద కసి, పగ, ద్వేషం లాంటివి చూపించరు. కాబట్టి 'పితృశాపం' అంటే పితృదేవతలు పెట్టే శాపం కాదు. మన తాతో, ముత్తాతో ఎవరికో ఘోరమైన అపచారం చేసినా, ఎవరి దగ్గరైనా ఋణాన్ని తీసుకొని దాన్ని తిరిగి ఇవ్వకపోయినా... అది వారితో చెల్లిపోదట. ఆ వంశంలో అందరికీ... వారి ఆస్తి సంక్రమించినట్టు... ఇది కూడా సంక్రమిస్తూనే ఉంటుందట. అందుకే అన్నీ ఉండి సంతానం లేకపోవడం, ఎప్పుడూ ఏదో అనారోగ్యంతో ఉండడం, ఏదీ కలిసిరాకపోవడం, బుద్ధిహీనత, జడత్వం, మూర్ఖ లాంటి వాటితో బాధపడుతూ... ఆనందానికి దూరమవుతారు. దానికి సరైన పరిష్కారం మహాలయ శ్రాద్ధాన్ని పెట్టడమేనని పెద్దలు చెప్పారు. తమ వారసులకు ఏయే కోరికలు అపరిష్కృతంగా ఉన్నాయో వాటిని తీర్చి వెళ్ళాలనే ఉద్దేశంతో... పితృదేవతల ఆత్మ సూక్ష్మ శరీరంతో ఈ పదిహేను రోజులపాటు భూలోకానికి ప్రత్యేకంగా వస్తారు. కనిపించని ఆ ఆత్మ శరీరాలకు మనం కనిపిస్తాం. వారు చేసిన సహాయాలను కృతజ్ఞతాపూర్వకంగా స్మరించుకుంటూ... ఒక్క రోజు వారికి కేటాయించగలిగితే వాళ్ళు పరమానందాన్ని పొందుతారు. మన కడగండ్లను తీర్చి మరీ పై లోకానికి తిరిగి వెళతారు. కాబట్టి ఈ పదిహేను రోజుల కాలం ఎంతో శ్రేష్ఠం, మరెంతో ముఖ్యం.

• డాక్టర్ మైలవరపు శ్రీనివాసరావు

సద్బోధ

దేవునికైనా అసాధ్యమే



వర్ధమాన మహావీరుడు అహింసా మూర్తి. ఆయన ప్రభావం పశుపక్షాదుల మీద కూడా ఉండేది. ఆయన వెళ్ళిన ప్రాంతంలో పరిసరాల్లో ప్రశాంతత ఏర్పడేది. నదుల్లో నీరు తాగడానికి వచ్చిన పులులు, సింహాలు, గోవులు, జింకలు పక్కపక్కనే సంచరించేవి. మహావీరుడి సామీప్యం క్రూర జంతువులను సైతం సాధుజంతువులుగా మార్చేది. జంతువులు, జనులు అక్కడ నిర్భయంగా సంచరించగలిగేవారు.

విచిత్రం ఏమిటంటే... ఎంతటి మహనీయులైనా ఎన్నో ఏళ్ళుగా తమ చుట్టూ ఉన్న కొందరిలో ఏర్పడిన అసూయా ద్వేషాలను, కామ క్రోధాలను రూపు మాపలేరు. వారిలో ఆశలను, కోరికలను నిర్మూలించలేరు. మహావీరుడి చరిత్రలోనూ ఇలాంటి ఉదంతం కనిపిస్తుంది. ఆయనకు జమాలి అనే అల్లుడు ఉండేవాడు.

జమాలి ఆయన శిష్యుడు కూడా. మహావీరుడి వారసుడయ్యే హక్కు తనకే ఉందని జమాలి భావించేవాడు. మహావీరుడికి ఎందరో శిష్యులు ఉండేవారు. వారిలో రాజులు కూడా ఉన్నారు. కాబట్టి మహావీరుడి ఆధ్యాత్మిక సామ్రాజ్యం ఎంతో విశాలమైనది. మహావీరుడి తరువాత ఆయన శిష్యులందరికీ తనే నాయకుడు కావాలనే కాంక్ష జమాలిలో ఉండేది. మహావీరుడి అంతిమ దినాల్లో చాలాసార్లు తనను తదుపరి తీర్థంకరుడిగా, వారసుడిగా ప్రకటించాలని ఆయనను ఒత్తిడి చేశాడు. కానీ మహావీరుడు అందుకు సమ్మతించలేదు. "అది వీలు కాదు. ప్రస్తుత సృష్టిలో నేనే చివరి తీర్థంకరుణ్ణి. రాబోయే సృష్టిలో తీర్థంకరుడు అయ్యే యోగ్యత, అర్హత (మహావీరుడి ముఖ్య శిష్యుడు) గౌతమ గణధరుడికి ఉంది. కాబట్టి నువ్వు నా అల్లుడివి, శిష్యుడివి అయినా నిన్ను నేను నా వారసుడిగా ప్రకటించలేను" అని మహావీరుడు నిష్కర్షగా చెప్పాడు. జమాలి దీన్ని అవమానంగా భావించాడు. మహావీరుడి శిష్యుల్లో చీలికలు తెచ్చాడు. అయిదువందల మంది శిష్యులతో బయటకు వెళ్ళిపోయాడు. ఆ తరువాత మహావీరుణ్ణి నిందలపాలు చేశాడు.

క్రూర జంతువులను, ఎందరో వ్యక్తులను మార్చగలిగిన మహావీరుడు తన అల్లుణ్ణి, శిష్యుణ్ణి ఎందుకు మార్చలేకపోయాడు? ఎందుకంటే మనం పరివర్తన చెందడానికి సిద్ధంగా లేకపోతే... ఏ మహనీయుడూ మనల్ని ఉద్ధరించడు. అది దేవుడికి కూడా సాధ్యం కాదు. అందుకే "నిన్ను నీవే ఉద్ధరించుకోవాలి" అంటాడు 'భగవద్గీత'లో శ్రీకృష్ణ పరమాత్మ.

• రాచమడుగు శ్రీనివాసులు

దైవమార్గం

విమోచనే లక్ష్యంగా...

సువార్తికుడైన సెయింట్ లూకా పూర్తి పేరు లూకానుస్. అతను యూదా మతానికి సంబంధం లేని ఒక గ్రీకు కుటుంబీకుడు. ప్రాచీన సిరియాలోని అంటియోచ్‌కు చెందిన వ్యక్తి. అతనిది వైద్య వృత్తి అని చెబుతారు. 'లూకా' అంటే ఇటలీ దేశంలోని లూకానియా ప్రాంతానికి చెందిన పేరు. ఆ పదానికి 'కాంతి' అనే అర్థం కూడా ఉంది లూకా పేరు... లాటిన్‌లో 'లూకాస్' అని వినిపిస్తూ ఉంటుంది. అరుణోదయంలో పుట్టినవారిని 'లూసియాస్' అంటారట. ఏ విధంగా చూసినా... ఆ పేరుకు ప్రకాశం అనే అర్థం స్థిరంగా కనిపిస్తోంది.

లూకా... క్రీస్తు జీవన రేఖలను చిత్రించిన మహా రచయిత. అంతేకాదు, అపోస్తుల (అపోస్తలుల) కార్యాలన్నిటినీ సుస్పష్టంగా రాశాడు. నూతన నిబంధనలోని రెండు ప్రధాన గ్రంథాలకు (లూకా సువార్త, అపోస్తుల కార్యాలు) కర్తృత్వం వహించడం అంటే మాటలు కాదు. 'లూకా సువార్త 24 అధ్యాయాల గ్రంథం. 'అపోస్తుల కార్యాలు' 28 అధ్యాయాలు కలిగిన గ్రంథం. ఒక గ్రంథాన్ని రాయడం వేరు, ఎక్కడా ఏ విధమైన భావ వైరుధ్యం లేకుండా రాయడం వేరు. లూకా గ్రంథంలో మానవ విమోచనే ప్రధాన లక్ష్యంగా కనిపిస్తుంది. యూదేతరులను, తరతరాల అబ్రహామీయులను, పేదలను, మహిళలను లూకా ప్రత్యేక కోణంలో చూపించాడు. క్రీస్తును తండ్రి (దేవుడి) మాటను నెరవేర్చే వ్యక్తిగా ప్రదర్శించాడు. ప్రార్థనా సంస్కృతిని, దాని గొప్పతనాన్ని చిత్రీకరించాడు. మిగతా సౌవార్తికుల మాదిరిగానే ఉపమానాలతో నిండిన కథలను ప్రకటించాడు. క్రీస్తు చేసిన 26 అద్భుతాలను లూకా పేర్కొన్నాడు. దెయ్యాలను వెళ్ళగొట్టడం నుంచి, రోగులను స్వస్థత పరచడం వరకూ, అలాగే ఏసు స్వీయమైన దివ్య శక్తుల నుంచి దైవ మహిమను నిరూపించడం కోసం ప్రకటించిన విశేషాల వరకూ అన్నిటినీ వివరించాడు. ఈ 26 ఉపమాన కథల ద్వారా ఆయన సందేశాన్ని సుగమం చేశాడు. లూకా చిహ్నం వృషభం.

• డాక్టర్ యం. సోహినీ బెర్నార్డ్
9866755024



గీతాసారం


సమదృష్టి



"జ్ఞానంతో, విజ్ఞానంతో సంతృప్తుడైన (జ్ఞాన విజ్ఞాన తృప్తాత్మా) వ్యక్తి దేనికీ చలించకుండా ఉంటాడు. అతను తన ఇంద్రియాలను జయిస్తాడు. అతనికి మట్టి పెళ్ళ, రాయి, బంగారం అన్నీ ఒకటే. అతడే యోగి" అని 'భగవద్గీత'లో శ్రీకృష్ణుడు చెప్పాడు. ఆయన చెప్పినది అర్థం చేసుకోవడానికి అవగాహన, జిజ్ఞాస, జ్ఞానం, అనుభవం మనకు సాయపడతాయి. 'జ్ఞానం' అంటే స్వీయ అవగాహన. దాన్ని సాధించిన వ్యక్తి సంతృప్తిని పొందుతాడు. విజ్ఞానాన్ని 'శాస్త్రం' (సైన్స్) అని కూడా పిలుస్తారు. విషయాలు, వ్యక్తుల పట్ల ఉత్సుకత అని చెప్పుకోవచ్చు. ఈ ఉత్సుకతలకు సమాధానాలు సేకరించడం అనేది ఎల్లప్పుడూ గతానికి చెందిన జ్ఞానం సంపాదించడం. అది పుస్తకాల్లో లభిస్తుంది. అంతర్గతంగా మనం చేసే ప్రయాణానికి ప్రారంభదశలలో ఈ ఉత్సుకత సాయపడుతుంది. కానీ దానికి పరిమితులు ఉన్నాయి. సైన్స్ కూడా కణాలు, తరంగాలకు సంబంధించిన అనిశ్చితమైన సూత్రాలు, ద్వంద్వత్వాల లాంటి పరిమితులతో సంతృప్తి చెందాల్సి వచ్చింది.

మరోవైపు, అస్తిత్వం లేదా ఉనికి... మార్పు లేనిది. అది శాస్త్రీయపరంగా, నిరంతరం అభివృద్ధి చెందుతూనే ఉంటుంది. ఉత్సుకత సమాధానాల కోసం ఎదురుచూస్తూ ఉంటుంది. కానీ అస్తిత్వం అనేది మనలో ప్రతి ఒక్కరికీ కలిగే అనుభవాలతో ప్రతిస్పందిస్తుంది. వాటిని పంచుకోవడానికి మార్గం లేదు. ఒక వ్యక్తి జ్ఞానపరంగా సంతృప్తి చెందాడంటే... అతని అన్ని ప్రశ్నలకూ సమాధానాలు దొరికాయని కాదు. అతనిలో ఉత్సుకత తగ్గిపోయిందని అర్థం. అప్పుడు అతను సాక్షిగా ఉంటాడు. సాక్షిగా ఉండడం అంటే... ఏ అంశం మీదా ఎటువంటి తీర్పులు చెప్పకుండా, అంచనాలు లేకుండా... వస్తువులు, వ్యక్తులు, పరిస్థితుల విషయంలో... ఉన్నది ఉన్నట్టుగా అంగీకరించడం. ఇది 'ఎంపికలేని అవగాహన' స్థితి.

చలించకుండా ఉండడం, ఇంద్రియాలను జయించడం గురించి కృష్ణుడు వివరంగానే చెప్పాడు. మనల్ని ఎవరైనా ప్రశంసించినప్పుడు... దానికి సంపూర్ణంగా అర్హులమని భావిస్తాం. విమర్శలు ఎదురైనప్పుడు కోపగించుకుంటాం. ప్రశంస అనేది తియ్యని విషం అని, ఒక ఉచ్చు అని గ్రహించినట్టయితే... ప్రశంసలను, విమర్శలను అధిగమించే దిశగా మన ప్రయాణాన్ని సులువుగా ప్రారంభించవచ్చు. బంగారాన్ని, మట్టి ముద్దను, రాతి ముక్కను ఒకే విధంగా పరిగణించే దశకు చేరుకోవడం ద్వారా... అన్నిటినీ సమానంగా చూసే స్థితిని సాధించినప్పుడు మనం దేనికీ చలించకుండా ఉంటాం.



కె.శివప్రసాద్

దేహమే దేవాలయం

"దేహమే దేవాలయం. అందులోని జీవుడే సనాతనుడైన భగవంతుడు. కాబట్టి అజ్ఞానాన్ని తొలగించి, సోహంభావ బుద్ధితో ('పరమాత్మే నేను' అనే భావనతో) ఆయనను పూజించాలి" అని 'స్కందోపనిషత్తు' చెబుతోంది. అయితే "పరమాత్మ తాలూకు దేహమే దేవాలయం" అంటోంది 'శ్రీప్రశ్న సంహిత'. దేవాలయంలోని భాగాలను దేహంలోని భాగాలతో పోల్చడాన్ని ఈ క్రింది శ్లోకాలలో గమనించవచ్చు.

గర్భగేహం శిరఃప్రోక్తం శిఖా శిఖరముచ్యతే
నాసికా శుకనాసీస్యాత్ అంతరాలంగలంస్మృతం
త్యమండపం దేహమిత్య ప్రాకారః కర ఉచ్యతే
గోపురం పాద ఇత్యుక్తం దేవస్థానం ప్రకథ్యతే
(ఈశ్వర సంహిత)

భగవంతుడి గర్భగృహం శిరస్సుగా, శిఖరం శిఖా స్థానంగా, శిఖరం పైన ఉండే శుక నాసిక దేవుని ముక్కుగా, అంతరాలము (మధ్య ప్రదేశం) కంఠంగా, మండపాలు శరీరంగా, ప్రాకారాలు చేతులుగా, గోపురాలు పాదాలుగా 'ఈశ్వర సంహిత' వర్ణించింది. కొద్దిపాటి తేడాలతో మరి కొన్ని ఆగమాలు కూడా ఈ విషయాన్ని తెలిపాయి. "ఏవయేష హరి స్సాక్షాత్ ప్రాసాదేత్వేన సంస్థితః... ఆలయ రూపంలో సాక్షాత్తూ శ్రీహరి రూపం ఉంటుంది. కాబట్టి దేవాలయంలోని ప్రతి నిర్మాణాన్ని పవిత్రమైనవిగా భావించి నమస్కరించాలి" అంటోంది 'హయశీర్ష సంహిత'.

దేవాలయ ప్రతిష్ఠాఫలం

దేవాలయాలను నిర్మించడం, వాటిలో విగ్రహాలను ప్రతిష్ఠించడం, నిత్య, నైమిత్తిక, బ్రహ్మోత్సవాది కార్యక్రమాలు... ఇవన్నీ పూర్వ కాలంలో ఆ దేశపు రాజు లేదా రాజ ప్రతినిధి ప్రత్యక్ష పర్యవేక్షణలో జరిగేవి. ఉత్సవాలు అవిచ్ఛిన్నంగా జరగడం కోసం ఎన్నో ధనరాశులను, మాన్యాలను ఆలయాలకు వారు సమర్పించేవారు. అయితే ఇదంతా గతం. ఆధునిక కాలంలో రాజులు, రాచరిక వ్యవస్థ అంతరించిపోయాయి. ఇప్పటి కాలంలో భక్తులు ఒక కూటమిగా ఏర్పడి... తమతమ ప్రాంతాలలో కొత్త దేవాలయాల నిర్మాణం, పాత దేవాలయాల విషయంలో జీర్ణోద్ధారణ, ఉత్సవాల నిర్వహణ లాంటివి చేపడుతున్నారు. దేవాలయాల నిర్మాణం చేసినవారికి, అందులో పాలు పంచుకున్నవారికి కలిగే పుణ్య ఫలాలను వివిధ ప్రాచీన గ్రంథాలు వివరించాయి. దేవాలయాల నిర్మాణం గొప్ప పుణ్యకార్యం అని, ప్రతిమను కూడా నిర్మించి ప్రతిష్ఠిస్తే మరింత పుణ్యఫలం కలుగుతుందని, సుఖ సంపదలు లభిస్తాయని, పాపాలు తొలగిపోతాయని, అభీష్టాలు నెరవేరుతాయని, పవిత్ర యజ్ఞఫలాలు, సకల పుణ్యతీర్థాలలో స్నానం చేసిన ఫలం, అన్ని దానాలు చేసిన ఫలం కలిసి లభిస్తాయని 'అపరాజిత పృచ్ఛ', 'ప్రాసాద మంజరి', 'పురుషోత్తమ సంహిత' లాంటి గ్రంథాలు చెప్పాయి. ఐశ్వర్యం, విజయం, పుణ్యఫలం, ఆయుష్షు, ఆరోగ్యం, సర్వశత్రు క్షయం, సర్వోపద్రవ నాశనం, ఇహలోక సౌఖ్యం, అనంతరం మోక్షం పొంది భగవంతుని సాయుజ్యం లభిస్తాయని 'కపర్దీ సంహిత', ఆలయంలోని ఏ భాగాన్నైనా భక్తితో, ప్రీతితో నిర్మిస్తే భగవంతుడి సామీప్యాన్ని పొందుతారని 'సుమూర్తార్చనాధికారం' అనే గ్రంథం, కలప, శిల, లోహం, మట్టి లాంటి ద్రవ్యాలతో ఆలయ నిర్మాణం చేసిన వారు అనంత పుణ్యఫలాలు పొందుతారని, ప్రతినిత్యం యజ్ఞం చేస్తే ఏ ఫలితం లభిస్తోందో దానికి సమానమైన ఫలం లభిస్తుందని, తాము మాత్రమే కాకుండా పూర్వీకులు, తదుపరి తరాలవారు సద్గతి పొందుతారని భృగు మహర్షి విరచితమైన 'ప్రకీర్ణాధికారం' స్పష్టం చేశాయి. ఈ విధంగా మన మహర్షులు అందించిన ఆగమాలు, శిల్ప శాస్త్రాలు దేహమే దేవాలయం అని పేర్కొంటూ... ఆలయాల విశిష్టతను, ఆలయాలు నిర్మించేవారికి, దానికి సహకరించేవారికి లభించే పుణ్య ఫలాలను వివరించాయి. ఆలయాలు సర్వతోముఖాభివృద్ధి సాధిస్తే ధర్మం వికసిస్తుంది. అన్ని కళలకు నిలయమైన ఆలయం సకల జగతిని సస్యశ్యామలంగా ఉంచుతుంది.

తెలుసుకుందాం



• దగ్గుపాటి నాగవరప్రసాద్ స్థపతి
9440525788

నమాజ్... పవిత్ర విధి

అల్లాహ్‌పైన, దైవప్రవక్తపైన భక్తి విశ్వాసాలను చూపించడానికి అత్యంత ఆవశ్యకమైన విధి నమాజ్. దైవారాధనలో నమాజ్ పాత్ర ఎంతో కీలకమైనది. ప్రతిరోజూ అయిదుసార్లు (ఫజర్, జొహర్, అసర్, మగ్రిబ్, ఇషా) చేయాల్సిన విధిగా నిర్దేశితమైన నమాజ్... ఇస్లాం ధర్మం మూల స్తంభాలలో ఒకటి. "నమాజ్ ద్వారా సహాయం పొందండి. నమాజ్ నిస్సందేహంగా కష్టతరమైన కార్యమే. కానీ అల్లాహ్‌కు విధేయులైన దాసులకు ఇది ఎంతమాత్రం కష్టం కాదు. మీ కుటుంబ సభ్యులను నమాజ్ చేయాల్సిందిగా ఆజ్ఞాపించండి. మీరు కూడా దాన్ని పాటించండి. మీ ప్రభువును స్తుతించడంతోపాటు ఆయన పవిత్ర నామాన్ని జపిస్తూ ఉండండి. సూర్యోదయానికి ముందు, సూర్యాస్తమయానికి ముందు, రాత్రి సమయంలో కూడా ఆ పవిత్ర నామాన్ని జపించండి" అని వివిధ సందర్భాలలో అంతిమ పవిత్ర గ్రంథమైన దివ్య ఖుర్ఆన్ పేర్కొంది.

"ఎవరైతే క్రమం తప్పకుండా సక్రమంగా నమాజ్ చేస్తారో... ప్రళయ దినాన ఆ నమాజ్ అతని కోసం జ్యోతిగా, అతని విశ్వాసానికి నిదర్శనంగా, ముక్తి సాధనంగా మారుతుంది. ఎవరు నిబద్ధతతో, ఏకాగ్రతతో నమాజ్ చేయరో వారు అవిశ్వాసులుగా జమ అవుతారు" అని దైవప్రవక్త మహమ్మద్ తెలిపారు. "ఒక వ్యక్తి ఇంటి ముందు నది ప్రవహిస్తోంది. అతను ఆ నదిలో రోజూ అయిదుసార్లు స్నానం చేస్తూ ఉంటాడు. ఇక అతని శరీరం పైన మలినం ఉంటుందా?" అని తన అనుచరులను ఆయన ప్రశ్నించారు. "ఎలాంటి మలినం ఉండదు" అని వారు సమాధానం చెప్పారు. "రోజుకు అయిదుసార్లు నమాజ్ చేసే మనిషి స్థితి కూడా అలాగే ఉంటుంది. అయిదు వేళలా నమాజ్ చేసిన దాసుని పాపాలను అల్లాహ్ క్షమిస్తాడు" అని దైవప్రవక్త స్పష్టం చేశారు.

సందేశం




నమాజ్ వల్ల అనేక లాభాలు ఉన్నాయి.. అల్లాహ్‌తో బాంధవ్యాన్ని నమాజ్ బలోపేతం చేస్తుంది. మనో ధైర్యాన్ని పెంచుతుంది. ఆత్మవిశ్వాసాన్ని బలోపేతం చేస్తుంది. నమాజ్ నియమం ప్రకారం చేసేవారిలో క్రమశిక్షణ, సహనం, చక్కగా మాట్లాడే పద్ధతి, ఉత్తమమైన నడత, మంచి దృక్పథం, నిజాయితీ లాంటి సద్గుణాలు వృద్ధి చెందుతాయి. సమూహంగా నిర్వహించే నమాజ్ సామాజిక ఐక్యతను, సోదర భావాన్ని, సమానత్వాన్ని ప్రోత్సహిస్తుంది. ఎలాంటి భేదాలు లేకుండా అందరూ ఒకే వరుసలో నిలబడి నమాజ్ చేయడం... ఇస్లాం సార్వత్రికతకు చిహ్నం. నమాజ్... ఇస్లాం ఆరాధనలో ప్రధానాంశం. కాబట్టి నమాజ్‌ను అందరూ సక్రమంగా, పూర్తి ఏకాగ్రతతో ఆచరించాలి. దానిద్వారానే సకల శుభాలు జరుగుతాయి. దైవ సాన్నిధ్యపు ద్వారాలు తెరుచుకుంటాయి. సన్మార్గంలో పయనం సులభతరం అవుతుంది.

• మహమ్మద్ వహీదుద్దీన్

ఇన్ఫీ రూ.18,000 కోట్ల బైబ్యాక్

కంపెనీ వాటాలో 2.41% వాటాకు సమానమైన 10 కోట్ల షేర్ల తిరిగి కొనుగోలు

- ఒక్కో షేరుకు రూ.1,800 చెల్లింపు
- కంపెనీ చరిత్రలో ఇదే అతిపెద్ద బైబ్యాక్
- గడిచిన మూడేళ్లలో ఇదే మొదటిసారి
- మార్కెట్లో లిస్టయినప్పటి నుంచి ఐదోసారి



బెంగళూరు: దేశంలో రెండో అతిపెద్ద ఐటీ కంపెనీ ఇన్ఫోసిస్ రూ.18,000 కోట్ల విలువైన షేర్లను మార్కెట్ నుంచి తిరిగి కొనుగోలు (బైబ్యాక్) చేయనున్నట్లు ప్రకటించింది. కంపెనీ మొత్తం పెయిడప్ ఈక్విటీ షేర్ క్యాపిటల్‌లో 2.41 శాతానికి సమానమైన 10 కోట్ల షేర్లను తిరిగి కొనుగోలు చేయనున్నట్లు, ఒక్కో షేరుకు రూ.1,800 చెల్లించనున్నట్లు తెలిపింది. గురువారం సమావేశమైన కంపెనీ బోర్డు సభ్యులు ఈ బైబ్యాక్ ప్రతిపాదనకు ఆమోదం తెలిపారు. కాగా ఇన్ఫోసిస్ చరిత్రలో ఇదే అతిపెద్ద బైబ్యాక్ కానుంది. గడిచిన మూడేళ్లలో ఇదే మొదటిసారి. సంస్థ స్టాక్ మార్కెట్లో లిస్టయినప్పటి నుంచి ఇది ఐదోసారి.

బీఎస్ఈలో ఇన్ఫోసిస్ షేరు ధర గురువారం 1.51 శాతం తగ్గి రూ.1,509.5 వద్ద ముగిసింది. ఈ ముగింపు ధరతో పోలిస్తే కంపెనీ షేర్ల తిరిగి కొనుగోలు కోసం 19 శాతం అధికంగా చెల్లించనుంది. ఈ జూన్ త్రైమాసికం చివరినాటికి కంపెనీ 88.4 కోట్ల డాలర్ల (సుమారు రూ.7,805 కోట్లు) ఫ్రీ క్యాష్‌ఫ్లోను నమోదు చేసింది. తాజా బైబ్యాక్ ప్రతిపాదనకు కంపెనీ వాటాదారులూ ఆమోదం తెలపాల్సి ఉంటుంది.

బై బ్యాక్ సంవత్సరం	రూ.కోట్లు	మొత్తం ఎన్ని షేర్లు	ఒక్కో షేరు ధర (రూ.)
2017	13,000	11.3 కోట్లు	1,150
2019	8,260	11.05 కోట్లు	747
2021	9,200	5.58 కోట్లు	1,649
2022	9,300	6.04 కోట్లు	1,539
2025	18,000	10 కోట్లు	1,800

టీసీఎస్ కూడా ప్రకటిస్తుందా..?

ఇన్ఫోసిస్ తాజా నిర్ణయం నేపథ్యంలో దేశంలో అతిపెద్ద ఐటీ కంపెనీ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) కూడా షేర్ల బైబ్యాక్‌ను ప్రకటించవచ్చని హాంకాంగ్‌కు చెందిన బ్రోకరేజీ సంస్థ సీఎల్ఎస్ఏ అభిప్రాయపడింది. 2023 డిసెంబరుతో ముగిసిన బైబ్యాక్‌లో టీసీఎస్ రూ.17,000 కోట్ల విలువైన షేర్లను తిరిగి కొనుగోలు చేసింది. 2022లో రూ.18,000 కోట్ల షేర్లను బైబ్యాక్ చేసింది. ఈ విడత టీసీఎస్ రూ.20,000 కోట్ల షేర్లను తిరిగి కొనుగోలు చేయవచ్చని సీఎల్ఎస్ఏ అంచనా వేస్తోంది.

మరో విడత పీఎస్‌బీల విలీనాలు!?

- ఎస్‌బీఐ తరహాలో 3-4 మెగా బ్యాంకుల ఏర్పాటు ఆలోచనలో కేంద్ర ప్రభుత్వం!!
- నేటి నుంచి పీఎస్‌బీల మేధోమథనం

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో (పీఎస్‌బీ) మరో విడత విలీనాలకు కేంద్రం సన్నద్ధమవుతున్నట్లు తెలిసింది. ఆస్తుల విలువ పరంగా ప్రస్తుతం భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బీఐ), హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మాత్రమే ప్రపంచంలోని 100 అతిపెద్ద బ్యాంకుల జాబితాలో ఉన్నాయి. వీటి తరహాలో మరో 3-4 మెగా పీఎస్‌బీలను ఏర్పాటు చేయడమే లక్ష్యంగా ఈసారి విలీనాలను చేపట్టనున్నట్లు సమాచారం. వికసిత్ భారత్ లక్ష్యాల సాధనకు దేశంలో మరిన్ని ప్రపంచ స్థాయి బ్యాంకుల ఏర్పాటు అవసరమని మోదీ సర్కారు భావిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఈ నెల 12-13 తేదీల్లో ప్రభుత్వ రంగ బ్యాంకుల సారథులు, ఆర్‌బీఐ, ఆర్థిక శాఖ అధికారులతో కేంద్రం నిర్వహించే రెండు రోజుల మేధోమథనం కార్యక్రమంలో పీఎస్‌బీల మలి విడత విలీనాల ప్రతిపాదనపై చర్చ జరగనుందని వారన్నారు. చివరిసారి 2020లో మోదీ ప్రభుత్వం పీఎస్‌బీల విలీనాలను జరిపింది. దీంతో పీఎస్‌బీల సంఖ్య 27 నుంచి 12కు తగ్గింది. విలీనాల అంచనాల నేపథ్యంలో లిస్టెడ్ పీఎస్‌బీల షేర్లు గురువారం లాభాల్లో పయనించాయి. దాంతో బ్యాంక్ నిఫ్టీ దాదాపు ఒక శాతం పెరిగింది.

హైదరాబాద్‌లో హార్ట్‌ఫోర్డ్ సెంటర్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అమెరికా కేంద్రంగా ఉన్న బీమా కంపెనీ హార్ట్‌ఫోర్డ్.. హైదరాబాద్‌లో తన టెక్నాలజీ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. తమ సాంకేతిక రూపాంతర ప్రయాణంలో ఈ కేంద్రం ఏర్పాటు ఒక మైలురాయి అని తెలిపింది. హార్ట్‌ఫోర్డ్ కంపెనీ ఇంజనీరింగ్ ఎక్సలెన్స్, ఏఐ, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీల అభివృద్ధికి హైదరాబాద్ సెంటర్ ప్రధాన కేంద్రంగా పని చేయనుంది. హార్ట్‌ఫోర్డ్‌కు అమెరికాలో ఇప్పటికే ఆరు టెక్నాలజీ కేంద్రాలు ఉన్నాయి. తమ ఉత్పత్తులు, ప్రాసెస్‌ల్లో ఏఐ వినియోగం పునాదిలా మారనుందని కంపెనీ చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ శేఖర్ తెలిపారు.

డాక్టర్ రెడ్డీస్ చేతికి వర్టిగో ఔషధం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): వర్టిగో (తల తిరగటం) చికిత్సలో ఉపయోగించే స్టగెరాన్ బ్రాండ్ కొనుగోలుకు జాన్సన్ అండ్ జాన్సన్ (జే అండ్ జే)తో కీలక ఒప్పందం కుదుర్చుకున్నట్టు డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ ప్రకటించింది. ఈ ఒప్పందంతో భారత్, వియత్నాం కీలక మార్కెట్లుగా ఈఎంఈఏ దేశాల్లో స్టగెరాన్ బ్రాండ్ హక్కులు డాక్టర్ రెడ్డీస్‌కు దక్కుతాయి. స్టగెరాన్‌లో వర్టిగో, వెస్టిబ్యులార్ రుగ్మత చికిత్సలో ఉపయోగపడే సినారిజిన్ ఔషధం ఉంటుంది. యాంటీ-వర్టిగో, సెంట్రల్ నెర్వస్ సిస్టమ్ (సీఎన్ఎస్) పోర్ట్‌ఫోలియో శక్తివంతం చేసుకునేందుకు ఈ బ్రాండ్ కొనుగోలు దోహదపడుతుందని డాక్టర్ రెడ్డీస్ తెలిపింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



12వ తేదీ			
హైదరాబాద్	535	విజయవాడ	550
వరంగల్	537	గోదావరి	545
చిత్తూరు	563	విశాఖపట్నం	555
		దజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	121	విజయవాడ	140
వరంగల్	121	గుంటూరు	132
కరీంనగర్	121	ఒంగోలు	132
మహబూబ్‌నగర్	121	చిత్తూరు	113
కర్నూలు	121	నెల్లూరు	118
విశాఖపట్నం	144	అనంతపురం	118
గోదావరి	140		


బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,10,500 ▼	1,01,300 ▲	1,39,000 ▼
విజయవాడ	1,12,500 ▼	1,06,500 ▼	1,28,250 ▼
విశాఖపట్నం	1,12,790 ▼	1,01,300 ▲	1,40,000 ▲
రాజమండ్రి	1,10,510 ▲	1,01,300 ▲	1,27,900 ▼
ప్రొద్దుటూరు	1,13,500 ▼	1,04,420 ▼	1,29,000 ▲
ముంబై	1,09,097 ▼	99,933 ▼	1,24,499 ▼

పసిడి రుణాలు రికార్డు స్థాయికి

ఆగస్టులో రూ.2.94 లక్షల కోట్లకు చేరిక



న్యూఢిల్లీ: బంగారం విలువ వేగంగా ఎగబాకుతోంది. గడిచిన ఏడాది కాలంలో 10 గ్రాముల పసిడి రేటు 53 శాతం పెరిగింది. దాంతో బంగారం తాకట్టు పెట్టి తీసుకునే రుణాలూ అంతకంటే వేగంగా పెరుగుతున్నాయి. ఆగస్టు నెలలో బ్యాంకుల గోల్డ్ లోన్ పోర్ట్‌ఫోలియో సరికొత్త జీవితకాల గరిష్ఠ స్థాయి రూ.2.94 లక్షల కోట్లకు చేరుకుంది. 2024 ఏప్రిల్‌లో ఇది కేవలం రూ.1.02 లక్షల కోట్లే. ఈ రుణాలు ఆల్‌టైం రికార్డు స్థాయికి పెరగడం వరుసగా ఇది 15వ నెల. అంతేకాదు, ఈ మార్చి నుంచి ప్రతినెలా ఈ రుణాల్లో వార్షిక ప్రాతిపదికన 100 శాతానికి పైగా వృద్ధి నమోదైంది. బంగారం ధరలు పెరుగుతున్నంత కాలం గోల్డ్ లోన్స్‌లోనూ అప్‌ట్రెండ్ కొనసాగనుందని దేశీయ రేటింగ్ ఏజెన్సీ ఇక్రా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ కార్తీక్ శ్రీనివాసన్ అన్నారు.

ఇవీ కారణాలు: బంగారం తాకట్టుపై గతంలో కంటే అధికం రుణం లభిస్తుండటం, బ్యాంకులు తనఖా రహిత వ్యక్తిగత రుణాల మంజూరులో ఆచితూచి వ్యవహరిస్తుండటం ఇందుకు ప్రధానం కారణం. వ్యక్తిగత రుణంతో పోలిస్తే గోల్డ్ లోన్స్‌పై వడ్డీ కూడా తక్కువగా ఉండటమూ మరో కారణం. వ్యక్తిగత రుణం లభించే అవకాశం లేనివారికి బంగారం తనఖా రుణాలు మంచి ప్రత్యామ్నాయంగా మారాయని ఇండస్ట్రీ వర్గాలంటున్నాయి.

10 గ్రాముల ధర రూ.1.13 లక్షలకు చేరిక

దేశీయంగా బంగారం ధరలు సరికొత్త జీవితకాల గరిష్ఠ స్థాయికి ఎగబాకాయి. ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి (99.9 శాతం స్వచ్ఛత) బంగారం ధర మరో రూ.100 పెరిగి రూ.1,13,100కు చేరింది. 99.5 శాతం స్వచ్ఛత లోహం రేటు కూడా రూ.100 పెరిగి ఆల్‌టైం రికార్డు స్థాయి రూ.1,12,600 స్థాయికి ఎగబాకింది. 2024 డిసెంబరు 31న రూ.78,950గా నమోదైన 10 గ్రాముల మేలిమి బంగారం ధర.. ఈ ఏడాదిలో ఇప్పటివరకు రూ.34,150 మేర (43.25 శాతం) పుంజుకుంది. కాగా, కిలో వెండి రూ.500 పెరుగుదలతో రూ.1,28,000కు చేరుకుంది.

హైదరాబాద్‌లో ఎంజీ సెలెక్ట్

ఎంజీ సైబర్‌స్టర్, ఎం9 ఎలక్ట్రిక్ కార్లను ఆవిష్కరించిన కేంద్ర మంత్రి చంద్రశేఖర్


ఎంజీ సైబర్‌స్టర్ కారును ఆవిష్కరిస్తున్న మంత్రి చంద్రశేఖర్, మిలింద్ షా, గౌతమ్ సాయి, కంభంపాటి రామ్మోహన్ రావు

హైదరాబాద్ సిటీ (ఆంధ్రజ్యోతి): జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియా హైదరాబాద్‌లో ఎంజీ సెలెక్ట్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను ప్రారంభించింది. బంజారాహిల్స్‌లో ఏర్పాటు చేసిన ఈ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన కంపెనీ లగ్జరీ ఎలక్ట్రిక్ కార్లు ఎంజీ సైబర్‌స్టర్, ఎంజీ ఎం9లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భారత్ చమురు దిగుమతులను తగ్గించుకోవాలంటే దేశీయంగా ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరగాల్సి ఉందన్నారు. ఇంధన స్వయం సమృద్ధిని సాధించేందుకు ఎలక్ట్రిక్ వాహనాలు దోహదపడతాయన్నారు. దేశీయంగా పునరుత్పాదక ఇంధన వనరులను పూర్తి స్థాయిలో వినియోగించుకునేందుకు ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంటోందని వివరించారు. కాగా హైదరాబాద్ మార్కెట్లోకి ఎంజీ స్పోర్ట్స్‌కారు సైబర్‌స్టర్, ఎం9 కార్లను విడుదల చేయటం ఎంతో సంతోషంగా ఉందని ఎంజీ సెలెక్ట్ హెడ్ మిలింద్ షా అన్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 13 నగరాల్లో 14 ఎంజీ సెలెక్ట్ సెంటర్లు ఉన్నాయని ఆయన తెలిపారు. హైదరాబాద్‌లో సైబర్‌స్టర్, ఎం9 కార్లకు వినియోగదారుల నుంచి అద్భుతమైన స్పందన లభిస్తోందని, ఇప్పటికే 250 కార్లు బుకింగ్స్ కావటమే ఇందుకు నిదర్శనమని ఎంజీ సెలెక్ట్ జయలక్ష్మీ మోటార్స్ ఇండియా డీలర్ ప్రిన్సిపల్ పీ గౌతమ్ సాయి తెలిపారు. ఎంజీ సైబర్‌స్టర్ ఒకసారి చార్జింగ్‌తో 580 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుంది. దీని ధర రూ.74.99 లక్షలు (ఎక్స్‌షోరూమ్). అయితే ప్రీ బుకింగ్స్ కోసం పరిచయ ధర రూ.72.49 లక్షలుగా ఖరారు చేసింది. ఎంజీ ఎం9 ధర రూ.69.90 లక్షలుగా ఉంది. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ కంభంపాటి రామ్మోహన్ రావు, తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ 25,000 పైకి నిఫ్టీ

ముంబై: అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల సంకేతాలతో దేశీయ ఈక్విటీ సూచీలూ గురువారం లాభాల్లో పయనించాయి. సెన్సెక్స్ 123.58 పాయింట్లు పెరిగి 81,548.73 వద్ద స్థిరపడింది. సూచీ లాభపడటం వరుసగా ఇది నాలుగో రోజు. నిఫ్టీ 32.40 పాయింట్ల వృద్ధితో దాదాపు మూడు వారాల గరిష్ఠ స్థాయి 25,005.50 వద్దకు చేరింది. సూచీ లాభపడటం వరుసగా ఇది ఏడో రోజు. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 16 రాణించాయి. ఎన్‌టీపీసీ, యాక్సిస్ బ్యాంక్, పవర్ గ్రిడ్, ఎటర్నల్, ఎయిర్‌టెల్ షేర్లు ఒక శాతానికి పైగా పుంజుకున్నాయి.

సెమీకండక్టర్ పరిశ్రమ కోసం చిప్‌లెట్ ఆధారిత ఇంజనీరింగ్ సేవలు

టీసీఎస్

న్యూఢిల్లీ: ఐటీ దిగ్గజం టీసీఎస్ దేశీయ సెమీకండక్టర్ పరిశ్రమకు అవసరమైన చిప్‌లెట్ ఆధారిత ఇంజనీరింగ్ సర్వీసును అభివృద్ధి చేసింది. ఈ చిప్‌లెట్ ఆధారిత ఇంజనీరింగ్ సేవలు సెమీకండక్టర్ల తయారీకి భారత్‌ను అంతర్జాతీయ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ఎంతగానో దోహదం చేస్తాయని టీసీఎస్ వెల్లడించింది. ఈ రంగంలో నూతన ఆవిష్కరణలకూ ఇది ఉపకరిస్తుందని పేర్కొంది. గత ఆర్థిక సంవత్సరం 4,500 కోట్ల డాలర్ల నుంచి 5,000 కోట్ల డాలర్ల వరకు ఉన్న భారత సెమీకండక్టర్ల మార్కెట్ 2030 నాటికి 10,000 కోట్ల డాలర్ల నుంచి 11,000 కోట్ల డాలర్లకు చేరనుంది. ఇలాంటి కీలక సమయంలో తాము అందించే ఈ సరికొత్త సేవలు భారత సెమీకండక్టర్ పరిశ్రమకు ఎంతగానో తోడ్పడతాయని టీసీఎస్ టెక్నాలజీ, సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీసెస్ విభాగం ప్రెసిడెంట్ వీ రాజన్న తెలిపారు.

ఆయుష్ సంచలన విజయం

- క్వార్టర్స్‌లో లక్ష్య సేన్, సాత్విక్ జోడీ
- హాంకాంగ్ ఓపెన్

హాంకాంగ్: భారత వర్ధమాన షట్లర్ ఆయుష్ షెట్టి సంచలన విజయంతో హాంకాంగ్ ఓపెన్ క్వార్టర్స్‌కు చేరుకొన్నాడు. లక్ష్యసేన్, సాత్విక్ సాయిరాజ్ జోడీ కూడా రౌండ్-8కు చేరుకొన్నాయి. గురువారం జరిగిన ప్రీక్వార్టర్స్‌లో ఆయుష్ 21-19, 12-21, 21-14తో 2023 వరల్డ్ చాంపియన్‌షిప్స్ రజతపతక విజేత కొడాయ్ నరోకా (జపాన్)పై పోరాడి గెలిచాడు. రౌండ్-8లో భారత్‌కే చెందిన లక్ష్యసేన్‌తో ఆయుష్ తలపడతాడు. కాగా సహచర షట్లర్ల మధ్య పోరులో సేన్ 15-21, 21-18, 21-10తో ప్రణయ్‌ను ఓడించాడు. కిరణ్ జార్జ్ 6-21, 12-21తో చోట్ సి (చైనీస్ తైపీ) చేతిలో చిత్తయ్యాడు. డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ షెట్టి జంట 18-21 21-15, 21-11తో టీరారట్సకుల్-సుక్‌పున్ (థాయ్‌లాండ్)పై గెలిచింది.

యు ముంబా ఉత్కంఠ గెలుపు



విశాఖపట్నం స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి): ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) తొలి అంచె లీగ్ మ్యాచ్‌లలో యు ముంబా జోరు కొనసాగుతోంది. పట్నా పైరేట్స్‌తో గురువారం ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో యు ముంబా 40-39 స్కోరుతో విజయం సాధించింది. ప్రథమార్థం ముగిసేసరికి యు ముంబా 23-15 ఆధిక్యంలో ఉంది. ద్వితీయార్థం 10వ నిమిషం నుంచి ఇరు జట్లు సమాన పాయింట్లతో స్కోరుబోర్డును నడిపించడంతో మ్యాచ్ రసవత్తరంగా మారింది. గెలుపు అంచున ఉన్న పట్నా చివరి సెకన్లలో పొరపాట్లు చేసి చేజేతులా ఓటమిపాలైంది. మరో మ్యాచ్‌లో దబాంగ్ ఢిల్లీ 38-28తో గుజరాత్ జెయింట్స్‌ను ఓడించింది.

సెమీఫైనల్లో పూజ

- భారత్‌కు మరో పతకం ఖాయం
- ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్స్


పూజారాణి

లివర్‌పూల్ (ఇంగ్లండ్): ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్స్‌లో భారత్‌కు మూడో పతకం ఖాయమైంది. మహిళల 80 కి. విభాగంలో పూజారాణి సెమీఫైనల్‌కు చేరింది. బుధవారం అర్ధరాత్రి హోరాహోరీగా జరిగిన క్వార్టర్ ఫైనల్లో 34 ఏళ్ల పూజ 3-2తో ఎమీలియా కొటెర్‌స్కా (పోలెండ్) ఓడించింది. సెమీస్‌కు చేరిన పూజారాణికి కనీసం కాంస్యం లభించనుంది. ప్రపంచ పోటీలలో ఆమెకిదే తొలి పతకం. ఇక జైస్మీన్ లంబోరియా (మహిళల 57కి.), నూపుర్ షెరాన్ (మహిళల 80+కి.) ఇంతకుముందే సెమీఫైనల్‌కు చేరడంతో భారత్‌కు కనీసం రెండు కాంస్య పతకాలు ఖరారైన సంగతి తెలిసిందే. పురుషుల 65కి. కేటగిరీ క్వార్టర్‌ఫైనల్లో అభినాష్ జమ్వాల్ 1-4తో ఒలింపిక్ కాంస్య పతక విజేత లాష గురులీ (జార్జియా) చేతిలో ఓటమితో టోర్నీ నుంచి నిష్క్రమించాడు.

స్పోర్ట్స్

భారత్ జోరుకు బ్రేక్

చైనా చేతిలో ఓటమి

మహిళల ఆసియా కప్ హాకీ

హాంగ్జౌ (చైనా): ఆసియా కప్‌లో భారత అమ్మాయిల జోరుకు బ్రేక్ పడింది. అప్రతిహత విజయాలతో దూసుకుపోతున్న మనోళ్లకు ఆతిథ్య చైనా షాకిచ్చింది. గురువారం జరిగిన సూపర్-4 మ్యాచ్‌లో చైనా 4-1తో భారత్‌పై నెగ్గింది. ముంతాజ్ (38వ ని.) భారత్‌కు ఏకైక గోల్ అందించింది. జూ మీరాంగ్ (4, 56 ని.), చెన్ యాంగ్ (31), టాన్ జిన్హువాంగ్ (47) చైనా తరఫున గోల్స్ చేశారు. శుక్రవారం జరిగే తదుపరి పోరులో జపాన్‌తో భారత్ తలపడుతుంది. ఈ మ్యాచ్‌లో విజయం సాధిస్తే మనోళ్లకు ఫైనల్ బెర్త్ ఖాయమవుతుంది.

సింగిల్స్ బరిలో దక్షిణేశ్వర్

- రిజర్వ్ ప్లేయర్‌కు చాన్స్
- డబుల్స్‌లో రిత్విక్
- నేటి నుంచి డేవిస్ కప్ వరల్డ్ గ్రూప్ 1



బీల్ (స్విట్జర్లాండ్): డేవిస్‌కప్ వరల్డ్ గ్రూప్-1లో పటిష్ట స్విట్జర్లాండ్‌ను ఎదుర్కొనేందుకు భారత జట్టు కీలక నిర్ణయం తీసుకుంది. నేటి నుంచి జరిగే ఈ పోటీల్లో రిజర్వ్ ఆటగాడిగా ఉన్న దక్షిణేశ్వర్ సురేశ్‌తో సింగిల్స్ ఆడించబోతున్నారు. ఆరు అడుగుల ఐదు అంగుళాల ఈ మధురై ఆటగాడు ట్రైనింగ్ సెషన్‌లో భారీ సర్వీస్‌లతో ఆకట్టుకున్నాడు. అందుకే ఇండోర్ హార్డ్ కోర్టుల్లో సాగే పోటీలకు సురేశ్ ఆట సరిగ్గా సరిపోతుందని కెప్టెన్ రోహిత్ రాజ్‌పాల్ భావిస్తున్నాడు. శుక్రవారం జరిగే తొలి సింగిల్స్‌లో దక్షిణేశ్వర్.. జెరోమ్ కిమ్‌తో తలపడనున్నాడు. అలాగే భారత నెంబర్‌వన్ ఆటగాడు సుమిత్ నగాల్ మరో సింగిల్స్ ఆడనున్నాడు. అయితే యూఎస్ ఓపెన్‌లో గాయపడిన డబుల్స్ స్టార్ యుకీ భాంబ్రీ ఇంకా కోలుకోలేదు. దీంతో 13న జరిగే డబుల్స్‌లో శ్రీరామ్ బాలాజీకి జతగా హైదరాబాదీ రిత్విక్ బొల్లిపల్లి బరిలోకి దిగుతాడు. 1993లో చివరిసారి స్విస్‌తో తలపడిన భారత్ ఓవరాల్‌గా 2-1తో ఆధిక్యంలో ఉంది. తాజా వరల్డ్ గ్రూప్-1లో విజేత డేవిస్ కప్ క్వాలిఫయర్స్‌కు అర్హత సాధిస్తుంది. ఓడిన జట్టు వరల్డ్ గ్రూప్ 1 ప్లేఆఫ్స్‌కు పడిపోతుంది.

హెచ్‌సీఏ బ్యాంకు ఖాతాను పునరుద్ధరించండి

తెలంగాణ హైకోర్టు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) బ్యాంకు ఖాతాను పునరుద్ధరించాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. నిధుల దుర్వినియోగం కేసులో ఆ సంఘం బ్యాంకు ఖాతాను సీఐడీ సూచనల మేరకు కెనరా బ్యాంకు అధికారులు స్తంభింపజేశారు. ఖాతా స్తంభనను హెచ్‌సీఏ తాత్కాలిక సీఈఓ ఇంతియాజ్ హైకోర్టులో సవాల్ చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ శ్రవణ్ ధర్మాసనం, సీఐడీ పెట్టిన కేసులో కార్యవర్గ సభ్యులు నిందితులుగా ఉన్నారే కానీ హెచ్‌సీఏ కాదని, సీఐడీ పెట్టిన కేసుకు సంఘం రోజువారీ కార్యకలాపాల నిర్వహణకు సంబంధం లేదని ఉత్తర్వుల్లో పేర్కొంది.


ప్రీక్వార్టర్స్‌కు 15 ఏళ్ల గాథ ఖడాకే

● దీపిక, అంకిత విఫలం ● వరల్డ్ ఆర్చరీ చాంపియన్‌షిప్స్



గ్వాంగ్జు (కొరియా): వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో టీనేజ్ ఆర్చర్ గాథ ఖడాకే ప్రీక్వార్టర్స్‌కు చేరుకోగా.. వెటరన్ దీపిక కుమారికి మరోసారి నిరాశే ఎదురైంది. గురువారం జరిగిన మహిళల రికర్వ్ వ్యక్తిగత విభాగంలో 15 ఏళ్ల గాథ 6-4తో కేథరినా బౌవర్ (జర్మనీ)పై గెలిచింది. కాగా, సీడింగ్ ఆధారంగా నేరుగా రౌండ్-32లో తలపడిన దీపిక 4-6తో చొయిరున్నీసా (ఇండోనేసియా) చేతిలో, అంకిత భక్త్ 2-6తో షియాన్ చేతిలో పరాజయం పాలయ్యారు. కాగా, మెగా ఈవెంట్‌లో దీపిక విఫలం కావడం ఇది ఆరోసారి.

వరల్డ్‌కప్ జట్టులో తెలుగమ్మాయి



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): అంధుల టీ20 మహిళల ప్రపంచకప్‌లో ఆడే భారత జట్టులో ఆంధ్ర క్రికెటర్ పి. కరుణ కుమారి స్థానం దక్కించుకుంది. గురువారం 16 మందితో కూడిన భారత వరల్డ్‌కప్ జట్టును ప్రకటించింది. టి. దీపిక (కర్ణాటక) కెప్టెన్‌గా ఎంపికైంది. అల్లూరి సీతారామరాజు జిల్లా, పాడేరు మండలం, వంట్ల మామిడి గ్రామం కరుణ స్వస్థలం. వచ్చే నవంబరు 11 నుంచి 25వ తేదీ వరకు బెంగళూరు, న్యూఢిల్లీలో వరల్డ్‌కప్ మ్యాచ్‌లు జరగనున్నాయి.

కుప్పకూలిన సౌత్ జోన్.. దులీప్ ట్రోఫీ ఫైనల్

బెంగళూరు: దులీప్ ట్రోఫీ ఫైనల్లో సౌత్ జోన్ తొలి రోజే తడబడింది. సెంట్రల్ జోన్ స్పిన్నర్లు సారాంశ్ జైన్ (5/49), కుమార్ కార్తికేయ (4/53) సుడులు తిరిగే బంతులతో హడలెత్తించడంతో గురువారం తొలి ఇన్నింగ్స్‌లో సౌత్ జోన్ 149 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్ తన్మయ్ (31) టాప్ స్కోరర్. ఆ తర్వాత ఇన్నింగ్స్ ఆరంభించిన సెంట్రల్ జోన్ నిలకడగా ఆడుతోంది. రోజు ముగిసే సమయానికి 19 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 50 పరుగులతో నిలిచింది. క్రీజులో ఓపెనర్లు డానిష్ (28 బ్యాటింగ్), అక్షయ్ (20 బ్యాటింగ్) ఉన్నారు.

బంగ్లా.. అవలీలగా

ఆసియా కప్

హాంకాంగ్‌పై 7 వికెట్ల తేడాతో విజయం

కెప్టెన్ లిట్టన్ హాఫ్ సెంచరీ


లిట్టన్ దాస్ (39 బంతుల్లో 6 ఫోర్లు, సిక్స్‌తో 59)

అబుధాబి: కెప్టెన్ లిట్టన్ దాస్ (39 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్‌తో 59) అర్ధ సెంచరీతో ఆసియాకప్‌లో బంగ్లాదేశ్ బోణీ చేసింది. గురువారం గ్రూప్ 'బి'లో భాగంగా హాంకాంగ్‌తో జరిగిన ఈ మ్యాచ్‌లో బంగ్లా ఏడు వికెట్ల తేడాతో నెగ్గింది. తౌహీద్ హ్రిదయ్ (35 నాటౌట్) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన హాంకాంగ్ 20 ఓవర్లలో 143/7 స్కోరు సాధించింది. నిజాకత్ ఖాన్ (42), ఓపెనర్ జీషన్ అలీ (30), యాసిన్ ముర్తజా (28) మాత్రమే రాణించారు. పేసర్లు తన్‌జీమ్ హసన్, టస్కిన్ అహ్మద్, స్పిన్నర్ రిషాద్ రెండేసి వికెట్లు సాధించారు. ఆ తర్వాత ఛేదనలో బంగ్లాదేశ్ 17.4 ఓవర్లలో 3 వికెట్లకు 144 పరుగులు చేసి నెగ్గింది. పవర్‌ప్లేలో ఓపెనర్లు పర్వేజ్ (19), తన్‌జీద్ (14) వికెట్లు కోల్పోయినా 51/2 స్కోరుతో జట్టు మెరుగైన స్థితిలో నిలిచింది. అయితే ఆ తర్వాత 7-12 ఓవర్ల మధ్య హాంకాంగ్ బౌలర్లు ఒక్క బౌండరీ కూడా ఇవ్వకపోవడంతో మ్యాచ్‌పై ఆసక్తి నెలకొంది. కానీ కెప్టెన్ లిట్టన్ వరుస ఫోర్లతో స్కోరును గాడిలో పెట్టాడు. 16వ ఓవర్‌లో 6,4తో 16 రన్స్ సాధించిన అతడు 33 బంతుల్లోనే హాఫ్ సెంచరీ కూడా పూర్తి చేశాడు. అతడికి మరో ఎండ్‌లో హ్రిదయ్ సహకరించగా మూడో వికెట్‌కు 95 పరుగుల భాగస్వామ్యం సమకూరింది. విజయానికి రెండు పరుగుల దూరంలో లిట్టన్ వెనుదిరిగినా మరో 14 బంతులుండగానే మ్యాచ్ ముగిసింది.

పేసర్ల కట్టడి: అఫ్ఘాన్‌పై 94 పరుగులకే పరిమితమైన హాంకాంగ్ ఈసారి కాస్త మెరుగ్గానే ఆడింది. అయితే ఆరంభంలో బంగ్లా పేసర్లు ఇబ్బందిపెట్టడంతో పవర్‌ప్లేలో 34 రన్స్‌కే రెండు వికెట్లు కోల్పోయింది. ఈ స్థితిలో నిజాకత్ ఖాన్, ఓపెనర్ జీషన్ అలీ ఆదుకునే ప్రయత్నం చేశారు. ఆరంభంలో తడబడిన జీషన్ తొమ్మిదో ఓవర్‌లో 6,4తో బ్యాట్ ఝుళిపించాడు. ఆ తర్వాత అడపాదడపా బౌండరీలతో వేగం పెంచిన అతడిని తన్‌జీమ్ అవుట్ చేశాడు. ఈ దశలో యాసిన్ ముర్తజా ధాటిగా ఆడి స్కోరులో వేగం చూపాడు. కానీ 18వ ఓవర్‌లో అతడు రనౌట్ కావడంతో నాలుగో వికెట్‌కు 46 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఆ తర్వాతి ఓవర్‌లోనే నిలకడగా ఆడుతున్న నిజాకత్, కించిత్ (0)లను స్పిన్నర్ రిషాద్ అవుట్ చేయడంతో హాంకాంగ్ స్వల్ప స్కోరుకే పరిమితమైంది.

సంక్షిప్త స్కోర్లు

హాంకాంగ్ :20 ఓవర్లలో 143/7: (నిజాకత్ ఖాన్ 42, జీషన్ అలీ 30 తన్‌జీమ్ 2/21, రిషాద్ 2/31, టస్కిన్ 2/38); **బంగ్లాదేశ్ 17.4 ఓవర్లలో 144/3 :** (లిట్టన్ దాస్ 59, హ్రిదయ్-నాటౌట్ 35, ఇక్బాల్ 2/14, శుక్లా 1/32).

రెఫరీలు, అంపైర్లు అంతా అతివలే..

మహిళల వన్డే వరల్డ్ కప్


లక్ష్మి

దుబాయ్ : మహిళల వన్డే వరల్డ్ కప్ చరిత్రలో తొలిసారి..మెగా టోర్నీలో అంతా అతివలే మ్యాచ్ అధికారులుగా వ్యవహరించనున్నారు. ఈమేరకు అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) 14 మందితో కూడిన మ్యాచ్ అధికారుల జాబితాను గురువారం ప్రకటించింది. ఇందులో..అంతర్జాతీయ మహిళా క్రికెట్‌లో తొలి మహిళా మ్యాచ్ రెఫరీగా ఖ్యాతి గాంచిన తెలుగు మాజీ క్రికెటర్ జీఎస్ లక్ష్మికి చోటు దక్కింది. మొత్తం నలుగురు మ్యాచ్ రెఫరీలుగా వ్యవహరించనున్నారు. అలాగే 14 మంది అంపైర్లలో భారత్‌నుంచి మాజీ క్రీడాకారిణులు బృంద రాఠీ, ఎస్.జనని, గాయత్రీ వేణుగోపాలన్ బాధ్యతలు నిర్వర్తించనున్నారు. వన్డే వరల్డ్ కప్ భారత్, శ్రీలంక వేదికలుగా ఈనెల 30న ప్రారంభం కానున్న సంగతి తెలిసిందే.

తెలుగు ప్రేక్షకుల కోసమే సినిమాలు చేస్తాను

'తెలుగు ప్రేక్షకులను అలరించడమే నాకు ముఖ్యం. కంటెంట్ నచ్చి పరభాషల్లోనూ మన సినిమా ఆడితే సంతోషిస్తాను. అంతే తప్ప పాన్ ఇండియా హీరో అనిపించుకోవాలనే కోరికతో కథలను ఎంచుకోవడం లేదు. మున్ముందూ తెలుగు ప్రేక్షకుల కోసమే సినిమాలు చేస్తాను' అని తేజ సజ్జ అన్నారు. ఆయన కథానాయకుడిగా నటించిన 'మిరాయ్' విడుదల సందర్భంగా చిత్ర విశేషాలను మీడియాతో పంచుకున్నారు.



● ఎప్పటికప్పుడు కొత్త తరహా చిత్రాలు చేయాలనే నా ప్రయత్నంలో 'మిరాయ్'ను మంచి అవకాశంగా భావించాను. ఎక్కడా అసభ్యతకు తావు లేకుండా కుటుంబ సమేతంగా చూసేలా ఉంటుంది. సాహసోపేత పోరాటాలు, కాల్పనిక ప్రపంచం, భావోద్వేగాలు, భక్తి భావన లాంటి అంశాల మేళవింపుగా దర్శకుడు ఈ కథను మలిచారు. ప్రేక్షకులకు అద్భుతమైన థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్ ఇస్తుందీ చిత్రం.

● సినిమా కోసం నూటికి నూరు శాతం కష్టపడుతున్నానా లేదా? అనే ఆలోచన తప్ప ఎలాంటి ఒత్తిడి నాపైన లేదు. ఈ సారి చేసే సినిమా ఇంతకు మించి ఉండాలి అనే అంచనాలు పెట్టుకోను. అలాగే సినిమా విజయాన్ని నాకు ఆపాదించుకోను. ఫలితాలపైనా అంచనాలు పెట్టుకోను.

● 'హనుమాన్' అనూహ్య విజయం ప్రభావంతో 'మిరాయ్'ను పాన్ ఇండియా ప్రాజెక్ట్ చేయలేదు. అలా కుదిరిందంతే. పాన్ ఇండియా స్థాయిలో ఉండాలని చెప్పి స్క్రిప్ట్‌లో మార్పులూ, చేర్పులూ చేయలేదు. దాదాపు ముందు అనుకున్న బడ్జెట్‌లోనే సినిమాను పూర్తి చేశాం.

'కిష్కింధపురి' ఆ లోటును తీర్చింది

- బెల్లంకొండ సాయి శ్రీనివాస్



"అందరూ 'రాక్షసుడు 2' ఎప్పుడు చేస్తారు?' అని నన్ను అడుగుతున్నారు. కానీ 'కిష్కింధపురి' దానికి మించిన చిత్రం అవుతుంది. నేను ఇండస్ట్రీకి వచ్చి పదేళ్లు అయినా హారర్ జానరలో ఓ మంచి చిత్రం చేయలేకపోయానే అనే వెలితి ఉంది. 'కిష్కింధపురి' ఆ లోటును తీర్చింది. ప్రేక్షకులను భయపెట్టడం కూడా ఒక కళ. ఊహించని మలుపులు, భయానక సంఘటనలతో ప్రేక్షకులను థ్రిల్ చేస్తాం. ఒక మంచి సినిమా చూశామనే సంతృప్తి ప్రేక్షకులకు కలుగుతుంది' అని బెల్లంకొండ సాయి శ్రీనివాస్ అన్నారు. ఆయన కథానాయకుడిగా కౌశిక్ పెగల్లపాటి దర్శకత్వం వహించిన చిత్రమిది. నేడు ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా చిత్రబృందం నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో అనుపమా పరమేశ్వరన్ మాట్లాడుతూ 'ఈ చిత్రాన్ని దర్శకుడు అద్భుతంగా ఆవిష్కరించారు. చిత్రబృందం పడిన కష్టం మీకు ప్రతి ఫ్రేమ్‌లో కనిపిస్తుంది. రాక్షసుడు తర్వాత నేను సాయి శ్రీనివాస్‌తో చేసిన చిత్రమిది. ఈ సినిమా కూడా ఆ స్థాయి విజయం అందుకోవాలి' అని ఆకాంక్షించారు. కౌశిక్ మాట్లాడుతూ 'సాయి శ్రీనివాస్, సాహుగారు ఈ కథను నమ్మడం వల్లే ఈ ప్రాజెక్ట్ ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ చిత్రంలో అనుపమ నటన ప్రేక్షకులకు గుర్తుండిపోతుంది' అని చెప్పారు. సాహు గారపాటి మాట్లాడుతూ 'హారర్ జానర్‌లో చాలా చిత్రాలు వస్తుంటాయి. వాటిల్లో విభిన్న కథా చిత్రమిది" అని చెప్పారు.

'ఓజీ' నుంచి ప్రత్యేక గీతం



పవన్ కల్యాణ్ కథానాయకుడిగా సుజీత్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఓజీ'. అరుళ్ ప్రియాంక మోహన్ కథానాయిక. డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్స్ బేనర్‌పై డీవీవీ దానయ్య నిర్మించారు. సినిమా ఈనెల 25న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఇటీవలె పవన్ కల్యాణ్ పుట్టినరోజు కానుకగా ఈ చిత్రం నుంచి విడుదలైన 'ఓమీ' గ్లింప్స్‌నకు అద్భుతమైన స్పందన లభించింది. తాజాగా చిత్రబృందం 'ఓమీ ట్రాన్స్' పూర్తి వెర్షన్‌ను విడుదల చేసింది. 'ఓజీ', 'ఓమీ'ల ముఖాముఖి పోరుని సూచించేలా ఈ గీతం ఉంది. తమన్ స్వరపరచిన ఈ పాట ఎంతో శక్తిమంతంగా, నిజంగానే శ్రోతలను ట్రాన్స్‌లోకి తీసుకెళ్లేలా ఉంది. కాగా, ఈ సినిమాలో బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ హష్మీ ఓమీగా పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నారు.

కొల్లూరు మూకాంబికాదేవికి వజ్ర కిరీటం

● **రూ.4 కోట్ల కానుకలను సమర్పించిన ఇళయరాజా**



ఉడిపి జిల్లా కొల్లూరు మూకాంబికాదేవికి ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా వజ్రాలు పొదిగిన బంగారు కిరీటాన్ని, వీరభద్ర స్వామికి రజత కిరీటాన్ని, వెండి ఖడ్గాన్ని కానుకలుగా సమర్పించారు. ఆలయ మంటపంలోని రథం వీధి నుంచి పూర్ణకుంభంతో, పంచవాయిద్యాల నడుమ కిరీటాలను, ఇతర ఆభరణాలను ఆయన తీసుకెళ్ళారు. ఇళయరాజా, ఆయన కుమారుడు కార్తీక్ ఇళయరాజా, మనవడు యతీష్ మూకాంబికా దేవిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూకాంబికా దేవిని ఇళయరాజా ఏటా దర్శించుకుంటారు. ఆయన సమర్పించిన కానుకల విలువ రూ.4 కోట్లు ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 2006లోనూ ఆయన మూకాంబికా దేవికి వజ్రకిరీటం, పలు వస్తువులను కానుకగా సమర్పించారు.

- ఆంధ్రజ్యోతి, బెంగళూరు

సొంత ఇంటినే పాఠశాలగా...




'రాఘవ లారెన్స్ ఛారిటబుల్ ట్రస్ట్' ద్వారా ఇప్పటికే ఎంతోమందికి సహాయం చేశారు కథానాయకుడు, దర్శకుడు రాఘవ లారెన్స్. ఇప్పుడు తన సొంతింటిని పాఠశాలగా మారుస్తున్నట్లు ప్రకటించి మరోసారి గొప్ప మనసును చాటుకున్నారు. విద్యార్థులకు ఉచిత విద్య అందించడం కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

ఆయన కష్టం కదిలించింది



ట్రైన్‌లో తినుబండారాలు అమ్మే ఓ 80 ఏళ్ల వృద్ధుడికి రూ.లక్ష సాయం చేయడానికి సిద్ధమని ప్రకటించారు లారెన్స్. 'ఆయన ట్రైన్లలో తినుబండారాలు అమ్ముతుంటారని సోషల్ మీడియా ద్వారా తెలుసుకున్నా. జీవనం సాగించడానికి ఆయన పడుతున్న కష్టం నన్ను ఎంతగానో కదిలించింది. ఆయనకు నా వంతుగా రూ.లక్ష సాయం చేద్దామని భావించాను. ఆయన వివరాలు మీకెవరికైనా తెలిస్తే చెప్పండి' అని ఎక్స్ వేదికగా లారెన్స్ కోరారు.

వంజంగిపై మంచు దుప్పటి!



సెప్టెంబరు నెల పూర్తి కాలేదు. శీతాకాలం రానేలేదు. అప్పుడే అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు మండలం వంజంగి కొండలు మంచు దుప్పట్లో దూరిపోయాయి. గురువారం ఉదయమే దట్టమైన మంచు సందర్శకులకు కనువిందు చేసింది. సూర్యోదయానికి ముందే పచ్చని కొండలపై మంచు మేఘాలు ఆవరించిన దృశ్యం చూడముచ్చటగా ఉంది. ఈ దృశ్యాలను పర్యాటకులు కెమెరాల్లో బంధించారు. - పాడేరు, ఆంధ్రజ్యోతి

ఘనంగా వెంకటగిరి జాతర

తిరుపతి జిల్లా వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ జాతరకు భక్తజనం భారీగా తరలివచ్చారు. ఆలయం వద్ద వేప మండలతో పందిరి వేసి గురువారం వేకువజామున అమ్మవారి ప్రతిమను కొలువు తీర్చారు. పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. నవ ధాన్య మొలకలను సమర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పోలేరమ్మకు పట్టువస్త్రాలు సమర్పించారు. మధ్యాహ్నం తర్వాత అమ్మవారి విగ్రహాన్ని ఊరేగింపుగా విరూప మండపానికి తీసుకెళ్లారు. మార్గమధ్యలో శివాలయం వద్ద అమ్మవారి ఆభరణాలు తీసేశారు. మండపం వద్ద అమ్మవారి ప్రతిమను విరూపం చేయడంతో జాతర ముగిసింది. విగ్రహం మట్టిని భక్తులు తీసుకెళ్లేందుకు పోటీ పడ్డారు. - వెంకటగిరి, ఆంధ్రజ్యోతి



సీఎంను కలిసిన 'బ్రాండిక్స్' ప్రతినిధులు

అనకాపల్లి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): 'బ్రాండిక్స్' అపెరల్ సంస్థ ప్రతినిధులు గురువారం అమరావతిలో సీఎం చంద్రబాబును కలిశారు. అమెరికా టారిఫ్‌ల వల్ల టెక్స్‌టైల్ రంగం ఎదుర్కోనున్న ఇబ్బందులను ఈ సందర్భంగా సీఎంకు వివరించారు. ఆయన స్పందిస్తూ.. ఈ విషయమై కేంద్ర ఆర్థిక మంత్రితో మాట్లాడి డొమెస్టిక్ మార్కెట్ అవకాశాలు పెంచేందుకు కృషి చేస్తామని అన్నారు. సీఎంను కలిసిన వారిలో బ్రాండిక్స్ ఇండియా ఛైర్మన్ ఒమర్ అష్రాఫ్, మేనేజింగ్ డైరెక్టర్ అసిత్ ప్రేమ్‌రత్నె, డైరెక్టర్ ఒమర్ సాధిక్, డైరెక్టర్, భారతీయ భాగస్వామి పీసీ దొరైస్వామి ఉన్నారు.

14న డిగ్రీ సీట్ల కేటాయింపు

అమరావతి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఇంకా అనేక మంది విద్యార్థులు సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేయాల్సి ఉన్న నేపథ్యంలో డిగ్రీ సీట్లు ఈనెల 14న కేటాయించాలని ఉన్నత విద్యామండలి నిర్ణయించింది. చివరి అవకాశంగా శనివారం వరకు సర్టిఫికెట్ల అప్‌లోడ్‌కు అవకాశం ఇచ్చారు.

సమస్యలపై ఏపీటీఎఫ్ నిరసనలు

ఉద్యోగ, ఉపాధ్యాయుల అపరిష్కృత అంశాలపై ఏపీటీఎఫ్-257 నిరసనలు ప్రారంభించింది. గురువారం రాష్ట్రవ్యాప్తంగా టీచర్లు నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరయ్యారు. శుక్రవారం సాయంత్రం 4గంటలకు అన్ని మండల కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు చేపడతామని ఏపీటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ మంజుల, కె.భానుమూర్తి తెలిపారు.

నకిలీ జాబ్‌కార్డులపై సోషల్ ఆడిట్ తనిఖీలు

రాష్ట్రవ్యాప్తంగా 5400 పైచిలుకు గ్రామ పంచాయతీల్లో 50 వేల నకిలీ జాబ్‌కార్డులు ఉన్నాయన్న సమాచారం మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ.. సోషల్ ఆడిట్ మొదలైంది. ఇందులో భాగంగా మొదటి రోజు గురువారం సుమారు 300 గ్రామ పంచాయతీల్లో జాబ్‌కార్డుల తనిఖీ చేశారు. గ్రామ సభలు నిర్వహించి తనిఖీలు చేస్తున్నారు.

టీటీడీ సభ్యుడిగా సుదర్శన్ వేణుకు మళ్లీ అవకాశం

గతంలో టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యుడిగా పనిచేసిన సుదర్శన్ వేణుకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. ప్రభుత్వం ఇప్పటికే 29 మంది సభ్యులతో ఏర్పాటు చేసిన బోర్డులో సభ్యుడిగా నియమితులైన జస్టిస్ హెచ్‌ఎల్ దత్తు ప్రమాణ స్వీకారం చేయకపోవడంతో.. ఆ స్థానంలో సుదర్శన్ వేణును నియమిస్తూ ఎక్స్ ఆఫిషియో సెక్రటరీ హరిజవహర్ లాల్ గురువారం ఉత్తర్వులిచ్చారు.

సంఘాల గుర్తింపు రద్దు నోటీసుల ఉపసంహరణ

- సీఎం చంద్రబాబుకు ప్రభుత్వ ఉద్యోగ సంఘాల ధన్యవాదాలు

ఉద్యోగ సంఘాలపై గత ప్రభుత్వ అరాచక చర్యలను కూటమి ప్రభుత్వం ఉప సంహరించుకోవడం అభినందనీయమని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ పేర్కొన్నారు. ఇందుకు సీఎంకు, ప్రభుత్వానికి గురువారం ధన్యవాదాలు తెలిపారు. నాడు ఉద్యోగులకు 1వ తేదీన జీతాలు చెల్లించాలని అడిగితేనే అరెస్టు చేసి, చంపేయమన్న రోజులు చూశామని, ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం, ఏపీ వాణిజ్య పన్నుల సర్వీసుల సంఘం గుర్తింపును రద్దు చేస్తామంటూ నోటీసులు ఇచ్చారన్నారు. గవర్నర్‌ను కలవడమే నాటి ప్రభుత్వానికి నేరంగా కనిపించిందని, అయితే కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వ అరాచక నిర్ణయాన్ని ఉపసంహరిస్తూ నిర్ణయం తీసుకుని రాజ్యాంగ హక్కులను కాపాడిందన్నారు.

గౌడ కుల ధ్రువీకరణకు సవరణలు

బీసీల్లో గ్రూప్ బి-సీరియల్ నంబర్ 4లోని ఏ కులానికి సంబంధించి ఆ కులం పేరుతో కుల ధ్రువీకరణ పత్రాలివ్వాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు ఈడిగ, గౌడ(గమ్మళ్ల), కలాలీ, గౌండ్ల, శెట్టిబలిజ, శ్రీశయన(సెగిడి)కులాకు గౌడ అనే పేరు ముందు చేర్చి రెవెన్యూ శాఖ కుల ధ్రువీకరణ పత్రం ఇస్తోంది. ఇకపై గ్రూపు నంబర్ 4లోని కులాల పేరుతో ప్రత్యేకంగా కులధ్రువీకరణ పత్రాలు అందించాలని, గౌడను ముందు చేర్చకుండా సాఫ్ట్‌వేర్‌ను మార్పు చేయాలని సీసీఎల్‌ఏకు సూచిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.

ఉద్యానశాఖలో పోస్టింగ్‌లు

ఉద్యానశాఖలో ఇటీవల డిప్యూటీ డైరెక్టర్లుగా పదోన్నతి పొందిన పలువురికి ప్రభుత్వం పోస్టింగ్‌లు ఇచ్చింది. కమిషనరేట్‌లోని పీఎస్‌వీ లక్ష్మీనారాయణను విజయనగరం జిల్లా మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా, నెల్లూరు ఎంఐపీ పీడీ బి.శ్రీనివాసులును డిప్యుటేషన్‌పై అమరావతి అభివృద్ధి సంస్థకు, ఏపీ ఇరిగేషన్, ప్రస్తుతం లైవ్లీహుడ్ ప్రాజెక్ట్‌లో ఉన్న కె.సజానాయక్‌ను ఏలూరు జిల్లా ఉద్యాన అధికారిగా, పశ్చిమగోదావరి ఉద్యాన అధికారి జి.ప్రభాకర్‌రావును డైరెక్టరేట్‌కు బదిలీ చేసింది. కడప ఏపీఎంఐపీలో ఏడీ వెంకటేశ్వరరెడ్డిని అక్కడే డీడీగా, టెక్కలి ఉద్యానశాఖ ఏడీ చిట్టిబాబును విజయనగరం జిల్లా ఉద్యాన అధికారిగా, తిరుపతి ఏపీఎంఐపీలో ఏడీ సతీష్‌ను కడప జిల్లా ఉద్యాన అధికారిగా నియమించింది.

బీచ్‌శాండ్ అదానీకే!

- మైనింగ్ టెండర్లు ఖరారు చేసిన కూటమి ప్రభుత్వం
- గత జగన్ సర్కారులో అడ్డగోలుగా నిబంధనలు మార్పు
- అదానీకి లబ్ధి కోసమే కొత్తగా డెవలపర్ పాత్ర తెరపైకి

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

బీచ్‌శాండ్ తవ్వకాల టెండర్లను అదానీ గ్రూప్ కంపెనీకి కట్టబెట్టడానికి రంగం సిద్ధమైంది. దీనికి సంబంధించి గత వైసీపీ ప్రభుత్వం పిలిచిన టెండర్లను ఇప్పుడు కూటమి సర్కారు ఖరారు చేసింది. నాడు జగన్ కోరుకున్నట్లుగానే రెండు టెండర్లూ అదానీ కంపెనీకే దక్కాయి. ప్రస్తుతం ఈ ఫైలు ప్రభుత్వానికి చేరింది. విజయవంతమైన బిడ్డర్‌గా అదానీ గ్రూప్ కంపెనీని ప్రకటిస్తూ ఉత్తర్వులు ఇవ్వడమే మిగిలింది. అయితే గతంలో డెవలపర్ విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకించిన కూటమి నేతలు ఇప్పుడు ఆ టెండర్లనే ఖరారు చేయడం ప్రశ్నార్థకంగా మారింది.

జగన్ అలా.. కూటమి ప్రభుత్వం ఇలా!

"వైద్య కళాశాలల ప్రైవేటీకరణ టెండర్లలో పాల్గొనే వారిని హెచ్చరిస్తున్నా.. మేం అధికారంలోకి వచ్చాక కాలేజీలను వెనక్కి తీసుకుంటాం" అని వైసీపీ అధినేత జగన్ ఓవైపు హెచ్చరిస్తున్నారు. మరోవైపు కూటమి ప్రభుత్వం మాత్రం జగన్ హయాంలో పిలిచిన బీచ్‌శాండ్ టెండర్లను ఆ విధానాల ప్రకారమే ఖరారు చేసింది.

ఆది నుంచీ వివాదమే...

గత జగన్ ప్రభుత్వంలో చేపట్టిన అత్యంత వివాదాస్పద టెండర్లలో ఇదొకటి. శ్రీకాకుళం జిల్లా గారలో 909.85 హెక్టార్లు, విశాఖ జిల్లా భీమిలిలో 90.15 హెక్టార్లలో బీచ్‌శాండ్ మినరల్స్ మైనింగ్ కోసం ప్రైవేటు డెవలపర్ ఎంపిక పేరిట 2024 జనవరిలో జగన్ ప్రభుత్వం టెండర్లు పిలిచింది. ఆ సమయంలో ఏపీఎండీసీ ఎండీ, గనుల శాఖ డైరెక్టర్‌గా ఉన్న వి.జి. వెంకటరెడ్డి ప్రభుత్వ పెద్దల సూచనల మేరకు టెండర్ డాక్యుమెంట్ (రిక్వెస్ట్‌ఫర్ ప్రపోజల్-ఆర్‌ఎఫ్‌పీ) తయారుచేశారు. ఈ టెండర్లపై అప్పట్లో పెద్ద దుమారం రేగింది. ఇది కేంద్ర గనుల చట్టానికి వ్యతిరేకమని విమర్శలు వెల్లువెత్తాయి. కేవలం అదానీ కంపెనీలకు లబ్ధి చేకూర్చేలా టెండర్ నిబంధనలు రూపొందించారని, రాష్ట్ర ప్రయోజనాలను పణంగా పెట్టారని తీవ్రఆరోపణలు వచ్చాయి. దీనిపై ప్రజాసంఘాలు,పార్టీలు ఆందోళన వ్యక్తం చేశాయి. హైకోర్టులో కేసు కూడా దాఖలైంది.

తవ్వకాలపై కేంద్రం నిషేధం

బీచ్‌శాండ్ మినరల్స్‌కు ఉన్న ప్రాధాన్యం దృష్ట్యా ప్రైవేటు కంపెనీలు మైనింగ్ చేయడానికి వీల్లేదని కేంద్రం 2019 మార్చి 1న నిషేధం విధించింది. కేంద్ర/ రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలే తవ్వకాలు చేపట్టాలని తేల్చిచెప్పింది. ఈ మేరకు కేంద్ర అణుఇంధన శక్తి విభాగం మార్గదర్శకాలు జారీ చేసింది. ప్రభుత్వ రంగ సంస్థ, ప్రైవేటు సంస్థ కలిసి జాయింట్ వెంచర్‌గా మైనింగ్ చేస్తే... ఏపీఎండీసీకి 76 శాతం, ప్రైవేటు సంస్థకు 24 శాతం చొప్పున వాటా ఉండాలని కేంద్రం స్పష్టం చేసింది. అయితే, అదానీ కంపెనీకి లబ్ధి చేకూర్చాలన్న పెద్దల సూచనలతో డెవలపర్ అనే అంశాన్ని తెరపైకి తీసుకొచ్చారు. అంటే, ప్రాజెక్టు పర్యవేక్షణ ఏపీఎండీసీనే చేస్తుందని, డెవలపర్‌గా ప్రైవేటు సంస్థ ఉంటుందని టెండర్ నిబంధనల్లో చేర్చారు. ఇందుకుగాను ఏపీఎండీసీకి 8 శాతం, డెవలపర్‌గా వ్యవహరించే ప్రైవేటు కంపెనీకి 92శాతం వాటా వెళ్లేలా నిబంధనలు రూపొందించారు. ఈ నిబంధనపై అప్పట్లో జగన్ ప్రభుత్వంలోని న్యాయకమిషన్ ముందు అనేకమంది ప్రశ్నలు లేవనెత్తారు. కంపెనీలకు అనుబంధం కూడా అక్కర్లేదని నిబంధన తీసుకురావడాన్ని తప్పుబట్టారు. కేంద్ర మార్గదర్శకాలకు విరుద్ధంగా టెండర్లు జరుపుతున్నారని, వాటిని అడ్డుకోవాలని ఓ వ్యక్తి హైకోర్టును ఆశ్రయించడంతో న్యాయస్థానం టెండర్లపై స్టే ఇచ్చింది. ఇది నిబంధనలకు విరుద్ధమని కూటమి ప్రభుత్వం కూడా హైకోర్టు ముందు అంగీకరించింది. ఆ తర్వాత ఏం జరిగిందో తెలియదు కానీ, టెండర్లను కొనసాగిస్తామని ప్రభుత్వం హైకోర్టులో పిటిషన్ వేసింది. మరోవైపు నాడు పిటిషన్‌వేసిన వ్యక్తి కూడా వెనక్కి తగ్గారు. దీంతో ఏపీఎండీసీ అధికారులు ఇటీవల టెండర్లను ఖరారుచేశారు. అదానీ గ్రూప్‌నకు చెందిన అల్లూవియల్ హెవీ మినరల్స్ ప్రైవేటు లిమిటెడ్‌కు టెండర్ దక్కించుకుందని అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. డెవలపర్ సంస్థ పేరిట అదానీ కంపెనీకి బీచ్‌శాండ్ వ్యాపారంలో 92 శాతం వాటా, పర్యవేక్షణ బాధ్యతలు నిర్వహించే ఏపీఎండీసీకి 8 శాతం వాటా దక్కనున్నాయి. దీంతో రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా అదానీకి జరగాల్సిన మేలు ఆగదన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

రూల్స్ అంటూ గిరిగీసుకోవద్దు

(మొదటి పేజీ తరువాయి)

మమేకమవ్వండి. మానవీయకోణంలో ఆలోచించి పనిచేయండి. అప్పుడే మీకు, ప్రభుత్వానికి మంచి పేరు వస్తుంది' అని చంద్రబాబు అన్నారు.

ప్రజల ఆకాంక్షలు నెరవేర్చాలి

"నేను 1995లో మొదటిసారి సీఎం అయ్యాను. 30 ఏళ్లలో 15 ఏళ్లు సీఎంగా ఉన్నాను. ఎంతో మంది అధికారులను నియమించాను. చాలామందితో పని చేయించుకున్నాను. అయితే ఈసారి కలెక్టర్లకు పోస్టింగ్‌ల విషయంలో మరింత గట్టి కసరత్తు చేశాను. గతంలో ఎప్పుడూ ఇంత కసరత్తు చేయలేదు. దీనికి కారణం ఉంది. అనేక సమస్యల మధ్య ఏడాది క్రితం మనం పాలన ప్రారంభించాం. ప్రజలు మాపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. వాటిని తీర్చాల్సిన అవసరం ఉంది. ఈ క్రమంలో ఇప్పటికే సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాం. వీటిని మరింత వేగంగా ముందుకు తీసుకువెళ్లాల్సి ఉంది. ప్రభుత్వానికి మంచి పేరు రావాలంటే కలెక్టర్లే కీలకం. మీ పనితీరే ప్రభుత్వానికి విజయాలను తెచ్చి పెడుతుంది. 1995లో తొలిసారి నేను సీఎంగా ఉన్నప్పుడు చాలా దృఢంగా, కఠినంగా ఉండేవాడిని. ఫైళ్ల క్లియరెన్స్ వంటి కార్యక్రమాలతో అధికారులను పరుగులు పెట్టించేవాడిని. ఆ పనితీరు అధికారులకు, ఉద్యోగులకు కొంత కష్టంగా అనిపించినా ప్రగతిలో మార్పు కనిపించింది. అభివృద్ధి వేగవంతమైంది. అదొక్కటే కాదు.. ఎప్పుడు విపత్తు వచ్చినా అధికారుల కంటే ముందు నేనే వెళ్లేవాడిని. విశాఖలో హుద్‌హుద్ సమయంలో ఫ్లైట్ కూడా వెళ్లని పరిస్థితుల్లో చేరుకుని 10 రోజులు అక్కడే ఉన్నాను. ఇలాంటి చర్యల వల్ల ప్రజలకు ఆందోళన పోతుంది. ప్రభుత్వం సాయం చేస్తుందనే నమ్మకం కలుగుతుంది. స్పందించే ప్రభుత్వంగా అంతా గుర్తిస్తారు. అధికారంలో ఉన్నప్పుడు రిస్క్ ఉంటుంది. లీడర్స్ అనే వాళ్లు రిస్క్ తీసుకోవాలి.. అప్పుడే ఫలితాలు వస్తాయి. ఫ్యాక్షన్, నక్సలిజం, మత ఘర్షణల విషయంలో సమర్థులైన అధికారులకు స్వేచ్ఛనిచ్చి పని చేయించాను. దీంతో మంచి ఫలితాలు వచ్చాయి" అని చంద్రబాబు అన్నారు.

మీరే నా టీమ్

"ప్రజల జీవితాల్లో మార్పులు తేవడానికి మంచి అవకాశం కలెక్టర్ ఉద్యోగం. బాగా పని చేస్తే మీకూ మంచి గుర్తింపు వస్తుంది. మీరు క్షేత్రస్థాయిలో బాగా పనిచేస్తే ప్రతి దానిలో మార్పు చూపించవచ్చు. సాంఘిక సంక్షేమ హాస్టల్‌కు వెళ్లి వసతులు చూడండి. ప్రభుత్వ ఆస్తులు రక్షించడంలో మీరే కీలకం. కలెక్టర్లుగా మీరు బాధ్యతగా పారదర్శకంగా ఉంటే, మీ కింది అధికారులు కూడా వాటిని పాటిస్తారు. మీరు వారిలో స్ఫూర్తి నింపాలి. జిల్లా కలెక్టర్ల ఎంపికలో నాకున్న అవకాశాల్లో మీరే బెస్ట్. మీరు అత్యుత్తమ పనితీరు చూపాలి. నాలుగోసారి ముఖ్యమంత్రిగా నా టీమ్ మీరే. పనిచేస్తే ప్రోత్సహిస్తా. ఆశించిన ఫలితాలు రాకపోతే మాత్రం సహించను. పొలిటికల్ గవర్నెన్స్‌కు పెద్దపీట వేయండి. ఎమ్మెల్యేలు, మంత్రులు చెప్పిన దాంట్లో మంచీ చెడూ చూడండి. పొలిటికల్ గవర్నెన్స్ చేసిన సమయంలో నేను ఓడిపోలేదు. ఎక్కువ బ్యూరోక్రటిక్ గవర్నెన్స్ చేసినప్పుడే నష్టపోయాను" అని అన్నారు.

ఇతర జిల్లాలతో పోటీ పడండి

"మీ నిర్ణయాలు క్రియేటివ్‌గా, ఇన్నోవేటివ్‌గా ఉండాలి. కేంద్ర ప్రభుత్వ పథకాలను ఉపయోగించుకోవాలి. ప్రతి దానికి డబ్బులు లేవని కూర్చుంటే పని అవ్వదు. అన్ని రాష్ట్రాల కంటే ఏపీ నంబర్ 1గా ఉండాలని అందరితో పోటీ పడుతుంటా. మీరు కూడా అన్ని జిల్లాల కంటే ముందు ఉండాలని ఇతర జిల్లాలతో పోటీ పడాలి. అసత్యాలు ప్రచారం చేసే మీడియా, సోషల్ మీడియా విషయంలో అప్రమత్తంగా ఉండాలి. ఫస్ట్ అవర్‌లోనే మీరు స్పందించాలి. మనం చేసేది ప్రజల్లోకి వెళ్లాలి. లేకపోతే అసత్యాలే నిజమని ప్రజలు నమ్మే అవకాశం ఉంది. కలెక్టర్ అనేది అధికారం కాదు.. అహంకారం, ఈగోలు వద్దు. కామన్ మ్యాన్‌గా ఉండాలి" అని సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.

అవినీతి ఆరోపణలున్నా బేఖాతరు

- ఐఏఎస్ నియామకం ఆనవాయితీకి తిలోదకాలు
- ఈపీడీసీఎల్ సీఎండీగా సంతోషరావు !
- ఎస్పీడీసీఎల్ సీఎండీగా శ్రీనివాసమూర్తి!

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

విద్యుత్తు పంపిణీ సంస్థల్లో (డిస్కం) అవినీతి ఆరోపణలు ఉన్నవారినే అందలం ఎక్కిస్తున్నారు. వైసీపీ హయాంలో తీవ్రస్థాయిలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న కె.సంతోషరావు ప్రస్తుతం ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీగా ఉన్నారు. 2023 ఏప్రిల్‌లో నియమితులైన ఆయన పదవీకాలం ఈ ఏడాది ఏప్రిల్‌లోనే పూర్తయిపోయినా, తదుపరి ఉత్తర్వులు వరకు అంటూ ఇప్పటికీ కొనసాగిస్తున్నారు. అంతటితో ఆగకుండా డిస్కంల్లో కీలకమైన ఈపీడీసీఎల్ సీఎండీగా ఆయన్ను నియమించేందుకు శరవేగంగా ఫైలు కదులుతోంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నాటి నుంచి ఈపీడీసీఎల్ సీఎండీగా ఐఏఎస్ అధికారులను నియమించడం ఆనవాయితీగా ఉంది. వైసీపీ హయాంలో ఆ ఆనవాయితీని తుంగలో తొక్కారు. 2021లో సంతోషరావును ఈపీడీసీఎల్ సీఎండీగా నియమించారు. ఆ తర్వాత ఎస్పీడీసీఎల్ అదనపు బాధ్యతలు కూడా కట్టబెట్టారు. తీవ్ర ఆరోపణలు రావడంతో 2023 ఏప్రిల్‌లో ఈపీడీసీఎల్ బాధ్యతను ఐఏఎస్ అధికారి పృథ్వీతేజకు కట్టబెట్టి, సంతోషరావును ఎస్పీడీసీఎల్ సీఎండీగా పూర్తిస్థాయిలో నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. గతంలో సంతోషరావుపై తీవ్ర అవినీతి ఆరోపణల్లో.. ఆర్డీఎస్ పనులు 20 శాతం పూర్తి కాకుండానే 50 శాతం పూర్తయినట్లు కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించడం, పొరుగు రాష్ట్రాలతో పోలిస్తే రూ. 75 వేలు అధికంగా చెల్లించి ట్రాన్స్‌ఫార్మర్లు కొనుగోలు చేయడం తదితరాలు ఉన్నాయి. అలాంటి ఆరోపణలు ఎదుర్కొన్న సంతోషరావును తిరిగి ఈపీడీసీఎల్‌కు తీసుకువచ్చేందుకు నియామక ఫైలు చకచకా కదులుతుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మరోవైపు సంతోషరావు స్థానంలో ఎస్పీడీసీఎల్ సీఎండీగా శ్రీనివాసమూర్తిని నియమించేందుకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. గతంలో ఈయనపైనా తీవ్రఅవినీతి ఆరోపణలు వచ్చాయి.

11 మంది ఐఎఫ్‌ఎస్‌ల బదిలీ

అమరావతి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): అటవీశాఖ అనుబంధ విభాగాల్లోని 11 మంది ఐఎఫ్ఎస్ అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. ఈమేరకు బుధవారం అర్ధరాత్రి ఉత్తర్వులు జారీ అయ్యాయి. సీనియర్ ఐఎఫ్ఎస్ అధికారులు... ఏపీ అటవీ అభివృద్ధి సంస్థ(ఎఫ్‌డీసీ) ఎండీ రాజేంద్రప్రసాద్ ఖజూరియాను ఏపీ పర్యావరణ నిర్వహణ సంస్థ ఎండీగా, పీసీసీఎఫ్(విజిలెన్స్ అండ్ అడ్మినిస్ట్రేషన్) ఎస్ఎస్ శ్రీధర్‌ను అటవీ అభివృద్ధి సంస్థ ఎండీగా, అటవీ శాఖ ప్రత్యేక కార్యదర్శి ఎస్ శ్రీశరవణన్‌ను ఏపీ కాలుష్య నియంత్రణ మండలి సభ్య కార్యదర్శిగా నియమించారు. పీసీసీఎఫ్ ఆఫీస్‌లోని సీసీఎఫ్ ఎస్ శ్రీకంఠనాథరెడ్డి ఎఫ్‌డీసీ రాజమండ్రి రీజనల్ మేనేజర్‌గా, రాజమండ్రిలోని ఏపీ ఫారెస్ట్ అకాడమీ డైరెక్టర్ బీ విజయకుమార్ శ్రీశైలం టైగర్ రిజర్వ్ సర్కిల్ ఫీల్డ్ డైరెక్టర్‌గా, ఇక్కడున్న బీవీఏ కృష్ణమూర్తి కర్నూలు సర్కిల్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్‌గా బదిలీ అయ్యారు. ఇందిరాగాంధీ నేషనల్ ఫారెస్ట్ అకాడెమీ(ఐజీఎన్ఎఫ్ఏ)లో శిక్షణ పూర్తి చేసుకుని వచ్చిన ఎం బబిత, తిరుపతి బయో టెక్నాలజీ రీసెర్చ్ సెంటర్‌లోని వృక్షసంపద శాస్త్రవేత్తగా, ఇప్పటి వరకు అక్కడున్న జీజీ నరేంద్రన్ పీసీసీఎఫ్ కేంద్ర కార్యాలయంలో డిప్యూటీ కన్జర్వేటర్(ప్రొడక్షన్)గా బదిలీ అయ్యారు. ఆత్మకూరు ప్రాజెక్ట్ టైగర్ డిప్యూటీ డైరెక్టర్ వీ సాయిబాబాకు తిరుపతి జిల్లా అటవీ అధికారిగా పోస్టింగ్ ఇచ్చి, అక్కడున్న వీ వివేక్‌ను ఎఫ్‌డీసీ నెల్లూరు రీజనల్ మేనేజర్‌గా బదిలీ చేశారు. అనంతపురం జిల్లా అటవీ అధికారి విఘ్నేశ్ అప్పావును ఆత్మకూరు ఎన్ఎస్‌టీఆర్ డిప్యూటీ డైరెక్టర్‌గా నియమించారు.

క్షేమంగా వచ్చేశారు!

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రానికి తీసుకువచ్చారు. గురువారం వరుసగా రెండోరోజున మంత్రి లోకేశ్ సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రానికి చేరుకుని తరలింపు ఏర్పాట్లను పర్యవేక్షించారు. గత రెండు రోజులుగా లోకేశ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి ఢిల్లీలోని ఏపీ భవన్ అధికారులు, కేంద్ర ప్రభుత్వం, నేపాల్ రాయబార కార్యాలయం, రాష్ట్ర మంత్రులు, వివిధ శాఖల ఉన్నతాధికారులతో పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించారు. గురువారం కఠ్మాండూ విమానాశ్రయం నుంచి ఏపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక విమానంలో 144 మంది బయలుదేరారు. "ఇది ఏపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక విమానం. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ చొరవ తీసుకుని దీన్ని ఏర్పాటు చేశారు" అని ఎయిర్ హోస్టెస్ ప్రకటించారు. ఆ వెంటనే ప్రయాణికులంతా... హర్షధ్వానాలతో చంద్రబాబు, లోకేశ్‌కు జేజేలు పలికారు. రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. 'మేం బయలుదేరాం. వస్తున్నాం' అంటూ సెల్ఫీ వీడియోలు తీసి సన్నిహితులకు సమాచారం పంపించారు. ఈ ప్రత్యేక విమానం గురువారం సాయంత్రం 6 గంటలకు విశాఖపట్నం చేరుకుంది. వీరిలో 104 మంది విశాఖలో దిగారు. వీరిలో... విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, తూర్పుగోదావరి, గుంటూరు తదితర జిల్లాలకు చెందినవారు ఉన్నారు.

3 గంటలు ఆలస్యంగా...: విశాఖ ఎయిర్‌పోర్టుకు మధ్యాహ్నం 3గంటలకు రావాల్సిన విమానం సాయంత్రం 6 గంటలకు వచ్చింది. వీరి కోసం కూటమి ప్రజాప్రతినిధులు, అధికారులు 5గంటల నుంచే లాంజ్‌లో కూర్చొని ఎదురుచూశారు. బాధితులకు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, విశాఖ ఎంపీ శ్రీభరత్ తదితర నేతలు, కలెక్టర్ హరేంధిర ప్రసాద్, పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ తదితరులు స్వాగతం పలికారు. తినుబండారాలు, భోజనం ప్యాకెట్లు అందజేశారు. అందరూ క్షేమంగా వచ్చినందుకు హర్షం వ్యక్తంచేశారు. అనంతరం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక వాహనాల్లో అందరినీ స్వస్థలాలకు పంపించారు.

తిరుపతికి 40 మంది

విశాఖ నుంచి అదే విమానం 40 మందితో రాత్రి 10.55 గంటలకు తిరుపతికి చేరుకుంది. వారికి కూటమి ఎమ్మెల్యేలు, అధికారులు వారికి ఘన స్వాగతం పలికారు. శ్రీవారి ప్రసాదాలను, శ్రీకాళహస్తి ప్రసాదాలను అందించారు. రాజంపేట, కోడూరు, కడప, నంద్యాలకు చెందిన వారిని స్వస్థలాల వద్ద విడిచి పెట్టేందుకు ప్రత్యేకంగా బస్సును ఏర్పాటు చేశారు. మిగిలిన వారికోసం 12 కార్లను సిద్ధం చేశారు. కూటమి ప్రభుత్వం సహకారం, ప్రత్యేకంగా మంత్రి లోకేశ్ చొరవ లేకుంటే తాము తిరిగి స్వదేశానికి చేరుకునే వాళ్లం కాదని, ప్రభుత్వానికి రుణపడి ఉంటామని బాధితులు చెప్పారు. ఇక... హెటౌడా నుంచి బస్సులో బయలుదేరిన 22 మంది బిహార్ సరిహద్దు వద్ద మన దేశంలోకి ప్రవేశించారు. సిమికోట్ నుంచి విమానం ద్వారా 12 మందిని భారత సరిహద్దులోని నేపాల్ గంజ్‌కు తరలించారు. వీరంతా వాహనాల్లో తొలుత లఖ్‌నవూకు, అక్కడి నుంచి విమానంలో రాష్ట్రానికి చేరుకున్నారు. నేపాల్ నుంచి చివరి తెలుగు వ్యక్తిని రాష్ట్రానికి తీసుకువచ్చే వరకు ఏపీ భవన్, ఆర్టీజీఎస్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్లను కొనసాగిస్తామని అధికారులు తెలిపారు.



నేపాల్ నుంచి విశాఖ చేరుకుని, విమానాశ్రయంలో లోకేశ్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ప్రవాసాంధ్రులు

12 జిల్లాలకు కొత్త కలెక్టర్లు

(మొదటి పేజీ తరువాయి)

విద్య డైరెక్టర్‌గా ఉన్న కృత్తికా శుక్లాకు, సమాచార పౌరసంబంధాల కమిషనర్ హిమాన్షు శుక్లాకు మరోసారి కలెక్టర్లుగా అవకాశం కల్పించింది. ఇదివరకు కృత్తిక కాకినాడ కలెక్టర్‌గా, హిమాన్షు కోనసీమ కలెక్టర్‌గా పనిచేశారు. అలానే ఎప్పటినుంచో కలెక్టర్‌గా విధులు నిర్వహించాలని కోరుకుంటున్న రాజాబాబును ప్రకాశం జిల్లాకు, ప్రభాకర్‌రెడ్డిని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్‌గా, సిరిని కర్నూలు కలెక్టర్‌గా నియమించింది. రాజాబాబుకు గతంలో కృష్ణా జిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వహించిన అనుభవం ఉంది. అలానే ప్రస్తుతం కలెక్టర్లుగా ఉన్న ఇద్దరు వేరే జిల్లాలకు బదిలీ అయ్యారు. అనంతపురం జిల్లా కలెక్టర్ వి.వినోద్‌కుమార్ బాపట్లకు, ప్రకాశం జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా గుంటూరు జిల్లా కలెక్టర్‌గా నియమితులయ్యారు. పార్వతీపురం మన్యం కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్‌ను శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్‌గా బదిలీ చేసింది. ఈసారి బదిలీల్లో 2016 బ్యాచ్‌లో ముగ్గురికి కలెక్టర్‌గా అవకాశం దక్కింది. ఏపీ ట్రాన్స్‌కో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ కీర్తి చేకూరిని తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్‌గా నియమించారు. పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న ఓ ఆనంద్‌ను అనంతపురం కలెక్టర్‌గా పంపారు. మొత్తంగా 2013 బ్యాచ్‌లో నలుగురికి, 2014 బ్యాచ్‌లో ఒక్కరికి, 2015 బ్యాచ్‌లో నలుగురికి కలెక్టర్లుగా అవకాశం దక్కింది.

ఐఏఎస్	ప్రస్తుత పదవి	జిల్లా
కృతికా శుక్లా	డైరెక్టర్, ఇంటర్ విద్య	పల్నాడు
పి.రాజాబాబు	ఏపీపీఎస్సీ కార్యదర్శి	ప్రకాశం
హిమాన్షు శుక్లా	కమిషనర్, ఐఅండ్‌పీఆర్	నెల్లూరు
ఎస్.ప్రభాకర్‌రెడ్డి	సీసీఎల్‌ఏ సంయుక్త కార్యదర్శి	పార్వతీపురం మన్యం
నిశాంత్ కుమార్	ఎక్సైజ్ శాఖ డైరెక్టర్	అన్నమయ్య
ఎ.సిరి	సెకండరీ హెల్త్ డైరెక్టర్	కర్నూలు
వి.వినోద్‌కుమార్	అనంతపురం కలెక్టర్	బాపట్ల
తమీమ్ అన్సారియా	ప్రకాశం కలెక్టర్	గుంటూరు
ఎస్.రామసుందర్‌రెడ్డి	కమిషనర్, ఆర్అండ్ఆర్ (సీఆర్‌డీఏ)	విజయనగరం
కీర్తి చేకూరి	ట్రాన్స్‌కో జేఎండీ	తూర్పుగోదావరి
ఓ ఆనంద్	వెయిటింగ్	అనంతపురం
ఏ శ్యామ్‌ప్రసాద్	పార్వతీపురం మన్యం కలెక్టర్	శ్రీ సత్యసాయి

30 శాతం మంది మహిళా కలెక్టర్లే

కూటమి ప్రభుత్వం మహిళా అధికారులకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్న విషయం మరోసారి నిరూపితమైంది. కలెక్టర్ల నియామకంలోనూ వారికి పెద్దపీట వేసింది. ప్రస్తుతం 26 జిల్లాల్లో 8 కీలకమైన జిల్లాలకు మహిళలే కలెక్టర్లుగా ఉండడం గమనార్హం. ఇప్పటికే అనకాపల్లి జిల్లా కలెక్టర్‌గా కె.విజయ, ఏలూరు-వెట్రిసెల్వి, పశ్చిమగోదావరి-సి.నాగరాణి, నంద్యాల జిల్లా కలెక్టర్‌గా జి.రాజకుమారి విధులు నిర్వహిస్తున్నారు. గురువారం కొత్తగా మరో ముగ్గురు మహిళా అధికారులు కృత్తికా శుక్లా, ఎ.సిరి, కీర్తి చేకూరిని ప్రభుత్వం నియమించింది. రాజధాని అమరావతి నిర్మాణం మొత్తం గుంటూరు జిల్లా పరిధిలోనే ఉండడంతో ఆ జిల్లా కలెక్టర్‌గా తమీమ్‌ను నియమించింది. పల్నాడు, కర్నూలు, తూర్పుగోదావరి జిల్లాలు కూడా రాజకీయంగా కీలకమైనవే. వాటి కలెక్టర్లుగానూ మహిళలే నియమితులయ్యారు. మరో మహిళా ఐఏఎస్‌ను కలెక్టర్‌గా నియమిస్తే 33 శాతం జిల్లాలకు మహిళలే సర్వాధికారులు అవుతారు.

గ్రామస్థాయిలో బీజేపీని బలోపేతం చేయాలి

» కార్యకర్తలకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ పిలుపు



అనకాపల్లి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): గ్రామస్థాయిలో బీజేపీని బలోపేతం చేసే లక్ష్యంతో పనిచేయాలని కార్యకర్తలకు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పిలుపునిచ్చారు. బీజేపీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా జరుగుతున్న అభివృద్ధిని ప్రజలకు తెలియజేయాలన్నారు. గురువారం అనకాపల్లిలో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మాధవ్ మాట్లాడుతూ కష్టపడిన ప్రతి కార్యకర్తకూ గుర్తింపు ఉంటుందన్నారు. దేశ, రాష్ట్ర అభివృద్ధిలో ప్రధాని మోదీ కృషి అమోఘమని కొనియాడారు. రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత తొలిసారిగా జిల్లాకు వచ్చిన మాధవ్‌కు నాయకులు సాదర స్వాగతం పలికారు.

వైసీపీ విష ప్రచారాన్ని ప్రజలు నమ్మరు: పల్లా

అనంతపురం క్రైం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): 'సూపర్ సిక్స్- సూపర్ హిట్ సభ విజయవంతమైంది. వైసీపీ విష ప్రచారాన్ని ప్రజలు నమ్మరు' అని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. గురువారం ఆయన అనంతపురంలో మాట్లాడుతూ 'జగన్ గత 15 నెలలుగా ఇంట్లో కూర్చుని, ఫేక్ ప్రచారాలతో గడుపుతున్నారు. అనుకూల మీడియాతో సమావేశాలు పెట్టి ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారు. విశాఖ స్టీల్, అమరావతి నిర్మాణం, రాయలసీమ రైతులు, వైద్య కళాశాలల విషయంలో తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు. యూరియాపై కేంద్రంతో మాట్లాడి, రైతులకు ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటాం' అని పేర్కొన్నారు.

పిచ్చోడు జగన్.. మళ్లీ చెలరేగిపోతున్నాడు: అచ్చెన్న

అమరావతి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): 'ఓ పిచ్చోడికి అధికారం ఇస్తే ఏలా ఉంటుందో 2019-24 మధ్య చూశాం. జగన్ రాష్ట్రాన్ని కుక్కలు చింపిన విస్తరిగా మార్చేశాడు' అని మంత్రి అచ్చెన్నాయుడు విమర్శించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'మరోసారి ఆ పిచ్చోడు చెలరేగిపోతున్నాడు. ప్రతిపక్ష హోదా కావాలంటూ డిమాండ్ చేస్తున్నాడు. అది ప్రభుత్వమో, టీడీపీనో ఇచ్చేది కాదు, ప్రజలు ఇచ్చేది. ఈ విషయాన్ని ఆ పిచ్చోడికి అర్థమయ్యేలా చెప్పేవారే వైసీపీలో లేకుండాపోయారు' అని మండిపడ్డారు.

మరో 24,894 టన్నుల యూరియా కేటాయింపు

రాష్ట్రానికి మరో 24,894 టన్నుల యూరియాను కేంద్ర ప్రభుత్వం కేటాయించిందని అచ్చెన్నాయుడు తెలిపారు. ఈనెల 15-22 తేదీల మధ్య విశాఖపట్నం పోర్టుకు యూరియా వస్తుందన్నారు.

జగన్ అంటే అబద్ధాల పుట్ట.. మోసాల్లో దిట్ట: కలిశెట్టి

'జగన్ అంటేనే అబద్ధాల పుట్ట. మోసాల్లో దిట్ట. ఆయన విలేకరుల సమావేశంలో చెప్పిన మాటల్లో ఒక్కటీ నిజం లేదు' అని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు విమర్శించారు. జగన్ నిర్మించిన మెడికల్ కాలేజీలను జనాలు చూసి ఆహా అనడం కాదు... మా ఖర్మరా బాబూ అంటున్నారని విమర్శించారు. కాగా, సభ్యత, సంస్కారం లేకుండా జగన్ వీధి రౌడీలా మాట్లాడుతున్నారని టీడీపీ పొలిట్‌బ్యూరోసభ్యుడు వర్ల రామయ్య అన్నారు.

జగన్‌వి దిగజారుడు వ్యాఖ్యలు: పార్థసారథి, భరత్

అమరావతి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్ సూపర్ హిట్ కావడం సహించలేక సీఎం చంద్రబాబుపై జగన్ అతి జుగుప్సాకరమైన, దిగజారుడు వ్యాఖ్యలు చేశారని రాష్ట్ర పౌరసంబంధాలశాఖ మంత్రి కొలుసు పార్థసారథి మండిపడ్డారు. ఇక అధికారంలోకి రాలేమనే అక్కసుతో జగన్ విమర్శలు చేస్తున్నారని చెప్పారు. జగన్ పత్రికలో రాస్తున్న కథనాల్లో ఏ మాత్రం వాస్తవం లేదన్నారు. కాగా, రాష్ట్రానికి పెట్టుబడిదారులు రాకుండా జగన్ బెదిరిస్తున్నారని మంత్రి టీజీ భరత్ మండిపడ్డారు. వైసీపీ ఎన్ని అడ్డంకులు సృష్టించినా ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగ అవకాశాలను కల్పించి తీరుతామన్నారు. జగన్ పత్రిక, చానల్‌ను బ్లాక్ లిస్ట్ చేస్తే తప్ప రాష్ట్రానికి మంచి జరగదని మంత్రి స్పష్టం చేశారు.

ఇక ప్రాజెక్టులు చకచకా!

గత జగన్ ప్రభుత్వం గాలికొదిలేసిన పెండింగ్ ప్రాజెక్టులకు మళ్లీ మోక్షం లభించనుంది. ఎన్నో ఏళ్లుగా అసంపూర్తిగా వదిలేసిన ప్రధాన ప్రాజెక్టుల పనులు పూర్తి చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. దాదాపు రూ.9 వేల కోట్ల వ్యయంతో ప్రాధాన్య క్రమంలో చేపట్టాలని జల వనరుల శాఖకు సూచించారు. అలాగే మరో రూ.1686 కోట్లతో పూర్తిస్థాయిలో శ్రీశైలం ప్రాజెక్టుకు మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు.

రూ.9074 కోట్ల వ్యయంతో పనులు



జలవనరుల శాఖ సమీక్షా సమావేశంలో సీఎం చంద్రబాబు, మంత్రి నిమ్మల రామానాయుడు, అధికారులు

జల వనరుల శాఖపై చంద్రబాబు సమీక్ష

అమరావతి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ప్రధాన ప్రాజెక్టులను పూర్తి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. కర్నూలు, కడప, ప్రకాశం, పల్నాడు జిల్లాలతో పాటు ఉత్తరాంధ్రలోని ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు జల వనరుల శాఖకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఇందుకోసం రూ.9074 కోట్ల వ్యయం అవుతుందని అంచనా. వీటితోపాటు మరో రూ.1686 కోట్లతో శ్రీశైలం ప్రాజెక్టు రక్షణ చర్యలు వెంటనే చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. గురువారం ఉండవల్లిలోని తన నివాసంలో జలవనరుల శాఖపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో ప్రస్తుతం జలాశయాల్లో ఉన్న నీటి నిల్వలు, నీటి నిర్వహణ, ప్రాజెక్టుల పురోగతి, భూగర్భజలాలు తదితర అంశాలపై సమీక్షించారు. హంద్రీ నీవా సుజల స్రవంతి తరహాలోనే గాలేరు-నగరి సుజల స్రవంతి (జీఎన్ఎస్ఎస్) విస్తరణ పనులను చేపట్టడం ద్వారా కడపకు మంచినీరు ఇచ్చేందుకు కార్యాచరణను సిద్ధం చేయాలని ఆదేశించారు. రూ.1404.35 కోట్లతో జీఎన్ఎస్ఎస్ విస్తరణ పనులు చేపట్టడం ద్వారా 47,000 ఎకరాలకు సాగునీరు అందించవచ్చని జల వనరుల శాఖ నోట్ సమర్పించింది. అలాగే కడపకు తాగు నీరు కూడా సరఫరా చేయవచ్చని ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. గాలేరు-నగరి సుజల స్రవంతి కాలువ విస్తరణను 108 కిలోమీటర్ల మేర పూర్తి చేసి కడపకు నీళ్లివ్వాలని సీఎం సూచించారు. ఈ కాలువ విస్తరణ పనులు నిలిచిన చోట టెండర్లను రద్దు చేసి మళ్లీ కొత్తగా పిలవాలని అధికారులను ఆదేశించారు. టెండర్లను పిలిచిన వెంటనే పనులు చేపట్టాలన్నారు. కర్నూలు జిల్లాలో రూ.1685.71 కోట్లతో ప్రాజెక్టులను పూర్తి చేయడం ద్వారా 90,000 ఎకరాలను స్థిరీకరించవచ్చని అధికారులు వివరించగా.. సీఎం ఆమోదం తెలిపారు.

ప్రకాశం, పల్నాడులోనూ...

ప్రకాశం జిల్లాలోని పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టును రూ.2059.20 కోట్లతో పూర్తిచేయడం ద్వారా 1,09,500 ఎకరాలకు నీరందించే వీలుందని అధికారులు తెలిపారు. ఇందులో ప్యాకేజీ-2 కోసం రూ.247కోట్లు, ప్యాకేజీ-4 కోసం రూ.184కోట్లు, ప్యాకేజీ-5 కోసం రూ.142 కోట్లు, డైవర్షన్ రోడ్డు కోసం రూ.29 కోట్లు వ్యయం అవుతుందని వివరించారు. ఫీడర్ కెనాల్ లైనింగ్, రిటైనింగ్ వాల్ కోసం రూ.456 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. భూసేకరణ, సహాయ పునరావాసం కోసం రూ.1002 కోట్ల మేర చెల్లింపులు చేయాల్సి ఉందని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఇందుకు సీఎం సుముఖత వ్యక్తం చేశారు. పల్నాడు జిల్లాలో వరికెపూడిసెల మొదటి దశ పనులు చేపట్టాలని జల వనరుల శాఖను సీఎం ఆదేశించారు. ఈ పనులు పూర్తి చేయడం ద్వారా 24,900 ఎకరాలకు సాగు నీరు అందించాలని అన్నారు.

ప్రాజెక్టుల్లో 89 శాతం నీళ్లు

రాష్ట్రంలోని మొత్తం జలాశయాల్లో 1313 టీఎంసీలకు గాను 1031 టీఎంసీల నిల్వలున్నాయని చంద్రబాబు చెప్పారు. రాష్ట్రంలో 38,457 చెరువులను నింపే ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు.

శ్రీశైలం ప్రాజెక్టుకు రక్షణ చర్యలు

శ్రీశైలం జలాశయానికి పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టేందుకు రూ.1686 కోట్లు వ్యయం అవుతుందని జల వనరుల శాఖ అంచనా వేసింది. ఇందులో ప్రధానంగా ఎస్కేప్ చానల్ పునరుద్ధరణ పనుల కోసం రూ.1480 కోట్లు వ్యయం అవుతుందని ముఖ్యమంత్రి దృష్టికి అధికారులు తీసుకువచ్చారు. డ్యామ్‌పై అప్రోచ్ రోడ్ నిర్మాణం కోసం రూ.25.50 కోట్లు వ్యయం అవుతుందని పేర్కొన్నారు. యాప్రాన్, సిలెండర్ల పునరుద్ధరణకు రూ.74 కోట్లు, స్పిల్‌వే రక్షణ పనులకు రూ.99.49 కోట్లు వ్యయం అవుతుందని వివరించారు. శ్రీశైలం ప్రాజెక్టు రక్షణ చర్యలు వెంటనే చేపట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

సమర్థంగా నీటి యాజమాన్య నిర్వహణ

సమర్థ యాజమాన్య నిర్వహణతోనే నీటి భద్రత ఉంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. భూగర్భ జలాల నమోదు కోసం మూడు నెలల్లో కొత్త సెన్సార్లను ఏర్పాటు చేయాలని సూచించారు. రాష్ట్రంలో ఎక్కడా నీటి ఎద్దడి తలెత్తకుండా కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. గతేడాది ఇదే తేదీతో పోల్చుకుంటే ఈసారి వర్షపాతం తక్కువగా ఉన్నా ఎక్కడా నీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టామని సంతృప్తి వ్యక్తం చేశారు. ఇదంతా సమర్థ నీటి యాజమాన్య నిర్వహణ వల్లే సాధ్యమైందని జల వనరుల శాఖను సీఎం అభినందించారు. సమావేశంలో జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్, సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, ఇంజనీర్ ఇన్ చీఫ్ నరసింహమూర్తి పాల్గొన్నారు.

రెండేళ్లలో 'ఉత్తరాంధ్ర'

పోలవరం ఎడమ కాలువతో పాటు ఉత్తరాంధ్ర సుజల స్రవంతిని రెండేళ్లలో పూర్తి చేయాలని చంద్రబాబు ఆదేశించారు. ఇందుకోసం రెండేళ్లలో వరుసగా వెయ్యి కోట్ల రూపాయల చొప్పున నిధులిస్తామని వెల్లడించారు. వంశధార, నాగావళి, చంపావతి అనుసంధానం చేస్తూ ఈ ప్రాంతంలోని అన్ని రిజర్వాయర్లు నింపడం ద్వారా ఉత్తరాంధ్రలో వాటర్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయాలని జలవనరుల శాఖకు దిశానిర్దేశం చేశారు. ఉత్తరాంధ్రలో అత్యంత ముఖ్యమైన బీఆర్ఆర్ వంశధార ప్రాజెక్టు రెండో దశలోని స్టేజ్-2 ప్రాజెక్టు కోసం రూ.170 కోట్లు వ్యయం చేస్తే కొత్తగా 20,000 ఎకరాల ఆయకట్టు వస్తుందని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. రూ.1368 కోట్లతో ఉత్తరాంధ్రలో పెండింగ్‌లో ఉన్న ఇతర ప్రాజెక్టులను పూర్తి చేయడం ద్వారా 1,24,639 ఎకరాలు ఆయకట్టులోకి వస్తాయని అధికారులు వివరించారు.

పెరిగిన భూగర్భ జలాలు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో గతేడాది కన్నా ఈ ఏడాది భూగర్భ జలాలు మెరుగ్గా ఉన్నాయి. నీటి లభ్యత పెరిగింది. ప్రజలు వినియోగించదగిన భూగర్భ జలాలు 697.52 టీఎంసీలు అందుబాటులో ఉన్నాయి. ఈ మొత్తం రాష్ట్రంలోని కృష్ణానదిపై ఉన్న ప్రాజెక్టుల్లో ప్రస్తుతమున్న నీటి నిల్వ (654.25 టీఎంసీలు) కన్నా అధికం. ఈ ఏడాది ఆలస్యంగానైనా వర్షాలు విస్తారంగా కురవడం, కృష్ణా, గోదావరి, తుంగభద్ర నదులకు వరదలు రావడం తదితర కారణాలు భూగర్భ జలాలపై ప్రభావం చూపాయని నిపుణులు చెప్తున్నారు. సెప్టెంబరు 1 నాటికి కోస్తాంధ్ర ప్రాంతంలో 468.44 టీఎంసీలు, రాయలసీమ ప్రాంతంలో 229.10 టీఎంసీల నీరు ఉంది. రాష్ట్రవ్యాప్తంగా సగటున 3 మీటర్ల లోతులో 30.22%, 3-8 మీటర్ల లోతులో 34.71%, 8-20 మీటర్ల లోతులో 25.73%, 20 మీటర్ల కన్నా ఎక్కువ లోతులో 9.33% భూగర్భ జలాలు ఉన్నట్లు ఏపీ వాటర్ రిసోర్సెస్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్(ఏపీ వ్రిమ్స్) అంచనా వేసింది. అత్యధికంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో 50.94 టీఎంసీలు, అతి తక్కువగా విశాఖపట్నం జిల్లాలో 2.87 టీఎంసీల నీరు ఉన్నట్లు ఏపీ వ్రిమ్స్ పోర్టల్‌లో నమోదు చేసింది.

ఎత్తిపోతలపై జగన్ నిర్లక్ష్యం: నిమ్మల

అమరావతి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 1008 ఎత్తిపోతల ప్రాజెక్టులుంటే గత ప్రభుత్వం వాటిని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు. ఇప్పుడు వీటి మరమ్మతులకు దాదాపు రూ.725 కోట్ల మేర అవసరమవుతాయని అంచనా వేసినట్లు తెలిపారు. ఈ పనులకు టెండర్లు పిలిచే ప్రక్రియ మొదలైందన్నారు. గురువారం వెలగపూడి సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో చేపట్టిన నీటి నిర్వహణ సత్ఫలితాలిచ్చిందన్నారు. ఎగువ నుంచి వచ్చిన వరదను ఒడిసి పట్టామని.. చంద్రబాబు దూరదృష్టి.. ముందడుగు వల్లే రాష్ట్రంలో జలాశయాలన్నీ నిండాయని చెప్పారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది వర్షాలు తక్కువగానే ఉన్నా.. ఎగువనుంచి వచ్చిన వరదను రాయలసీమ, కృష్ణా, గుంటూరు జిల్లాలకు తరలించామని.. కృష్ణా జలాలను హంద్రీ-నీవా నుంచి కుప్పం దాకా తీసుకెళ్లామని వెల్లడించారు.

దేశంలోనే తొలి క్వాంటమ్ రిఫరెన్స్ ఫెసిలిటీ సెంటర్

అమరావతి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): దేశంలోనే మొట్టమొదటి క్వాంటమ్ రిఫరెన్స్ ఫెసిలిటీ సెంటర్‌ను ఏపీలో ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. క్వాంటమ్ కంప్యూటింగ్ రంగానికి అమరావతి క్వాంటమ్ వ్యాలీ కేంద్రంగా మారుతుందన్నారు. సచివాలయంలో.. స్టార్టప్‌లు, విద్యా, పరిశోధనా సంస్థలు, క్వాంటమ్ కంప్యూటింగ్, ఐటీ రంగ నిపుణులతో చంద్రబాబు గురువారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమరావతిలో ఏర్పాటు చేయనున్న క్వాంటమ్ వ్యాలీలో రూ.40 కోట్ల అంచనా వ్యయంతో క్వాంటమ్ రిఫరెన్స్ ఫెసిలిటీని ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఈ ఫెసిలిటీ సెంటర్‌లో క్వాంటమ్ విడిభాగాల పరీక్ష, బెంచ్ మార్కింగ్, వర్గీకరించడం వంటి పనులు నిర్వహిస్తారని ఐటీ నిపుణులు సీఎంకు వెల్లడించారు.

'కిక్కు'లో జగన్ పీఏ!

అక్రమాస్తులకు నమ్మకమైన బినామీ..

తండ్రి అధికారాన్ని అడ్డుపెట్టుకొని దోచుకున్న జగన్, లెక్కలేనన్ని సూట్ కేసు కంపెనీలు అప్పట్లో సృష్టించారు. ఆనాడు విజయసాయి రెడ్డి తర్వాత వినిపించిన పేరు సునీల్ రెడ్డిదే. వైఎస్ హయాంలో జగన్ దోపిడీపై 11కేసులు నమోదు చేసి మూలాలు వెలికి తీసిన సీబీఐ.. ఎమ్మార్ ప్రాపర్టీర్ కుంభకోణంలో సునీల్ పాత్రను గుర్తించింది. రికార్డుల్లో ఐదు వేల రూపాయల గజం ధర చూపించి నగదు రూపంలో యాభై వేలు తీసుకుని సుమారు 134కోట్ల రూపాయలు దారి మళ్లించినట్లు ఆధారాలు సేకరించింది. దీంతో ఆ కేసులో సునీల్ రెడ్డిని నిందితుడిగా చేర్చి చంచల్ గూడ జైలుకు తరలించింది.

(మొదటి పేజీ తరువాయి)

సిట్ అధికారులు తేల్చారు. ఇప్పుడు... ఈ కేసులో స్వయానా జగన్ పీఏ సునీల్ రెడ్డి పాత్రపై దృష్టి సారించారు.

పీఏకు పలు కంపెనీలు

నర్రెడ్డి సునీల్ రెడ్డి... జగన్ సతీమణి భారతికి బంధువు. అక్రమాస్తుల కేసులో జగన్‌తోపాటు సునీల్ కూడా చంచల్‌గూడ జైలులో ఉన్నారు. కడప జిల్లాకు చెందిన నర్రెడ్డి సునీల్ రెడ్డి పేరుతో రెండు తెలుగు రాష్ట్రాల్లో పదికి పైగా కంపెనీలు ఏర్పాటయ్యాయి. ఆ కంపెనీల లావాదేవీలపై ఆరా తీసిన సిట్ అధికారులు, తాము సేకరించిన సమాచారంతో పాటు ఇప్పటికే విచారణలో లభ్యమైన ఆధారాలు పరిశీలించుకుని వాటిలో సోదాలకు దిగారు. గతంలో చంచల్‌గూడలో జగన్‌కు సునీల్‌రెడ్డి జైల్‌మేట్. జగన్ సతీమణి వైఎస్ భారతికి బంధువు. ఆయన కంపెనీలపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) గురువారం పెద్దఎత్తున దాడులు జరిపింది. హైదరాబాద్‌లోని ఎనిమిది, విశాఖలోని రెండు చోట్ల సిట్ అధికారులు విస్తృతంగా సోదాలు జరిపారు. హైదరాబాద్‌లోని బంజారా హిల్స్ రోడ్ నం. 2లోని సాగర్ సొసైటీ, రోడ్ నం. 3లోని స్నేహహౌస్ సహా రెండుచోట్ల.. రాజేంద్రనగర్‌లోని కాటేదాన్, ఖైరతాబాద్‌లోని కమలాపురి కాలనీల్లో ఒక్కోచోట కలిపి మొత్తం నాలుగు అడ్రస్‌లలో ఉన్న ఎనిమిది కంపెనీల్లో సిట్ బృందాలు సోదాలు జరిపారు.

విశాఖలో.. విశాఖపట్నంలో సునీల్‌రెడ్డికి చెందిన రెండు కంపెనీల కార్యకలాపాలకు సంబంధించిన రికార్డులు సిట్ బృందాలు పరిశీలించాయి. హార్బర్ పార్క్ రోడ్డులో రామకృష్ణ మఠం ఎదురుగా గల 'ఆకాశం' భవనంలోని మూడో అంతస్తులో (డోర్ నంబర్7-8-22) నర్రెడ్డి సునీల్‌రెడ్డికి 'వెర్ట్‌లైఫ్ బంకర్స్ ప్రైవేటు లిమిటెడ్', 'గ్రీన్‌ఫీల్డ్స్' పేరుతో ఈ కార్యాలయాలు ఉన్నాయి. అదనపు ఎస్పీ స్థాయి అధికారి ఆధ్వర్యంలో విజయవాడ నుంచి వచ్చిన సిట్ బృందం ఉదయం 11 గంటల సమయంలో అక్కడకు వెళ్లి సోదాలు ప్రారంభించాయి. సోదాల సమయంలో మీడియాతోపాటు ఇతరులెవరినీ లోపలకు అనుమతించలేదు. రాత్రి 7.30 గంటల సమయంలో ఏపీ ఫోరెన్సిక్ ల్యాబ్ లోగో కలిగిన వ్యక్తి ఒకరు బ్రీఫ్ కేస్ పట్టుకుని ఆ భవనంలోకి వెళ్లారు. దీంతో కీలక పత్రాలను సిట్ అధికారులు గుర్తించారని, వాటిలో సంతకాలు లేదా ఇతర వివరాలను నిర్ధారించుకోవడానికే ఫోరెన్సిక్ నిపుణుడిని రప్పించి ఉంటారని ప్రచారం జరుగుతోంది. సునీల్‌రెడ్డి ఈ కార్యాలయాలను 2019లో ప్రారంభించినట్టు కొందరు చెబుతున్నారు. రాత్రి 9.30 గంటలకు కూడా సోదాలు కొనసాగుతున్నాయి. సోదాలకు సంబంధించిన పూర్తివివరాలు తెలియడం లేదు. మద్యం కుంభకోణంలో ఉత్తరాంధ్రలో నాడు కీలకంగా వ్యవహరించిన ఒక మంత్రి బంధువు పాత్ర కూడా ఉన్నట్టు సిట్ అధికారులు ఇప్పటికే గుర్తించినట్టు ప్రచారం జరుగుతోంది. ఇక్కడ సోదాలు ముగిసిన తర్వాత సిట్ అధికారులు సదరు మాజీ మంత్రి బంధువు ఇంట్లో సోదాలు నిర్వహించే అవకాశం లేకపోలేదని పోలీసులు చెబుతున్నారు. హైదరాబాద్, విశాఖలోని కంపెనీలన్నీ ప్రైవేట్ లిమిటెడ్, ఎల్ఎల్‌పీ, ఫౌండేషన్ హోదాల్లో కార్యకలాపాలు సాగిస్తున్నట్లు సిట్ సోదాల్లో తేలింది. ఈ కంపెనీల కార్యాలయాల నుంచి హార్డ్ డిస్క్‌లు, కీలక పత్రాలు, కంప్యూటర్లలోని డేటా సిట్ అధికారులు సేకరించారు. ఈ కంపెనీలకు ఆడిటర్‌గా ఉన్న వ్యక్తిని పిలిపించి సిట్ విచారించనున్నట్టు సమాచారం.



జగన్‌తో సునీల్ రెడ్డి(ఫైల్)

పొరుగు రాష్ట్రాల్లో రియల్ ఎస్టేట్.. విదేశాల్లో మైనింగ్...

పన్నెండేళ్ల క్రితం జగన్‌తో పాటు అక్రమాస్తుల కేసులో (ఎమ్మార్ ప్రాపర్టీస్) సీబీఐ అధికారులు సునీల్ రెడ్డిని చంచల్ గూడ జైలుకు తరలించారు. కోనేరు ప్రసాద్ నుంచి తీసుకున్న డబ్బులు ఇతను జగన్‌కు చేర్చినట్లు అప్పట్లో సీబీఐ రిమాండ్ రిపోర్టులో కోర్టుకు తెలిపింది. అప్పటికే అరెస్టయి ఒంటరిగా జైలు గదిలో ఉన్న జగన్‌కు సేవలు చేసేందుకు సునీల్‌ను అక్కడ ఉంచాలని అప్పట్లో అక్రమాస్తులు కేసు వాదించిన లాయర్లు సీబీఐ కోర్టులో పిటిషన్ వేశారు. దీంతో చాలాకాలంపాటు జగన్‌కు సునీల్ జైల్‌మేట్‌గా ఉన్నారు. జగన్‌కు బెయిల్ వచ్చే వరకూ కనీసం బెయిల్ పిటిషన్ కూడా వేయకుండా జైల్లోనే గడిపిన సునీల్ రెడ్డి విశ్వాసం జగన్‌ను మెప్పించింది. దీంతో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పది కంపెనీలకు ఆయనను యజమానిని చేసినట్లు సిట్ వర్గాలు ఆధారాలు సేకరించాయి. ఏపీలో మందుబాబుల రక్తాన్ని పీల్చి దోచుకున్న వేల కోట్ల రూపాయల మనీ రూటింగ్‌లో ఈ కంపెనీలను ఉపయోగించినట్లు సమాచారం. మన రాష్ట్రంతో పాటు పొరుగు రాష్ట్రాలైన తెలంగాణ, కర్ణాటకల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారాలతోపాటు ఇతర దేశాల్లో మైనింగ్‌లో పెట్టుబడులు పెట్టినట్లు ఇప్పటికే సమాచారాన్ని సేకరించిన సిట్ సేకరించింది. ఎన్నికల సమయంలో అభ్యర్థులకు పంచేందుకు తరలించిన డబ్బుల వివరాలు రాబట్టింది. అయితే తాజాగా సునీల్ రెడ్డి డైరెక్టర్‌గా ఉన్న కంపెనీల్లో సోదాలు జరిపింది.



విశాఖలో సునీల్‌రెడ్డికి చెందిన 'వెర్ట్‌లైఫ్ బంకర్స్ ప్రైవేటు లిమిటెడ్' కార్యాలయం..

చిరుద్యోగిగా మొదలై..

కడప జిల్లా వీరపునాయుని పల్లె మండలంలోని చిన్న గ్రామం అనిమెలకు చెందిన నర్రెడ్డి సునీల్ రెడ్డి కుటుంబం నాలుగు దశాబ్దాల క్రితం పులివెందులకు వలస వెళ్లింది. సునీల్ రెడ్డికి ఏదైనా ఉద్యోగం ఇప్పించమంటూ వైఎస్ రాజశేఖర్ రెడ్డి బావ సీపీ సుబ్బారెడ్డిని ఆయన తండ్రి సింగిరెడ్డి కోరారు. వైఎస్ సిఫారసుతో జగన్ కంపెనీల్లో సునీల్ చిరుద్యోగిగా చేరారు. అయితే, అక్కడ సునీల్ చురుకుదనాన్ని ప్రదర్శించి అనతి కాలంలోనే జగన్‌కు వ్యక్తిగత సహాయకుడిగా మారారు. జగన్ జైలుకు వెళ్లడానికి ముందు రోజు వరకూ ఆయన ఫోన్ సునీల్ వద్దే ఉండేది. ఏదైనా వస్తే జగన్‌కు అందించేవారు. ఎవరితోనైనా ఫోన్ మాట్లాడాలంటే కలిపించేవారు. కానీ కంపెనీలు పెట్టి వ్యాపారాలు చేసే ఆర్థిక స్థితిమంతుడు మాత్రం కాదు.

రెండు జే బ్రాండ్లు సునీల్‌వే.?

వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్ల పాటు రాష్ట్రంలో మద్యం సేవించే వారికి సరఫరా చేసిన జే బ్రాండ్లలో రెండు ఉత్పత్తులు సునీల్ రెడ్డివేనని సిట్ గుర్తించినట్లు సమాచారం. జగన్ సీఎం అయ్యాక ఎక్కువగా హైదరాబాద్‌లోనే ఉంటూ లిక్కర్ వ్యవహారాలను సునీల్ చక్కబెట్టారు. పనిలో పనిగా ఆయన ఏపీలో రెండు మద్యం బ్రాండ్లను ప్రవేశపెట్టి భారీగానే వెనకేసుకున్నట్లు సిట్‌కు ఉప్పందింది. టెక్నాలజీ సాయంతో లోతుగా ఆరా తీయడంతో డొల్ల కంపెనీల బాగోతం బయటపడింది. ముడుపుల సొమ్ము హైదరాబాద్‌లో తీసుకుని హవాలా రూపంలో విదేశాలకు తరలించి తిరిగి అదే సొమ్ము తెల్ల డబ్బుగా ఈయన కంపెనీల నుంచి పెట్టుబడుల రూపంలో వస్తున్నట్లు సమాచారం. తాజాగా సిట్ జరిపిన సోదాల్లో అత్యంత కీలక సమాచారం లభించినట్లు తెలుస్తోంది.

రాధాకృష్ణన్‌కు ఓటేసి..

వైఎస్ ఛాతీలో కత్తి దింపారు: షర్మిల

అమరావతి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): 'ఎన్‌డీఏ ఉపరాష్ట్రపతి అభ్యర్థి రాధాకృష్ణన్‌కు ఓటేయడం ద్వారా వైఎస్ఆర్ ఛాతిలో కత్తితో పొడిచిన వ్యక్తిగా జగన్ మిగిలిపోతారు' అని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల వ్యాఖ్యానించారు. గురువారం విజయవాడలో ఆమె మీడియాతో మాట్లాడారు. 'నా తండ్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి బతికుంటే... కొడుకు జగన్ చేసిన పనికి సిగ్గుతో తలదించుకునేవారు. నా కుమారుడు రాజారెడ్డిని చంద్రబాబు రాజకీయాల్లోకి తెస్తే... ఎవరు చెప్పారని ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో రాధాకృష్ణన్‌కు ఓటేశారు? చంద్రబాబు చెబితే రాజకీయాల్లోకి వచ్చానంటూ నా కుమారుడు చెప్పినట్లుగా వైసీపీ నేతలు మార్ఫింగ్ చేశారు. నా కొడుకు రాజారెడ్డిని చూస్తే భయం ఎందుకు జగన్..? నా కుమారుడికి రాజారెడ్డి అని వైఎస్ పేరు పెట్టారు. వైసీపీ సైతాన్ సైన్యం ఎంత అరచి గోల పెట్టినా నా కొడుకు వైఎస్ రాజారెడ్డే. ఎన్ని కుక్కలు మొరిగినా నా కుమారుడు వైఎస్ వారసుడే. వైఎస్ జీవితకాలం బీజేపీని వ్యతిరేకించారు. జగన్ సుదర్శన్‌రెడ్డికి ఎందుకు మద్దతివ్వలేదు? జగన్, మోదీకి దత్తపుత్రుడు. వైఎస్ మరణం వెనుక రిలయన్స్ హస్తం ఉందని చెప్పిన జగన్... అదే రిలయన్స్ వాళ్లకు రాజ్యసభ సీటు ఎలా ఇచ్చారు? టీడీపీ, జనసేన... బీజేపీతో బహిరంగ పొత్తు పెట్టుకుంటే... జగన్ రహస్య పొత్తు పెట్టుకున్నారు. జగన్ ఒక రాజకీయ వ్యభిచారి. కూటమి వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేస్తే వ్యతిరేకంగా పోరాటాలు చేస్తాం. సూపర్ సిక్స్ సూపర్ ఫ్లాప్ అయ్యింది' అని వ్యాఖ్యానించారు.

'మద్యం' నిందితుల బెయిల్ రద్దు పిటిషన్లపై

లోతైన విచారణ అవసరం

- రాతపూర్వక వాదనలను ఇవ్వండి
- సమర్థించే తీర్పులనూ జతచేయండి
- సీఐడీ, నిందితులకు హైకోర్టు ఆదేశాలు
- తదుపరి విచారణ 17కు వాయిదా

అమరావతి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం కేసులో నిందితులు ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, బాలాజీ గోవిందనప్పలకు డీఫాల్ట్ బెయిల్ మంజూరు చేస్తూ ఏసీబీ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలని కోరుతూ సీఐడీ దాఖలు చేసిన పిటిషన్ల పై లోతైన విచారణ అవసరమని హైకోర్టు అభిప్రాయపడింది. వాదనలను రాతపూర్వకంగా కూడా అందజేయాలని ఇరువర్గాలకు సూచించింది. వాదనలను బలపర్చే తీర్పులను కూడా జత చేయాలని స్పష్టం చేసింది. విచారణను సెప్టెంబరు 17కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి గురువారం ఉత్తర్వులు ఇచ్చారు. సిట్ దాఖలు చేసిన చార్జిషీట్, సప్లమెంటరీ చార్జిషీట్ అసంపూర్తిగా ఉన్నాయనే కారణంతో నిందితులకు ఏసీబీ కోర్టు ఈ నెల 6న పొరపాటున డీఫాల్ట్ బెయిల్ మంజూరు చేసిందని, ఆ ఉత్తర్వులను రద్దు చేయాలని కోరుతూ సీఐడీ హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేసింది. అలాగే ఇదే కేసులో నిందితుడు బూనేటి చాణిక్య(ఏ8) వేసిన డీఫాల్ట్ బెయిల్ పిటిషన్ పై విచారణ జరపకుండా ఏసీబీ కోర్టును నిలువరించాలంటూ హైకోర్టులోనే మరో పిటిషన్ వేసింది. ఈ వ్యాజ్యాలపై ఇటీవల విచారణ జరిపిన న్యాయమూర్తి... సీఐడీ దాఖలు చేసిన చార్జిషీట్ల పై ఆగస్టు 23న పలు అభ్యంతరాలను లేవనెత్తుతూ ఏసీబీ కోర్టు ఇచ్చిన ఆఫీస్ మెమోరాండంతో పాటు బెయిల్ ఉత్తర్వుల్లో ప్రస్తావించిన పలు అంశాలపై స్టే విధించారు. నిందితులకు నోటీసులు జారీ చేశారు. గురువారం పిటిషన్లు మరోసారి విచారణకు రాగా, సీఐడీ తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా వాదనలు వినిపించారు. నిందితులందరికీ నోటీసులు అందజేశామని, ట్రయల్ కోర్టు డాకెట్ ఉత్తర్వులను ఫైల్ చేస్తున్నామని కోర్టుకు తెలిపారు. నిందితుల తరఫున సీనియర్ న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపించారు. బూనేటి చాణిక్య తరఫున సీనియర్ న్యాయవాది ఓ.మనోహర్‌రెడ్డి వాదనలు వినిపించారు. చాణిక్య పిటిషన్‌ను వేరుగా విచారించాలని కోరారు. ఇరువైపుల వాదనలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి... రాతపూర్వక వాదనలు కూడా సమర్పించాలని సీఐడీ, నిందితుల తరఫు న్యాయవాదులను ఆదేశించారు.

జైల్లో లొంగిపోయిన మిథున్‌రెడ్డి



జైల్లోకి వెళ్తూ మిథున్‌రెడ్డి అభివాదం

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం కేసులో నిందితుడైన వైసీపీ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి గురువారం రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో లొంగిపోయారు. రిమాండు ఖైదీగా ఉన్న ఆయనకు ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోడానికి వీలుగా ఈ నెల 6న కోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. కోర్టు ఆదేశాల ప్రకారం తిరిగి గురువారం సాయంత్రం 4.30 గంటలకు ఆయన జైలు సూపరింటెండెంట్ ఎదుట లొంగిపోయారు. అంతకుముందు సుమారు 25 కార్ల కాన్వాయ్‌తో జైలు బయట ఉన్న ఓ ప్రైవేటు హోటల్ వద్ద చేరుకొని ఘనంగా పుట్టినరోజు వేడుకలు జరుపుకొన్నారు. వైసీపీ నాయకులు పూలబొకేలు అందజేసి, పూలు చల్లి శుభాకాంక్షలు తెలిపారు. పండితులు వేదాశీర్వచనం అందించారు. దీంతో జైలు బయట రోడ్డుపై ట్రాఫిక్ స్తంభించింది. ఆస్పత్రికి రోగిని తీసుకెళుతున్న అంబులెన్స్ ఆ ట్రాఫిక్‌లో చిక్కుకుపోయింది. దీనిపై జనం మండిపడ్డారు.

*Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : N.Rahul Kumar,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.*